UNIVERSAL LIBRARY
OU_204270
UNIVERSAL LIBRARY

OUP—391·· 29-4-72—10,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T 83.1 Accession No. T 2759

Author S41 ch

Title

This book should be returned on or before the date last marked below.

# శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

అయిదో సంపుటం

కథలు

వడ్లగింజలు.

ప్రకాశకులు

కళాభివర్ధనీ పరిషత్తు

రాజమహేంద్రవరం

మొదటికూర్పు ౧౯౬౨ సార్వరి

అన్ని హక్కులూ
గ్రంథకర్తవి

ముద్రణం
సుజనరంజనీ ముద్రాశాల
రాజమహేంద్రవరం

# ప్రధాన పోషకులు

దివాన్ బహద్దరు

మరిశేటి శేషగిరిరావు పంతులుగారు

బి ఎ., బి. ఎల్

కాకినాడ

# మహారాజ పోషకులు

కళాప్రపూర్ణ, సాహిత్యసమ్రాట్టు

మహారాజా శ్రీశ్రీశ్రీ శ్రీవిక్రమదేవవర్మగారు డి. లిట్

జయపురం

# పోషకులు

మ॥ రా॥ శ్రీ తూములూరి శివరామయ్యపంతులుగారు

బి. ఏ., బి. ఎల్., హైకోర్టు అడ్వకేటు నెల్లూరు

" వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిగారు

ప్రొప్రయిటరు : వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు మదరాసు

" ద్వారంపూడి రామారెడ్డిగారు

భూస్వాములు అనపర్తి

" ఏడిద వేంకటరావు పంతులుగారు

భూస్వాములు రామచంద్రపురం

" ద్వారంపూడి వేంకటరెడ్డిగారు

భూస్వాములు అనపర్తి

" బెజవాడ రామచంద్రారెడ్డిగారు

బి.ఏ.,సి.బి.ఇ. భూస్వాములు బుచ్చిరెడ్డిపాలెం

" రేబాల పట్టాభిరామారెడ్డిగారు

జమీందారు నెల్లూరు

" పుష్పాల శ్రీరామమూర్తిగారు

మిల్లు ఓనరు అనకాపల్లి

శ్రీ॥ సబ్బెళ్ళ పద్దయ్యగారు

కొంకుదురు

" కర్రి చిన వేంకటరెడ్డిగారు

రంగూన్

" చిట్టి నారాయణమూర్తిగారు

తెణుకు

# మహారాజ పోషకులు
# పోషకులు

"నిందవలన జనులలో నుండు నిజమగు లోటు వెల్లడి యగును. స్తుతివలన నది కప్పఁబడును. కనుక నిందించువారు హితు లనియు, స్తుతించువా రహితు లనియు నా యాశయము. మఱియును దూషణ భూషణవచనములను బెడచెవిని బెట్టి కర్తవ్యము లని భావించు కార్యములను జేయుచుండుట నాస్వభావము"

"వడ్లగింజలు" అనే యీపుస్తకం అచ్చువేయించుకోడానికి కావలసిన ద్రవ్యం పంపించి, కృతజ్ఞత విన్నవించుకుంటూ నేను జాబు రాయగా, జయపురాధీశ్వరులు శ్రీ శ్రీ శ్రీ శ్రీవిక్రమదేవవర్మ మహారాజులుంగారు జవాబుగా రాసిన మాట లివి.

ఏమంత కష్టమైనవీ యివీ? ఎవరు చెప్పలేనివీ?
నిజమే; కాని చెప్పి మరి ఆచరించి చూపించడం?
ఇది కోటికే వొక్కరికో మాత్రమే సాధ్యపడుతుంది.
"సత్వానురూపా సర్వస్య శ్రద్ధా" అని కదా గీత?

మహారాజులుంగారు వ్యావహారిక భాషావిముఖులు. అయినా, నా వ్యావహారికరచన శ్రీవారి ఔదార్యానికి ప్రతిబంధకం కాలేక పోయింది.

నా ప్రబుద్ధాంధ్రలో మహారాజులుంగారిని నేను విమర్శించి వున్నాను.

తీవ్రంగానే విమర్శించి వున్నాను.

అయినా, అది కూడా శ్రీవారి మనస్సును కలతపెట్టలేక పోయింది.

ఒకప్పుడు మహారాజులుంగారు మా రాజమహేంద్రవరంలో పది

కాని "చాల్చాలు, పూరుకో యీపాటికి, దరిద్రపు అంగా గుడ్డా నువ్వూ—యింకా చూస్తారేమోయ్!" అని అత జవాన్లమీదికి గెంటేశాడు శానేదారు.

"నీ మూలాన మాకూ—డా మాట వస్తోంది, మంచివా రా రావయ్యా" అంటూ జవాన్లు శంకరప్ప రెక్కలు పట్టుకున్నా

"నేను డబ్బుకోసం రాలేదు" అని శంకరప్ప మళ్ళీ ఏదే చెప్పబోయాడు; కాని 'డబ్బక్కర్లేకపోతే మరి యీ వేషాల యేమిటి? వీధిలోకి పడగెంటక, యింకా చూస్తారేమిటో' అని శానేదారు జవాన్లమీద కళ్ళెర్రచేశాడు.

శానేదారు తొందరపెట్టడమూ, సర్వాధికారి అయిన దివ యిదేమీ గమనించక పోవడమూ — దీంతో జవాన్లకి చా దిలాసా వచ్చింది. వెంటనే వాళ్ళు పొదివి పట్టుకుని, శంకరప్ప వీధిలోకి లాక్కుపోయారు.

అయినా, లోపలికి రావాలని శంకరప్ప గింజుకోడం మానలే వెర్రి ఆవేశంతో అతనొక్కొక్క కూపు కూపినప్పుడు, తట్టు లేక, జవాన్లు ముందుకీ వెనక్కీ వొక్కొక్క తూగు తూగి సాగారు.

ఇదంతా తెలుసుకోడానికి అప్పటికి తెరిపయింది దివాన్జీకి.

చేతిలో వున్న కాగితం పక్కన వుంచి, మరో కాగితం అ కుంటూ "యేమిటా అల్లరి?" అని నిదానంగా అడిగాడతను.

"ఎవరో పిచ్చిబ్రాహ్మడు మహాప్రభూ! ఏలినవారి దర్శన కావాలని నానా అల్లరీ చేస్తున్నాడండి"

"ఒకరూపాయ చేతిలోపెట్టి పొమ్మనలేకపోయావుటయ్యా!

"డబ్బక్కర్లేదుటండి."

"మరేం కావాలిట?"

"చెప్పలేదండి."

"అడిగావా నువ్వు?"

"లే—ద్—ఁ."

చేతులు నలుపుకుంటూ యిలా ననికాడు శానేదారు.

వీధిలో జవాన్ల కట్టుళ్ళలో వుండి, యిదంతా వింటూనేవున్న శంకరప్ప "ఫ్రెక్కుక్షణం మాట్లాడ్డంతప్ప మరేమీ అక్కర్లేదని చెప్పవయ్యా" అని కేకేశాడు.

"చెప్పవయ్యా?" అని పళ్ళు బిగించి, పెదవులుమాత్రం కదుపుతూ శంకరప్పమీద నిప్పులు కురిపేశాడు శానేదారు. ఆ యేకవచన ప్రయోగం, గుండెల్లో కసుక్కున కైజారు గుచ్చుకున్నంత బాధ పెట్టిందతనికి.

ఏకవచనప్రయోగం అంటే నౌకరీలో వుండే వారి నాలుక యెంతయినా నేర్పు చూపించగలదు; కాని చెవులుమాత్రం వోర్పు కనపరచలేవు.

"ఒక అంగాస్త్రపు గుడ్డ కట్టుకుని, మరొక అంగాస్త్రపు గుడ్డ కప్పుకుని దరిద్రం వోడుకుంటూ—"

"అయితేని?"

"పిచ్చిబ్రాహ్మడు మహాప్రభూ!"

"బేడీ లున్నాయా?"

"లే వండి."

"గుడ్డలు మాసీ చిరిగీ వున్నాయా?"

"లే వండి."

"చింపిరి తలా?"

"కాదండి"

"మరి నీ ఆగడం అంతా యెందుకోయ్?" అన్నట్టు, మొగం వంచుకుని, సులోచనాల పైనుంచి కొంచెం చురుగ్గా చూస్తూవుండగా "నేను కార్యార్థిని గాని, పిచ్చివాణ్ణి కాను మహాప్రభూ!" అని శంకరప్ప గట్టిగా కేక వేశాడు.

తాశీల్దారు గుండెలు కొట్టుకున్నాయి; కాని కళ్ళు శంకరప్ప మీద మళ్ళీ నిప్పులు కక్కాయి.

చికిలికళ్లు కాగితంమీదికి తిప్పుకుని "యెదటికి రప్పించు" అన్నాడు దివాన్జీ.

కంఠం నొక్కుకుపోయి తాశీల్దారుకి మాట రాలేదు. చూపులు మాత్రం వీధికేసి మళ్ళాయి. ఆ యింగితం కనిపెట్టి, జవాన్లు, శంకరప్పని తెచ్చి దివాన్జీ యెదట విడిచిపెట్టారు.

## ౨

దివాన్జీ యెగాదిగా చూశాడు. ఉన్మాద లక్షణాలు కనపడక పోవడమే కాదు, శంకరప్ప మొగంమీద బ్రహ్మతేజస్సు వెలిగిపోతోంది.

మొదట దివాన్జీ కళ్ళు జిగజిగ లాడిపోయాయి; కాని తరవాత అంతలో అధికార దర్పం పొంగి మనస్సు బిరుసెక్కి పోయింది. దాంతో కొరకొరగ లాడుతూ "యెవరయ్యా మీరూ!" అని ప్రశ్నించాడు.

"మా యింటిపేరు తంగిరాలవారు. నా పేరు శంకరప్ప. నేను తణుకునుంచి వచ్చానండి"

"ఏమిటి పని?"

"మహారాజులుంగారి దర్శనం చేసుకుందామని వచ్చానండి"

దివాన్జీ కళ్ళు చిమచిమలాడిపోయాయి. పెదవులు అప్రయత్నంగా కదిలాయి. "ఏమిటి? ఈ వేషంతో పని?" అనేమాటలు నాలుక చివర నుంచి గభీమని జారిపోయాయి.

"చిత్తం చిత్తం, ఒకవిద్యలో నేను చక్రవర్తిని. విద్వత్తు వున్న చోట వేషం అక్కర్లేదండి" అని సాగీనలాడుతూ శంకరప్ప బదులు చెప్పాడు.

"ఏ విద్యలో నీ చక్రవర్తిత్వం?"

"చదరంగంలో"

దివాన్జీ సీత్కారం చేశాడు. అతని మొగంమీద వెటకారం పొటమరించి వుంది.

పరోక్షం మాట ఏమయినా, ప్రత్యక్షంలో, మొదట కూచో మనకపోవడమూ, తరవాత తన సమాజవేషాన్ని నిరసించడమూ, ఆ పైని ఏకవచన ప్రయోగమూ, చివర కదీనీ. దీంతో శంకరప్పలో కార్కశ్యం అంకురించింది.

"చదరంగం అంటే లోకసామాన్యానికి లోపల కర్రముక్కలూ, పైని లక్కపూతా మాత్రమే కనబడతాయి; కాని తెలిసినవారికి అందులో చతురంగబలం యొక్క నిజస్వరూపం గోచరిస్తుంది. యుద్ధరంగంలో అహమికతో నెదురుకున్న యిద్దరు చక్రవర్తుల చావు బతుకుల సంరంభంకూడా ప్రత్యక్షంగా కనబడుతుంది"

"గొప్ప వ్యాఖ్యానమే" అని నిరసన చూపించాడు దివాన్జీ.

"ధన్యోహమ్" అని వెటకారంగా చూశాడు శంకరప్ప.

వెనకపాటున వచ్చి, మెడమీద చెయ్యివేసి నొక్కిపట్టినట్టయింది దివాన్జీకి. నోట మాట లేదు.

"బ్రాహ్మలే కాదు, తురకలు, రెడ్లు, తెలగాలు, వెలమలు— చివరికి క్షత్రియులుకూడా యెక్కడా నా ఆట కట్టగలిగినవారు లేకపోయారు."

"ఆ—బ్బా!...అలాగేం?"

"ఆత్మస్తుతి మంచిది కాదు కాని – ఒక్కొక్కప్పుడు – ఒకొ్కక్కచోట అదే చాలా అవసరం అవుతూ వుంటుంది. ఇంతకీ : శ్రీ వత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజులుంగా రంటే చదరంగం ఆటలో నిధి అని దిగ్దంతులు ఘోష పెడుతూ వుండడంవల్ల వొక్కమాటు—ఒక్క ఆట వారితో ఆడాలని—"

"అంతేనా కోరిక?"

"అంతే. అక్షరాలా అంతమాత్రమే"

"అయితే శీఘ్రంగా వెళ్ళవచ్చు"

"అదేమీ?"

"సాధ్యం కాదు కనక."

"ఏమీ? ఎందుకు కాదూ?"

"మన మేమిటి, వీడితో మాట్లాడ్డం యేమిటి?' అని దివాన్జీకి అభిజాత్యం తోచింది; కాని "చదరంగం ఆడకూడదని నిశ్చయించు కున్నారు ప్రభువు" అని మాట జారి వచ్చేసింది.

"ఎంచేతో?"

"తగిన వుజ్జీ దొరక్క... చివరకి ఆట కట్టడంమాట దేవు డెరుగును, నాలుగైదు యెత్తులయినా పొంకంగా వెయ్యగలవాడు కనపడ లేదు పృథివిమీద."

"విపులా చ పృథ్వీ"

దివాన్జీ వులిక్కిపడ్డాడు; కాని అలాంటిదేమీ లేనట్టు నటిస్తూ,

అందుకు నిదర్శనంగా పృథివిమాట జారవిడిచి "కళ్ళు తెరవని కుర్ర కుంకలతో ఆటేమిటని దాంతో నిరాశ చేసుకున్నారు మహా రాజులుంగారు" అన్నాడు.

"నాతో ఆడిచూడకుండానే?" అని ముదలకించాడు శంకరప్ప.

దివాన్జీ వుగ్రుడైనాడు. నిప్పులు కక్కుతూనే చూశాడు; కాని శంకరప్ప గుండెలమీది తర్జనీ నిర్దేశం యింకా గుండెలమీదేవుంది. కళ్ళింకా నిలవతీసి అడుగుతూనే వున్నాయి.

తల యెగరవేసుకుంటూ "నువ్వేం ఆకాశంమీదనుంచి వూడిపడ్డావా?" అని నిరసనగా అడిగాడు దివాన్జీ.

"ఇంకా పైనుంచే అనే చెప్పవచ్చు" నని దానికి శంకరప్ప నిర్లక్ష్యంగా జవాబుచెప్పాడు.

"అబ్బో!"

"ఆశ్చర్యం అక్కర్లేదు. చదరంగం ఆడి తంగిరాల శంకరప్పని జయించగలవాడు చతుర్దశ భువనాల్లోనూ లేడు."

"మహా కోస్తావే?"

"కత్తి చేతిలో వున్నప్పుడు కొయ్యకపోవడం యేమి?"

"బతకతెలుదుకో లేదూ?" అని కరుగ్గా అడిగాడు దివాన్జీ.

"అదీమాట, అసలైనమాట అది. మళ్ళీ చెబుతున్నాను. చదరంగం ఆటలో నేను గొప్ప విద్వాంసుణ్ణి; కాని నావిద్వత్తుకి వినియోగం కనపడలేదు. అంటే ఆ విద్యకీ నాకూ అనుకూల్యం పొసగలేదు. ఇక బతికేం ప్రయోజనమూ? ఈవుద్దేశంతోటే యిక్కడికి వచ్చాను. ఇది చివరి ప్రయత్నం. నాచావు బతుకు లిక్కడ తేలిపోవాలి"

దివాన్జీ యెర్రగా చూశాడు.

"ఏతా వతా: మొండిపట్టు పట్టి ఆటలో కూచుని ఓడిపోతే, మహారాజులుంగారు, వచ్చినవాడి తల కొట్టించి కోట కొమ్మలకు కట్టించడానికి శపథం పట్టారని తెలుసు. తప్పక పోతే అందుకు సిద్ధమే అని నిశ్చయం చేసుకునే వచ్చాను"

"అంత సాహసం దేమీ? పెళ్ళయిందా?"

"ఇంటావిడ కాపరమే చేస్తోంది"

దివాన్జీకి హఠాత్తుగా జాలి కలిగింది.

"కలో గంజో తాగుతూ పెళ్ళామనీ, పిల్లలనీ, గోనో నలుగురిలో చాటుగా వుండక, యీ దుస్సాహసం దేమయ్యా నీకు?"

"మంచి ప్రశ్నే; కాని దీనికి సర్వత్రా చెలామణీ లేదు"

"అంటేని?"

"అంటేనా? ... ... విద్యల్లో వున్నకొద్దీ నువు ఆరాటంగా. అది అందరికీ అందేదికాదు. విద్వత్తు వుంటే తిండి అక్కర్లేదు, నిద్ర ఆక్కర్లేదు, గుడ్డకూడా—"

"పెళ్ళామో?"

"శాస్త్రం చెప్పిన తరవాయిగా వుంది. నిద్రాహారాలే అక్కర్లేక పోయాక యిక పెళ్ళామెందుకూ! అయితే, ప్రాజ్ఞులు రాసియిచ్చినా నాకు పెళ్ళయిపోయింది. ఇంటావిడ రావడమూ, చదరంగపు వ్యసనం హెచ్చిపోవడమూ ఒక్కమాటే—"

"డబ్బు సంపాదించుకు రమ్మని యింటావిడ తరిమి కొట్టిందన్నమాట"

"ఇంటావిడ అయిన ప్రతి స్త్రీకీ ఆ అధికారం వున్నదే కాదూ? ప్రతీ మొగాడి యింటావిడా ఆ అధికారం చెలాయించుకుంటూనే వుంది కాదూ? ఏమంచ— నా విషయంలో కూడా అది కొంత లేక

పోలేదు. తమరు—బాగానే కనిపెట్టారు; కాని వున్నదంతా అలాగే వుండిపోయింది ''

ఇది విని దివాన్జీ రుష్టుడూ అయినాడు, లజ్జితుడూ అయినాడు. కాని యీ రెండింటి కలుపుతో చివరకి అభావదశకి వచ్చి "యింకా యేమిటి?" అన్నాడు.

"ప్రతి దినమూ యెవరో ఒకరు వస్తూవుండడమూ, నాలుగో యెత్తు వెయ్యలేక చల్లగా జారుకుంటూ వుండడమూ—ఇక్కడ మహారాజులుంగారికీ, అక్కడ నాకూ ఒక్కలాగే—"

"ఆ దురుసు పోలిక యేమిటయ్యా?"

"సత్యం అన్నది ఒక్కొక్కప్పుడు దురుసుగానూ వుంటుంది"

దివాన్జీ తెల్లపోయాడు.

"సత్యం మొదట మీలాంటివాళ్ళు ఒక్క అంతస్తులోనే ఉంటారు. పోనీ, తగినవుజ్జీ దొరక్క యిక్కడ మహారాజులుంగారికీ విసుపే వచ్చింది, అక్కడ నాకూ విసుపే వచ్చింది. దీన్ని తమ రేమంటారూ?"

"నీ మాట లెక్కేమిటయ్యా!"

"సెబాస్! చాలా రోజులకి వినపడిందీ మాట; కాని ప్రస్తుతం యీమాట అనతగినవారు ఒక్క మహారాజులుంగారే. ఇక తమరా? వారి దర్శనం తమ చేతిలో వుంది"

దివాన్జీ మొగం సుమధుమ లాడిపోయింది. "సరే ఆలోచిస్తాం వెళ్ళు" అని నిరసన కనపరచి అతను మొగం వంచుకున్నాడు.

"నేను కట్టుకోడానికి గుడ్డకూడా లేనివాణ్ణని ప్రత్యక్షమే. అయితే, నా ప్రజ్ఞ చూపించాలనే కాని నాకు మరేమీ ఆశ లేదు. మరో కోరిక యెంతమాత్రమూ లేదు. ఈ విషయంలో సంకోచం

యెంతమాత్రమూ అక్కర్లేదు"

"మంచిమాటే"

"నే నోడిపోతే నా తల తీసుకోడానిక్కూడా నా అభ్యంతరం లేదు"

"అదెలాగా తప్పనిదే"

అవ్యథానంగా "తథాస్తు" అని, "యిక నీఅభ్యంతరంయేమిటీ?" అన్నట్టు చురుగ్గా చూసి, డంగయిపోయి దివాన్జీ మాట్లాడలేకపోగా "తెలుసుకోగలిగితే అదీ వొక గౌరవమే" అంటూ కొ[illegible]యించాడు శంకరప్ప

"ఇంకేం, పరిపూర్ణజ్ఞానం కలిగిందన్న మాటే"

"చాలామంది పెద్దలున్నూ యిలాగే శెలవిప్పించారు"

దివాన్జీ తేరిచూశాడు. నిజంగా అతనీ మర్మాఘాతానికి తాళుకోలేకపోయాడు. తన పాండిత్యమూ, తన ఐశ్వర్యమూ, తన పదవీ-యివన్నీ వొక గోచిపాతరాయడి యెదట గుడ్డిగవ్వకయినా మారకపోవడం అతనికి చిన్నతనం అనిపించింది.

ఏమీ పాలుపోక యెదటికి చూశాడతను. తాశేదారు కనపడ్డాడు. చేతులు కట్టుకొని వినయంగానే నుంచుని వున్నాడు కాని దివాన్జీకి అతని నొసలు మాత్రం "నేను చెబితే విన్నావా?" అం దెప్పుతున్నట్టు కనపడింది.

"ఛా" అనుకుని ద్వారంకేసి చూశాడు. ఒక జవాను కనపడ్డాడు. అతను కూడా వొదిగి వొదిగే నుంచుని వున్నాడు; కాని కళ్లు మాత్రం "మమ్మల్ని గదిమినట్టు కాదు బాబయ్యా" అని వెక్కిరిస్తున్న ట్టున్నాయి.

చిరాకు పుట్టింది. అప్రయత్నంగా కిందికి చూశాడు. చేతిలో

కాగితం ఉంది. జేగీరావు టపాలో పలివెల తాణాకి వెళ్ళవలసిన కాగితం అది. ఒక్కమాటు మనస్సు గజిబిజి అయిపోయింది. ఎక్కడలేని తొందరా పుట్టింది. అది కుడిచేతిని వొణికించేసింది. చేతిలో వున్న కాగితాన్ని వూపే సేసింది.

మాటలో కూడా కొంచెం తడబాటు కనపడింది.

"తాణేదా—ర్"

"చిత్తం చిత్తం"

"ఇది అంచెవరుగులమీద వెళ్ళాలి"

"చిత్తం" అంటూ తాణేదారది దోయిలించి పుచ్చుకుని "మరి యీ చదరంగ సేనాపతి మాట యేమాలోచించావ్?" రన్నట్టొక మాటు కనుబొమ్మ లెగరవేసి, చివరికి "మీరూ మీరూ తంటాలు పడండి, నాకేం బాబూ!" అన్నట్టొక చిరునవ్వు మొలిపించి, మెల్లిగా తిరిగి, గబగబా వీధికేసి బయలుదేరాడు.

## 3

శంకరప్పతో మాట్లాడ్డం దివాన్జీ కిష్టం లేదు.

ఇంత సేపు మాట్లాడినందుకే ఆయన చాలా పశ్చాత్తాప పడ్డాడు. "ఆదిలో యిప్పుడు మాట్లాడ్డానికి వీలు లేదని పంపేసి వుంటే, ఈ యిబ్బంది కలిగివుండక పోవు" నని పిసుక్కున్నాడు. అయితే, యిప్పుడయినా తొరగా పంపెయ్యడాని కేం? కాని యేమనీ పంపెయ్యడం?

మాట్లాడ వలసినవారు తన యెదుట మరెవరూ లేరన్నట్టు నటిస్తూ, మొదట ఆత నొక కాగితం తీశాడు. ఒకటి రెండు పంక్తులు చదివాడు; కాని దృష్టి దానిమీద నిలవలేదు.

ఒకమాటు ఈవేపు కాగితాలు సద్దాడు. మరోమాటు ఆవేపు కాగితాలు సద్దాడు; కాని "బొత్తి సరిగానే వుందే, యెందుకీ పాట్లూ!" అని యెవరో అడిగినట్టయి అది వొదులుకున్నాడు.

పొడుముకాయ కాలికిందకి దొర్లిపోయి వుంది. అది తీసి "అనవసరం" అనుకుంటూనే నొక్కు పట్టి పీల్చాడు. చర్రుమని నసాళం అంటి చురుకు పుట్టింది. "హాం హాం" అనేద్దామనుకున్నాడు; గాని ప్రతిష్ఠ పీకింది.

అమాంతంగా పెట్టె మూత తెరిచాడు. ఎడమవేపు అరలో ఒత్తాయి చాకూ, కలంగాణీ కనపడ్డాయి. దేనికోసమో వెతుకుతున్నట్టొకమాటవి పైకి తీసి పట్టుకుని మళ్ళీ పడేశాడు. ఎదుటి అరలో బాతుకలం కనపడింది. అది బండగా రాస్తున్నట్టు జ్ఞాపకం వచ్చి "చెక్కుదాం" అనుకుంటూ పైకి తీసి, అంతలో "ఛా, యింతమంది నౌకర్లుండగా మనం చెక్కడం యేమిటీ!" అనుకుని యథాస్థానంలో వుంచేశాడు. కుడివేపు చిన్న అరలో విడి డబ్బులున్నాయి. అవొకమాటు గలగల్లాడించాడు. మూల అరలో ఒక కాగితం వేలాడుతోంది. అది తీశాడు; కాని యింతకి ముందే జవాబు రాసేసిన కాగితం అది. మళ్ళీ అది అక్కడే దాచేసి, గభీమని పెట్టె మూత వేసేశాడు.

వొడిలో వున్న తాళాలగుత్తి పక్కని పడేశాడు. పక్కని వున్న పొడుముకాయ రొంటిని పెట్టుకున్నాడు. సిరాబుడ్డి కొంచెం జరిపాడు. ఆవేపున వున్న యిసకడబ్బీ యీవేపున పెట్టాడు.

చివరికి మరేమీ విలాసాలు తోచక, ఒకమాటు పూస గోక్కుని హఠాత్తుగా యేదో జ్ఞాపకం వచ్చినట్టు మొగం పైకెత్తాడు.

కాని, యెన్ని చేసినా మొగంపైకెత్తేటప్పటికి శంకరప్పే కనపడ్డాడు.

"ఇది ఫ్రారికే కదిలే ఘటం కాదయ్యోయ్" అన్నట్టు వెంకి చూపులు చూస్తున్నట్టుకూడా కనపడ్డాడు శంకరప్ప.

దివాన్జీకి అభిమానం ముంచుకు వచ్చింది. "ఛా! ఈదరిద్రుడికోసం యిన్ని తికమకలేమి" టని శౌర్యంకూడా వచ్చింది. మీదపడి పొట్లా లన్నంత ఆవేశమున్నూ వచ్చింది; కాని తన పదవీ, తన తాహతూ, తన అంతస్తూ స్మరించుకుని ఆ ఆవేశాన్ని అసహ్యభావంగా మార్చుకున్నాడు.

దీంతో "మహారాజులుంగారికి కావలసిన మనిషి" అనేజ్ఞానం కూడా లేకుండా, శంకరప్పని చురచుర చూస్తూ "నీకు కాదూ చెప్పడం? ఇక దయచెయ్యి" అంటూ చెండుకున్నాడు.

"దయచెయ్యడం అంటే యేమంత కష్టమైనదికాదు. దాని కింత సేపక్కర్లేదు; కాని నాకేమి చెప్పినట్టూ!" అని ముదలకించాడు శంకరప్ప.

"ఆలోచిస్తాం వెళ్ళు"

"వెళ్ళి?"

"వెళ్ళడమే. తూర్పుగా తిరిగి దణ్ణం పెట్టి పడమరగా తిరిగి అడుగు పెట్టడమే"

"ప్చ్" అంటూ తల యెగిరవేశాడు శంకరప్ప.

దాంతో అతిక్రుద్ధుడయిపోయి "ఏయ్ జవాన్లూ" అని దురుసుగా పిలిచాడు దివాన్జీ.

ఎప్పు డెప్పు డని కనిపెట్టుకుని వున్న దఫేదారు పొడిచి తొందర పెట్టగా, జవాన్లు వెంటనే ఫ్రాంచిల్లాగ మీద పడి, శంకరప్పని వీధిలో యెత్తి కుదేశారు.

ఇదంతా అయిన తర్వాత, తాను దివాన్జీకి కనపడకుండా వుండే

ట్టు చూసుకుని శంకరప్పకేసి వురిమి చూస్తూ, యెదురొ మ్మెగర వేసుకుంటూ మీసంమీద చెయ్యి వేసుకున్నాడు శానోదారు.

౪

"ఏంజరిగింది నాయినా?" అని ఆత్రంగా అడిగింది పేదరాశి పెద్దమ్మ.

"వ్యవహారం అంతా తల్లకిందు లయిపోయింది పెద్దమ్మా" అంటూ చతికిలబడ్డాడు శంకరప్ప.

బసకి వచ్చాడు; కాని యెలా రాగలిగిందీ అత నెరగడు. ఈ మాట చెప్పాడు అయితే యేమి మాట్టాడిందీ అతనికి గుర్తులేదు, మాట ముగిస్తూ తల రెండు మోకాళ్ళమీదకి వాల్చుకున్నాడు. నిట్టూర్పు విడుస్తూ రెండుచేతులూ తలకి చుట్టకేసుకున్నాడు.

నిరాశా, వుడుకుమోత్తనమూ, దుఃఖమూ అతని శరీరంలో ప్రతీ అణుమాత్రభాగంలోనూ నిండి చిప్పిలిపోతూ వున్నాయి.

ఇదంతా చూశాటప్పటికి పెద్దమ్మ హృదయంలో స్తబ్ధమయి పోయి వుండిన మాతృత్వం అంతా వొక్కమాటుగా జాగృతం అయిపోయింది. దాంతో ఆమె కడుపు తరుక్కుపోయింది. వెంటనే తానున్నూ చతికిలబడి, వొక చేత్తో వీపు నిమురుతూ, రెండో చేత్తో చేతులు తప్పించి అతని మొగం తనభుజంమీదికి తీసుకుని "ఏం నాయనా? ఏం తండ్రీ?" అంటూ అతన్ని దగ్గిరసా తీసుకుంది.

ఇది అతనిలో శైశవమౌగ్ధ్యం అంకితం చేసింది, ముప్ఫయేళ్ళ శంకరప్ప పెద్దమ్మ అడ్డాల్లో బిడ్డ అయిపోయాడు. ఒక్కక్షణం-వొక్కకొక్షణం దుర్దమ్యం అయిన ప్రాపంచిక వృత్తం అంతా మరిచిపోయి మళ్ళీ నిర్వికారావస్థ అనుభవించాడతను.

తరవాత ఆమె గుచ్చిగుచ్చి, వొత్తివొత్తి అడిగింది. అతను అది

నుంచి అంతందాకా ప్రతీ అక్షరమూ వివరంగా చెప్పాడు.

ఈ చెప్పడంవల్లనే అతను కొంత తేలిక పడ్డాడు. పెద్దమ్మ ప్రశ్నల ధోరణివల్ల పూర్తిగా మామూలు మనిషి అయిపోయాడు.

అప్పుడామె "ముందుమాట యేమాలోచించావు నాయనా?" అని లాలిస్తూ అడిగింది.

"మహారాజుతో యెలాగయినా పైకట్టా ఆట—"

"స్స! ముందుమాట అడుగుతున్నాను నేను"

"నా కర్థం కాలేదు"

"మరి దివాన్జీతో అంత దురుసుగా యెందుకు మాట్లాడావూ?"

"ఆ పెద్దమనిషి మొదటే హేళనలోకి దిగాడు అదివరకే తాణేదారు, జవాన్లచేత గెంటించడం నన్ను రెచ్చకొట్టి వుంది సరే, తాణేదారు తన యింటి దగ్గిర ఆడిన మాటలు నా ప్రవృత్తినే మార్చేసి వుంచాయి"

"ఈ వుద్యోగస్థులు తమ తాహతేమిటో, తమ బతుకెలాంటిదో తెలుసుకు మసులుకోరు"

"పొగరు మోత్తనం కాకపోతే, నన్నింత అవమానపరచవలసిన అగత్యం యేమిటి చెప్పూ"

"నీమాట అలా వుంచు. చదరంగం ఆడగలవాడు దొరక్క మహారాజు మతిపోయి వున్నాడు"

"అంతవరకూ వచ్చి వుంది చూశావా?"

"దివాన్జీకి అది తెలుసు. తలయిచ్చెయ్యడానిక్కూడా సిద్ధపడి నువ్వు వచ్చినపుడు మూర్ఖుడు కాకపోతే దివాన్జీ—"

"మూర్ఖుడే కాదు, మూఢుడు కూడాను"

"అబ్బ!... చివరికి ఫలం?"

"నా ప్రశ్న—"

"దిబ్బా దిరుగుండమూనూ"

అంత జాలిలోనూ ఆమె యిలా విసుక్కుంది.

"విద్వాంసుల మంటూ వచ్చేవాళ్ళని చాలామందిని చూశాను; కాని అందరూ యిలాగే లౌక్యం సుతరామూ లేక, యింగితజ్ఞానం అసలే లేక—"

"అసలే మతి పోయి వున్నాను. నువ్వు పుండుమీద కారం చల్లుతావా పెద్దమ్మా?"

ఇలా అంటూ అతను ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు. దాంతో మనస్సు కరిగి ఆమె ధోరణి మార్చింది.

"అయితే, మరి విను. దివాన్జీ తలబిరుసు తనంవల్ల మహారాజుకి తగినవాడితో ఆడేయోగం తప్పిపోయింది"

"అత్త రాలానూ"

"పిచికమీద బ్రహ్మాస్త్రం వేసి మహాకులుకుతున్నాడు; కాని దివాన్జీ చేసింది స్వామిద్రోహం"

"ఈ సంగతి మహారాజుకి తెలిస్తే బాగుండును"

"ఆమాట అన్నావూ? అయితే, అది నీచేవను బట్టి వుంటుంది"

శంకరప్ప వులిక్కిపడి "అంటే?" అన్నాడు.

"అంటే యేముందీ? ఇప్పటిదాకా రాజదర్శనం కోసం నువ్వు తిప్పలుపడ్డావు. ఇకముందు నీదర్శనంకోసం రాజే తిప్పలుపడాలి"

"సెబాస్! ఎంత మంచి మాటా! అది అలా జరిగితే యెంత దర్జాగా వుంటుందీ?"

శంకరప్పమనస్సేమో పురకలే వేసింది; కాని "తొందరపడకు" అని బుద్ధి నిలేసింది. పరాభవఖిన్న మయిపోయి వుండడంవల్ల ఆ

బుద్ధి కింకా వైశిత్యం అలవడి వుండలేదు.

"ఎప్పుడయినా అదిసంభవిస్తుందా?" అని సందేహించాడతను.

"చెప్పాను కానూ? అది నీ చేవను బట్టి వుంటుంది"

"తూర్పూ పడమరా నాకేమీ బోధపడ్డం లేదు. అంతయోగమే పడితే, ఆటలో మహారాజుని కియిక్క మనిపించడం తప్ప నావల్ల మరేమీ కాదు. నీళ్ళు ముంచినా పాల ముంచినా—పెద్దమ్మా, నేను నీ కొడుకుని"

ఇలా అంటూ అత నామె పాదాలు పట్టుకున్నాడు.

ఆచేతులు దూరంగా తీసేస్తూ, తన పాదాలు ముడుచుకుంటూ "ఇంత వెర్రిబాగుల నాయనవు, చదరంగంలో నీకంత నేర్పెలా వచ్చిందో యేమో?" అంటూ జాలిపడింది పెద్దమ్మ.

ఆమె కళ్ళు ఆనందబాష్పాలతో దొప్పదోగిపోయాయి

"దాని కంతకీ కారణం యీశ్వరానుగ్రహం. అయినా నా ప్రజ్ఞ అంతా నీ అనుగ్రహంమీద నిలిచి వుంది"

ఒక్కమాటు పైకిచూసి "పెద్దపురప్పట్నం అంతాయెప్పుడేనా చూశావా?" అని అడిగింది.పెద్దమ్మ.

"లేదు. నీ యిల్లూ, తాణేదారు కొంపా, దివాన్జీ లోగిలీ తప్ప నేను మరేమీ యెరగను"

"అయితే విసుపు లేకుండా ముందు పట్నం అంతా తిరుగు"

"తిరిగి?"

"పెద్దమనిషి ననుకునే ప్రతీవాడి యింటోనూ దశావతారీ ఆటో, చదరంగపెత్తులో నడుస్తూనే వుంటాయి"

"ఆఁ, అదా? బోధపడుతోంది"

"చాలామంది వేశ్యలు కూడా ఆ ఆటల్లో నిధులున్నారు"

"బాగుంది"

"నీకు పిలుపు అక్కర్లేదు, ఆటకి అడ్డుపడు"

"అడ్డుపడడంతో కుదురుతుందా? శంకరప్ప వున్నంత కాలమూ యీ వూళ్ళో యెలాంటి వాళ్ళూకూడా చదరంగం అంటే హడిలి పోతూ వుండవలసిందే"

ఈమాట చాలా దృఢంగా అన్నాడతను. పొంగిపోతూ అన్నాడు. గర్వంతో అన్నాడు. టోకాయిస్తూ అన్నాడు.

"ఇంకేం? నీవల్ల అంతపని జరిగితే, యిక నీకు అసాధ్యం అంటే యేమి వుంటుంది? మన్నాడే యీసంగతి రాజుకి —"

"వోక్ష దెబ్బ!!" అంటూ యెగిసిపడి మళ్ళీ కూచున్నాడతను.

"మొదట నిన్ను గౌరవించిన దివాణీదారే వస్తాడు. నువ్వు వెళ్ళక పోతే దివాన్జీ వస్తాడు. అక్కడికీ నువ్వు లొంగకపోతే తరవాత రాజే మనయింటికి స్వయంగా వస్తాడు"

"మన యింటి" కన్నమాట శంకరప్పకి వెనకాల యెంతో బలగం వున్నదన్నంత దిటవు కలిగించింది. "రాజే మన యింటికి స్వయంగా వస్తా" డనే మాట అతన్ని చక్రవర్తినే చేసేసింది.

"సెబాస్" అంటూ గభీమని లేచి నుంచున్నా డతను.

పెద్దమ్మ కూడా లేచి "యిప్పుడెక్కడికీ?" అంటూ చెయ్యి పట్టుకుంది.

"పట్నంలోకి"

"వొక్క క్షణం వోపిక పట్టు. వంట అయి—"

"తొందర లేదు. నాకప్పు డాకలీ దప్పికా యేమీ తెలవడం లేదు. ఒక్కణ్ణేనా కాళ్ళ మీద పడేటట్టు చేసుకుంటే గాని, నాకు నోటికి ముద్ద పోదు. క్షణం. ఎంతోసేపా?"

వాకట్లోనుంచి గుమ్మంలోకి వెళ్ళేటి పురక. అక్కణ్ణుంచి వీధిలోకి వెళకేటే అంగ.

## ౨

ఎడాపెడా చూసుకుంటూ శంకరప్ప సందుమళ్ళాటప్పటి కొక పెద్ద ధనంటి కనపడింది. మండువా వాకట్లోనుంచి చదరంగానికి సంబంధించిన ఘర్షణకూడా వినవచ్చింది.

పెద్దాపురం[illegible]ప్రవేశించాక, యీ రెండురోజుల్లోనూ అతని కిదే చదరంగవ్యాప్తి. అంచేత ఆఘర్షణ వినేటప్పటి కతనికి తొందర పుట్టింది.

లేడిపిల్లమీదకి పెద్దపులిలాగ వొక్క దూకు దూకాడు.

లోపల యిద్దరు బ్రాహ్మణ యువకులు చదరంగం ఆడుతున్నారు.

వారి కిద్దరికీ చెరో నలవాదారూ దగ్గరనా కూచుని వున్నారు. కాని వారిలో యెవరూ శంకరప్పని కూచోమనలేదు. పలకరించనూ లేదు, చూడనేలేదు.

అతనుకూడా వారిని పలకరించలేదు.

ఒక్కమాటు నలుగురి మొగాలూ చూశాడు. ఒక్కమాటు బలమున్నా చూశాడు. తరవాత అతికష్టంమీదమనస్సు బిగవట్టు కుంటూ, స్తంభాని కానుకుని నుంచున్నాడు.

అరగడియ గడిచింది; కాని యెత్తు పడలేదు.

బలంఅంతా అతిసూక్ష్మంగా పరిశీలించడం, ఏదో యెత్తు తోచి గభీమని చెయ్యి చాపడం, ఆ[illegible]ట్లో యెదటి బలంలో యేదో జంతువు ప్రతికూలంగా నబడి, నరాలు కుంగిపోగా, చెయ్యివెనక్కి తీసేసుకోడం, తరవాత ఆవేగం మళ్ళించుకోలేక కూనరాగం తీస్తూ

వూగిస లాడడం. లేకపోతే ''ఛా'' అంటూ అట్ట తేలేటట్టు తొడ చరుచుకోడం. అదీ కాకపోతే, వొకటి యెత్తుల్లో వొకటి తప్పుగా పడి విషమించిం దని పశ్చాత్తాపపడడం— యెత్తు వెయ్యవలసిన యువకు లీస్థితిలో వున్నారు.

ఎదిరి బలంలో వున్న లోటుపాట్లన్నీ బాగా కనిపెడుతూ వుండడం, ఎత్తు వెయ్యడాని కెదటి ఆటకాడు చెయ్యి చాపినప్పుడల్లా గుండెలు పీచుపీచు మనిపించుకోడం. ఉన్న గోడు కూడా చెడుతుం దని వాళ్ళు యెత్తు మానుకున్నా మంచే. పెదవులు విరవడం— కనుబొమ్మ లెగరవెయ్యడం— వ్రూరచూపులు చూసుకోవడం, ప్రతిపక్షు లీస్థితిలో వున్నారు.

ఇంకొక అరగడియ గడిచింది.

శంకరప్ప విసిగిపోయాడు.

"ఏమండీ, యెత్తు వెయ్యరేం?" అం సరసంగానే అడిగాడతను; కాని ఆటకాడిది వినిపించుకోలేదు. సలహాదారు మాత్రం మొదట మిడుతూ మిడుతూ చూసి, తరువాత "నీకెందుకయ్యా మా గొడవ?" అని కొంచెం విసుక్కున్నాడు.

"మీ గొడవ నాకెందుకూ? ఆట గొడవ అడుగుతున్నాను నేను. ఎంతకీ యెత్తు పడదేం?" అని శంకరప్ప మళ్ళీ అడిగాడు. ఈమాటు అతను బుద్ధిపూర్వకంగానే కొంచెం పెంకితనం కనపరిచాడు.

సలహాదారా పెంకితనం గమనించక పోలేదు. అయితే, అతని తల యింకా బిరుసెక్కి పోలేదు. నిజాని కతనింకా సాధకావస్థలోనే వున్నాడు. పైగా, ఇందాకటి వేషాన్ని బట్టి బికారిగా కనపడ్డ శంకరప్ప, ముఖవర్చస్సును బట్టి యిప్పుడు అసామాన్యుడుగా కనపించాడు. అదేదో చూడాలని అపేక్ష కలిగిందతనికి. దాంతో

యిందాకటి నిర్లక్ష్యం పోయింది.

“నాలుగ్ఘళ్ళ పొద్దెక్కేటప్పటికి ఆట యీస్థితికి వచ్చింది. ఎత్తు వేశామంటే, మా ఆట పైసలా. సరియైన యెత్తు తోచక మేమూరుకోగా తనకి వంతు రాక మావాళ్ళూరుకున్నారు” అని వెంటనే సాదరంగా చెప్పాడతను.

“ఇంతమందీ—యింతసేపు—ఏమండీ, యిందులో యేం వుందీ?” అని నిస్సారంగా అడిగాడు శంకరప్ప.

ఆటకాడికది కొట్టినంత పని చేసింది. వెంటనే బుస్సుమంటూ కోడెత్రాచు పడగయెత్తేట్టు మొగం పైకెత్తి “చదరంగం అంటే యేమిటో నీకేమయినా తెలుసా?” అని దురుసుగా అడిగాడతను

“దొరికా” వనుకున్నాడు శంకరప్ప.

ఆటకాడి మొగంమీద చక్రవర్చస్సు కనపడింది శంకరప్పకి. “సత్తా వుంది; కాని సంస్కారం చాలదు. చికిలీ చేస్తే, చంద్రహాసం అవుతాడు. ఇతగాణ్ణి భృత్యుణ్ణి చేసుకుతీరాలి” అని అతను నిశ్చయించుకున్నాడు. దాంతో అతన్ని రెచ్చకొట్టి తనకి అవకాశం కలిగించుకోదలచి “నాకూ తెలుసు. ఆమాటకి వస్తే నాకే తెలుసు” అని నొక్కి చెప్పాడు.

ఆటకాడు గతుక్కుమన్నాడు.

శంకరప్ప అది కనిపెట్టి “అలా చూస్తే యేమవుతుందీ? వారి ఆట నేను కట్టేస్తాను మీరు తప్పుకోండి. లేకపోతే మీచేత కట్టిస్తాను నేను చెప్పిన యెత్తు వెయ్యండి చేతనయితే, మీయిష్టం వచ్చిన పరీక్ష చేసుకోవచ్చు, నేను సిద్ధం” అని టోకాయించాడు.

ఆవేశం చూచి ఆటకాడు మొగం మళ్ళించుకున్నాడు; గాని తన సహోదారు ఘుబాటం గుర్తించి “యీ పిడుగు వీడిమీద పడి

పోనీ" అని నిశ్చయించుకున్నాడు.

ప్రతిపక్షి, వయస్సుకీ అనుభవానికీ కూడా ఆ నలుగురిలోనూ పెద్ద. ఒక పాటి ఆటకాడు కూడాను. "జన్మానికల్లా శివరాత్రి" అన్నట్టు గతసంవత్సరం, యెవరూ దొరకని సమయంలో మహారాజుతో వొకనాడు రెండాటలు వేసి వున్నాడతను. తన కారులో అలాంటి అదృష్టం పట్టినవాడు తానొక్కడే కావడం వల్ల, చదరంగం బల్ల దగ్గిరికి వచ్చాటప్పుడు చాలా బిర్రుగా వుంటూ వుంటాడు. మహారాజులుంగారి నడక కూడా కొంచెం కనపరుస్తాడు, ఆట ప్రారంభం అయినాక అంగన్యాస కరన్యాసాలు కూడా వింతగా చేస్తూ వుంటాడు.

మాటధోరణిలో వున్న పెంకితనం చూడగా శంకరప్ప ఆట మూడాలని అతనికి సరదాగానే వుంది; కాని "గోచిపాతరాయణ్ణి మనతో సమానంగా కూచోనివ్వడమా?" అని అభిజాత్యంతో చింద.

ఆటగాళ్ళందరూ మొగమొగాలు చూచుకున్నారు.

"ఏమంటావోయ్?"

"ఈ యెత్తు కానివ్వరాదుటోయ్?"

"మనిషి మారేటప్పుడిది కొత్త ఆటే అనుకోవచ్చు కాదుటోయ్!"

"ఇంతవరకూ వచ్చాక మనిషి మారడం యేమిటి కావలిస్తే సలహా పుచ్చుకోవోయ్"

ఉత్సాహాతిరేకంవల్ల, ఆటకాడు "సలహాపుచ్చుకో" అన్నమాట అంతర్యం గ్రహించలేదు. దీనికి సాయం, సలహాదారు, తాను జరిగి "అలా జరుగు" అనికూడా అన్నాడు. అంచేత "మరి కూచోవయ్యా" అని జరుగుతూ శంకరప్పని పిలిచాడతను.

కాని శంకరప్ప కూచోలేదు. స్తంభంకూడా విడిచిపెట్టలేదు

ప్రతిపక్షి వుద్దేశం అతను గ్రహించేశాడు దాంతో "నాతాహతూ నీ తాహతూ చూద్దువు గాని" అని మనస్సులో అనుకుని "మీరు లేవనక్కర్లేదు. లేవనే వద్దు. నేనిలా నుంచునే వుంటాను. మీ సర సని మాటో దానికి నే నెంతవాణ్ణి?" అన్నాడు మెల్లిగా.

ప్రతిపక్షి తృప్తిపడ్డాడు.

"అయితే సలహా చెప్పు" అని బల్లకేసి తిరిగా డాటగాడు.

"ఎన్ని యెత్తుల్లో ఆట కట్టమంటారు?"

"సార కాయలు నరుకుతున్నావే?"

ఆటకాడిలా అంటూ చాలా హేళన కనపరిచాడు; కాని, సమయం గుర్తించి శంకరప్ప దాన్ని లక్ష్య పెట్టలేదు.

"నరకడాని కంత తేలికయిన వస్తువు మరేదీ లేదని తరవాత మీకే తెలుస్తుంది, యెత్తుల మాట చెప్పండి ముందు"

"అయితే నువ్వే చెప్పు"

"అయితే వినండి—ముందు నేనో యెత్తు వేస్తాను, అంటే చెబుతాను. తరవాత వారు వేస్తారు. మళ్ళీ నేనింకో యెత్తు చెబుతాను"

ప్రతిపక్షి పులుకూ పులుకూ చూశాడు. ఆటకాడు "కోతలు" అనుకుంటూ చూశాడు. ఆటకాడి సలహాదారు "తరవాతా?" అన్నాడు.

"బలం కలిపివెయ్యడమే"

ప్రతిపక్షి వురిమి చూశాడు. ఆటకాడు "మరి కానియ్యి" అంటూ చెయ్యి చాపాడు. సలహాదార్లిద్దరూ చకితు లయినారు.

"మీ నల్లగది శకటు వారి గుర్రం ముందు వెయ్యండి" అన్నాడు శంకరప్ప.

"వోస్" అనిపించింది ఆటకాడికి. ఈ యెత్తు అతనికిదివరకే పది

మాట్లు తోచింది. సలహాదారుకి తొమ్మిదిమాట్లయినా తోచింది; కాని ధైర్యమూ సాహసమూ కూడా కలక్క వారూరుకున్నారు. ఈయెత్తే శంకరప్ప చెప్పడంలో వారికి విశేషం కనపడలేదు; కాని అతను మూడెత్తులతో ఆఖరంటున్నాడు. ఇది తలుచుకుని "వే-శా-ను" అంటూ చెప్పినట్టు చేశాడు ఆటకాడు.

ప్రతిపక్షికీ యెత్తులో యేదో కిటుకుందని తోచింది. ఆటకాడే స్వయంగా యీది వేసి వుంటే, చూపుల్లో అధమం రెండు మూడు రసాలయినా మెప్పించి వుండు నతను.

ఇప్పుడతని కెత్తు తోచలేదు.

ఇప్పటిదాకా అతనుపయోగించిన నిర్లక్ష్యభావం అంతా యిప్పుడాటకాడికి సంక్రమించింది. దాల్లో కొంత వుడికిక్కొట్టైసి "చూస్తావేమిటోయ్!" అంటూ నిలవదీసి అడిగాడు సలహాదారు.

"ఆలోచించుకోనియ్యవోయ్! ఇదంతా మీ ప్రజ్ఞే అన్నట్టెగిసి పడుతున్నా వేమిటి?"

"తొందరపడకు. కావలసినంతసేపాలోచించుకో బాగా నిదానించి మరీ యెత్తువెయ్యి" అన్నా డాటకాడు.

"వోస్! ఏమి ఔదార్యంరా?.....అయితే, సరి, గుర్రం యిక్కడ వే—శాను"

"అబంటుతో మీరు తోసిరాజనండి"

"తోసి రాజు రా"

"ఆట కట్టు అనికూడా—"

"ఆట క—ట్టురా"

ఆటకాడు సందేహిస్తూ అనగా "జంకెందుకోయ్?" అని గదిమాడు సలహాదారు.

ఆటకాడు "భేష్" అన్నట్టుమాత్రం చూడగా సలహాదారు పొంగిపోయి "యేవూరు మహానుభావామీదీ?" అంటూ గభీ మని లేచి శంకరప్ప రెండుచేతులూ పట్టుకున్నాడు.

శంకరప్పకి, చెవిలో "వైకడు" అని వినిపించినట్టయింది.

"నన్ను చూశారా? నావేషం కనపడుతోందా? పొట్ట చేత్తో పుచ్చుకు వచ్చాను. అన్ని వూళ్ళూ నావే"

"పేరు?"

"తంగిరాల శంకరప్ప"

ఆటకాడి మనస్సు గుబగుబ లాడిపోయింది.

ఉత్సాహం అణుచుకోలేక "ఏమిరా ఆట కట్టిందని పొస్పుకుంటూవా యెత్తువేస్తావా?" అని దురుసుగా అడిగా డతను.

"చే – బ్రొ...... ఈ గుర్రంతో యీ బంటు—"

"తెక్కిచి రాజవుతుందోయ్"

"అయితే, రాజు నిక్కడ వేశాను"

ఇలా అంటూ యెత్తు వేసి ప్రత్యర్థి "నీకుదిక్కున్నచోట చెప్పుకో" అన్నట్టు చూడగా ఆటకాడు తెల్లబోయి శంకరప్పకేసి చూశాడు.

"ఏం, మూడెత్తుల్లో కట్టలేకపోయాననా అలా చూస్తున్నారు? తప్పే, అపరాధిని క్షమించండి, ఏం చెయ్యనూ మరీ? ఇంకొక్క యెత్తు—ఎర్రగది శకటుందే మీది, దాంతో వారి రాజుని—"

నగంలో అందుకుని "వోరీ, శకటింటో వేశావురా రాజుని" అని సలహాదారు సింహనాదం చేశాడు.

"అరె, అరే" అంటూ ఆటకాడు ఆశ్చర్యపడ్డాడు.

ప్రతిపక్షి ముందు నాలుక కరుచుకున్నాడు. తరువాత తన రాజుని తీసి చేత్తో పట్టుకున్నాడు. ఎక్కడ వేదామన్నా స్థలం కనపడలే దతనికి.

మతి పోయింది. చివరికి "హా" అంటూ బలం అంతా కలిపేసి కాళ్ళు చాపేసి రెండు తొడలూ గోక్కుంటూ గోడకి చేరబడి పోయాడు.

ఆటకాడు వుబ్బెత్తుగా లేచి, గభీమని శంకరప్పను కౌగిలించుకుని "మహానుభావా! ఎవరో సామాన్యులని మిమ్మల్ని హేళన చేశాను ఏకవచనప్రయోగమున్నూ చేశాను. అపరాధిని. నన్ను క్షమించాలి" అని బతిమాలాడు.

అందుకు శంకరప్ప "మీరేమీ కించపడనక్కర్లేదు. మొదట మీరనుకున్నట్టిప్పటికీ నేను సామాన్యుణ్ణే. ఇక ఏక వచన ప్రయోగమా? ఈస్థితిలో నాకు అదికూడా గౌరవాస్పదమే. చిన్నమ్మ కొడుకులు మీరు. ఎవరి నేమనడానికయినా అర్హులు. నన్ను మీరు "నువ్వన్నందుకు నాకే విచారం లేనప్పుడు ఇక మీ కెందుకూ?" అంటూ తేల్చేశాడు.

"అయ్యా, యీపూట మీరు భోజనానికి మాయింటికి దయ చెయ్యాలి" అని ఆహ్వానించాడు సలహాదారు.

"అలా కాదు. ఈ పూట మా యింటికీ, రాత్రి మీ యింటికీ వస్తారు వారు" అని సలహాదారుకి సద్దిచెప్పి "మరి దయచెయ్యండి" అంటూ శంకరప్ప చెయ్యి పట్టుకున్నాడు ఆటకాడు.

శంకరప్ప ముందు చెయ్యి విడిపించుకున్నాడు.

"మహానుభావా! మీ రుభయులూ నన్ను క్షమించాలి. మీ అనుగ్రహానికి చాలా సంతోషం. నే నింతలో యీవూరు విడిచి వెళ్ళను. ఎన్నెని పూటలు మీ యిళ్ళల్లో భోజనం చెయ్యాలో అప్పుడే అయిందా? ఇప్పటికి నన్ను విడిచిపెట్టండి. కారణం తరవాత మనవి చేసుకుంటాను"

"మీ బస యెక్కడ?"

"పెద్దమ్మ యింట్లో"

"భోజనం చెయ్యగానే దయచెయ్యగలరా?"

"వల్లకాదంటే భోజనమే మానెయ్యగలను"

"అక్కర్లేదక్కర్లేదు. ఇంతట్లో మేము కూడా భోజనం చేసి వస్తాము మిమ్మల్ని వొక చోటికి తీసుకు వెడతాం. మీరు వారితో—ఇప్పుడెందుకు లెండి, తరవాత మాట్లాడుకుందాం పెద్దమ్మ యింటి వెనకాతే మాయిల్లు పదండి"

ముగ్గురూ బయలుదేరారు.

రామశాస్త్రి, వెంకప్పయాజులూ వెంటరావడం చూచి, పెద్దమ్మ "అప్పుడే పిట్టల్ని కొట్టినట్టున్నాడు నాయన" అనుకుంది.

ఆమాటా యీమాటా చెబుతూ స్వైక్కక్షణం కూచుని "భోజనం కాగానే వచ్చేస్తాం" అంటూ శాస్త్రి, యాజులూ వెళ్ళిపోయారు.

జరిగిందంతా విని "యిదీ వర్థతి" అని మెచ్చుకుంటూ దగ్గర కూచుని కబుర్లు చెబుతూ శంకరప్పకి సుష్టుగా భోజనం పెట్టించింది పెద్దమ్మ.

## ౭

"ఇదిగో, భీమసేనరావుగారే! ఎప్పుడు దయచేశా రేమిటిపూళ్ళోకి?"

"కాస్సేపు మాట్లాడకండి! శాస్త్రుల్లుగారూ! నా ఆట కట్టి తీరతా నని ఫ్రెట్టు పెట్టుకున్నారు పంతులుగారు"

"ఎప్పుడు వేశా రండి నొత్తు?"

"పొద్దున్న"

"తమ రేనా?"

"అవును"

"చిత్తం" అంటూ శాస్త్రి రాజు దగ్గిరగా కూచుంటూ తన ముందు కూచోమని చోటు చూపించాడు; కాని శంకరప్ప కూచో లేదు. అది చూచి యాజులుకూడా నుంచునే వుండిపోయాడు.

ముగ్గురూ బలం పరిశీలించారు.

శాస్త్రీ శంకరప్పా చిరునవ్వు నవ్వుకున్నారు.

అరగడియ గడిచినా చలనం లేకపోవడం చూసి, కళ్ళతో పొడిచి యాజులు రెక్కపట్టగా, శాస్త్రి "పంతులుగారూ" అంటూ అందుకున్నాడు.

"కోపం వచ్చినా సరే ముందు నామనవి చిత్తగించాలి తమరు"

"ఒక్క—క్షణం తమ రూరుకోగూడదూ?"

"ఊరుకోనేవచ్చు. ఊరుకో లేకా కాదు ఆట కట్టించుకున్నా, కట్టినా వేంకటపతిరాజుగారితో యెత్తువెయ్యగలవారు మన జట్టులో తమ రొక్క—రే; కాని యిలా చూడండీ, వీరు—తంగిరాల శంకరప్పగారు లెండి వీరి పేరు. వీరి నొక్క—యెత్తు వెయ్యనివ్వండి, లేకపోతే తమరే వేయించండి వీరి సలహా పుచ్చుకుని"

"అయ్యా, దయచెయ్యండి" అంటూ శంకరప్పకి తహజీమిచ్చాడు రాజు.

"చిత్తం చిత్తం. నుంచునివుంటే బలం బాగా కనపడుతోంది సెల వివ్వించండి" అని సవినయంగా కోరాడు శంకరప్ప.

రాజు "తమ చిత్తం" అనగా, శాస్త్రికూడా చెప్పాడు కాని శంకరప్ప కూచోలేదు.

"అంత సమర్థులా వారు?" అని ప్రశ్నించాడు పంతులు

"సందేహమేం? మా దెబ్బల్లో ఆట కట్టేస్తారు"

"అబ్బా! ఏవూరయ్యా మీదీ?"

పంతులు ప్రశ్నలో అహమిక, తేలిక భావమూ వుండడం గుర్తించి, "మా బ్రహ్మగాళ్ళకి నోరు సరిగా తిరగదు చిత్తగించారా?" అన్నట్టు మొదట రాజుకేసి చిరునవ్వు నవ్వుతూ చూసి "చిత్తం చిత్తం, నా కేవూరూ లేదండి, చెట్టుమీది పక్షిని" అని చివరికి పంతులుకి బదులు చెప్పాడు శంకరప్ప.

"పక్షులు చదరంగం ఆడతాయా?"

"ఏమీ ఆడకా? ఆహార నిద్రాభయ మైథునాది—చిత్తగించారా? పక్షులు మనుష్యులు చేసే పను లన్నీ చేస్తాయి. అయితే, యెత్తు వెయ్యడానికి మాత్రం పూటలికి పూటలూ, రోజులికి రోజులూ గడిపెయ్యవు"

ఈ మర్మాఘాతానికి వ్యగ్రుడయిపోయి "అలాగేం? అయితే యేదీ కాయ కదుపూ చూద్దాం" అంటూ మూతి బిడాయించుకుని పక్కకి వొత్తిగిల్లాడు పంతులు.

"నన్ను పరీక్ష చెయ్యాలంటే నువ్వు తప్పుకుంటే యేమవుతుందీ?"

"మరేం చెయ్యాలి?"

"అలా కూచుని రాజుగారికి సలహా చెప్పాలి. లేకపోతే వారిని తప్పుకోమని నువ్వే ఆడాలి"

"పాండిత్యం వొలికించేస్తున్నావే! ఏదీ మరి కానియ్యి"

ఉభయుల మర్యాదాతిక్రమణమూ గుర్తించి రాజూ, శాస్త్రీ చాలా ఆందోళన పడ్డారు; కాని యింకా ముదిరితే అప్పుడు చూసుకో వచ్చునని వూరుకున్నారు.

పంతులు రాజు పక్కకి వెళ్ళాడు. పంతులుస్థానంలో యాజుల్ని కూచోబెట్టాడు శంకరప్ప.

శాస్త్రి, యాజులూ పైకి బింకంగానే వున్నారు; కాని యింతా చేసి చివరికి శంకరప్ప వోడిపోతాడేమో అని బిటబిట లాడిపోసాగారు.

అప్పుడు "సెలవా?" అంటూ ముందు రాజు అనుజ్ఞ పుచ్చుకుని, తరవాత "మన రాజుని వొక్క గది వెనక్కి తప్పించండి" అని యాజుల్ని ఆజ్ఞాపించాడు శంకరప్ప.

వెంటనే "తమరు తోసిరాజనండి రాజుగారూ!" అని పంతులు పురమాయించాడు.

"మన రాజుని ఆబంటుకి అడ్డు వెయ్యండి యాజులుగారూ!"

పంతులుకూడా యిలాగే ఆజ్ఞాపించాడు కాని రాజందుకంగీకరించలేదు.

ఇద్దరికీ చర్చ ప్రారంభమయింది. "ముందు మనరాజు వునికి గట్టి చేసుకోవా" లంటాడు రాజు. "ఎదటివారికిగుక్క తిరక్కుండా మళ్ళీ మళ్ళీ రాజనా" లంటాడు పంతులు.

ఇద్దరూ వొక్క నిమిషం ఆలోచించారు. అప్పుడుకూడా పంతులామాటే అన్నాడు "అయితే, యీఆటతో నాకు సంబంధం లేదు. మీరు కానివ్వండి" అని రాజు తప్పుకున్నాడు.

వెంటనే ద్విగుణితోత్సాహంతో "తెరిచి రాజు" అన్నాడు పంతులు

"మన నల్లగది శకటు అడ్డుపడెయ్యండి" అన్నాడు శంకరప్ప.

"నేను మీశకటుని కొట్టేశాను"

"మీరేం చేస్తారు యాజులుగారూ?"

"నేను వారి రాజును కొట్టేశాను"

పంతులు, వాలుక తెగ్గరుచుకున్నాడు. చివరికి నోరు కట్టేసుకున్నాడు.

తరవాత శాస్త్రి, యాజులూ బలవంతపెట్టగా, రాజు స్వయంగా శంకరప్పతో వొక ఆట వేశాడు. అదిముగిశాటప్పటికిచీకటిపడింది. అయినా రాజే వోడిపోయాడు. శంకరప్ప వెంటవెంటనే యెత్తు వేస్తూ రాగా, రాజు, గడియా రెండు గడియలూ ఆలోచించిగాని యెత్తు వెయ్యలేకపోతూ వచ్చాడు.

అందరూ లేచారు.

"రేపొకమాటు దయచేయించండి" అని రాజు ఆహ్వానించగా "చిత్తం చిత్తం, తప్పకుండా దర్శనం చేసుకుంటా" నంటూ శంకరప్ప సెలవు పుచ్చుకున్నాడు.

తరవాత రాజుతో లోగుమ్మందాకా వెళ్ళి "యిదంతా తెలివే అంటారా తమరు?" అని అడిగాడు పంతులు.

"కాకేమీ?"

"ఎన్నటికీ కాదు"

"ఏంచేతా?"

"అలాగా......ఉచ్ఛిష్టగణపతి వుపాసనవుంది ఆబ్రాహ్మడికి"

"తమ రెలా కనిపెట్టారు?"

"ఆవేషం చిత్తగించారా?"

"సింగినాదం కాదూ? మహారాజులుంగారి యెదట మన మెలా వుంటామో ఆలోచించారా?"

బుర్ర వంచుకుని మెట్లు దిగి "మరి సెలవు" అని మెల్లిగా జారాడు పంతులు...

"వేంకటపతిరాజుగారితో ఆటా? రెండాటలూ నారే వోడిపోయారా? ఇంకేం? మొదటే యీదారి తొక్కవలసిందోయి నాయనా! ఆదిక్కుమాలిన తాణేదారెక్కడ దాపరించాడోయి నీ ప్రాణానికి" అని శంకరప్ప వీపు నిమురుతూ పెద్దమ్మ ఆఖరు పెట్టాక చాలా నొచ్చుకుని, చాలా మెచ్చుకుంది.

అది చూసి "తాణేదారేమిటి శంకరప్పగారూ?" అన్నాడు శాస్త్రి. "ఆయన చదరంగం ఆడలేడే" అన్నాడు యాజులు.

దీనిమీద "చెప్పనా మాననా?" అన్నట్టు శంకరప్ప తనకేసి చూసీ చూడ్డంతోటే పెద్దమ్మ అందుకుని "అది వేరే గొడవ నాయనా! ఇప్పటిదికూడా కాదులెండి. నా నాయనా భోజనానికాలస్యం అయిపోతుంది. యిప్పటికే మీరు వెళ్ళండి. వెర్రివెంగ్రడికి నిద్ర తక్కువయితే జబ్బుచేస్తుంది మరి రాకండేం?" అని తొందరపెట్టి వారిని పంపేసి "నీళ్ళు కాగాయి పద స్నానం చెయ్యి వ్వుసే, రా నాయనా! నీళ్ళు తొరపడం అయిందా, మళ్ళీ తొరపడాలేనా?" అని అడుగుతూ రెక్క పట్టుకుని శంకరప్పని నూతి లోపలికి తీసుకు వెళ్ళింది.

## ౮

నాలుగ్ఘళ్ళ పొద్దెక్కింది.

"మీకోసం చూస్తున్నా" నంటూ లేచి నుంచున్నాడు శంకరప్ప

"రైతులు శిస్తులు తెచ్చారు. లెక్కలు పరిష్కారం చేసుకుని వారిని పంపేశాటప్పటికీ వేళ అయింది. మావాడు కూడా కొంచెం పని తగిలి పెందరాడే రాలేకపోయాడు. ఇంతకీ: మనం వెళ్ళవలసినచోట పొద్దు పొడిచాటప్పటికే ఆట మొదలయిందని

కబురు వచ్చింది, మరి బయలుదేరండి" అంటూ శాస్త్రి కవాచీ బల్లమీద కూచున్నాడు.

"సరే, వారిని బయలుదేర మంటూనే గుర్నూ తప్ప వేస్తా వేమి టోయ్?" అని ముదలకించాడు యాజులు.

ఒక్క నిమిషం సరా గాలు వెళ్ళిపోయాయి.

దండెం మీద ఆరి వున్న అంగాస్త్రం తీసి కప్పుకుని శంకరప్ప అడుగు వేశాడు.

"నా నాయన్ని పెందరాడే తీసుకురండి నాయనా! వేళ తప్పి భోజనం చెయ్యడం మీకు మాత్రం మంచిదా?" అని అడుగుతూ వారిని కొంచెం దాటించి వీధి అరుగుమీద చతికిలబడింది పెద్దమ్మ.

ఒకచోట, ఒక బుగ్గమీసాల క్షత్రియు డొక తురకాయనతో చదరంగం ఆడుతూ "దయచెయ్యండి శాస్త్రులు గారూ!" అని పిలిచాడు.

మరో చోట ఒక తెలగా, ఒక వైశ్యుడూ, ఒక బ్రాహ్మడూ దశావతారీ రంగుబూజు ఆడుతున్నారు. వారిలో బ్రాహ్మడు "అది నారాయణ వేద్దాం రావోయ్" అ పిలిచాడు.

ఇంకో చోట "మా భీమరాజు అసాధ్యపు యెత్తు వేశా డండోయ్! మీరు వస్తేగాని మాట తక్కేటట్టు లేదు. సమయానికి దేవుడులాగ కనపడ్డారు, రావాలి, మరి తప్పదు" అని ఒక పంతులు కేకేశాడు.

మరికొందరున్నూ పిలిచారు.

కాని శాస్త్రి ఆగలేదు.

"చాలా తొందరపనిమీద వెడుతున్నానండీ" "ఇప్పుడు కాదోయ్" "అవనిమీదే ఒకచోటికి వెడుతున్నాను. ఇప్పుడు రాలేను.

పరోలాగ అనుకోకండేం?" అని వారికి జవాబులు చెబుతూ అతను ముందుకి సాగుతూ వచ్చాడు.

వెళ్ళివెళ్ళి వారొక బ్రాహ్మడి యింట్లో ప్రవేశించారు.

అప్పటికప్పుడే అరవైయేళ్ళ ఆ బ్రాహ్మడు ఒక రాచకుమారుడితో చదరంగం ఆడుతున్నాడు.

ఆట చాలా బిర్రుగా వుంది. ఇద్దరూ ప్రాణాలు వుడ్డినంత కసిగా యెత్తులు వేస్తున్నారు.

ఓమాత్రాన తేలేటట్టులేదు; గాని క్షత్రియుడి ఆట కొంచెం లొంగసానుగా మాత్రం వుంది.

వీరు ముగ్గురూ చూస్తూ నుంచున్నారు.

తరవాత శాస్త్రీ యాజులూ తమకితామే కూచున్నారు; గాని శంకరప్ప గోడకి చేరబడి నుంచునే వుండిపోయాడు.

ఒక్కగడియ గడిచాక శంకరప్ప యిక వోపికపట్టలేక శాస్త్రీకేసి చూశాడు. శాస్త్రీ రాజుకేసి తిరిగి యేదో అనపోయాడు; కాని సరిగా యీసమయంలో, ఆ వృద్ధబ్రాహ్మణుడు అతి టెక్కుగా గోడకి చేరబడి "కృష్ణంరాజుగారూ! తమ యిష్టంవచ్చినవారి సలహా పుచ్చుకోండి. మరేమయినా చేసుకోండి. ఈపూటమాత్రం తమరు సరిగా యెత్తు వెయ్యగలిగితే, నా గర్వపరిహారానికి తమరేలాంటి శిక్ష విధించినా వొప్పుకుంటా" నంటూ మూతి బిగించుకున్నాడు.

వచ్చినవారిలో, యాజులు, సత్రకాయరకం అని, శాస్త్రీ ఆటకాడే అయినా తన యెదట కూచోడానికే జంకుతాడనీ అతనికి బాగా తెలుసు. శంకరప్పని అతగాడిదివరకెప్పుడూ చూడలేదు కాకపోయినా, ఆవేషాన్నిబట్టి అతనొక మనిషిగానే తోచలేదు ముసలాడికి.

అంచేతనే యీ బింకం అతనికి.

ముసలాడు నిజంగా అసాధ్యుడు. దూర్వాసుల ఆదివరాహమూర్తి అని అతని పేరు. సరాసరీ మహారాజులుంగారితో చదరంగం ఆడే గ్రామస్థులు నలుగు రైదుగురిలోనూ అత నొకడు.

వారిలో వయస్సుకీ, నేర్పుకీ కొంచెం పెద్దకూడాను.

అయితే, మూర్తి ఆట జన్మానికి కొక్కమాటయినా కట్టా లని కృష్ణంరాజు కెన్నాళ్ళనుంచో వుబలాటం ఈమాటమీద "యివాళ కట్టితీరా" లని పట్టుదల కలిగింది.

కాని యేమీ పాలుపోలేదు.

వచ్చినవారి సాయం పుచ్చుకుందామా అంటే శాస్త్రీ, యాజులూ తనకే తీసికట్టు.

అతని కళ్ళు అప్రయత్నంగా శంకరప్పకేసి మళ్ళాయి, "మన కెందుకూ?" అనుకుంటూనే "యేవూరు తమది?" అనేశా డతను.

"మీ రూరుకోండి" అన్నట్టు శంకరప్పకేసి చూచి "కృష్ణంరాజుగారూ! వారి వూరూ పేరూ అడగవద్దు. వారి సహాయం మాత్రం పుచ్చుకోండి. తాతగారిని మూడోయెత్తు వెయ్య నివ్వరు వారు" అని అందుకుని శాస్త్రి బదులు చెప్పాడు.

అది విని మూర్తి వెటకారంగా చిరునవ్వు నవ్వి పైగా సకిలించాడు. దాంతో రాజుకి పొడిచినంత పని అయింది.

శాస్త్రీ, యాజులూ కూడా కసి పెంచుకున్నారు.

రాజు శంకరప్ప కేసి చూశాడు. ఆచూపులో "సలహా చెప్పవలసిం" దన్న ప్రార్థన లేకపోలేదు; కాని శంకరప్ప చూసీ చూడనట్టూరుకున్నాడు.

"కానీగం" దన్నాడు మళ్ళీ శాస్త్రి "సందేహించకండి రా

గారూ" అని యాజులు కూడా చెప్పాడు. రాజు నోరారా అడక్కపోయినందువల్లనే శంకరప్ప వూరుకున్నాడని వారు గ్రహించేశారు.

ఈ సలహాలూ, యీతటపటాయింపూ, యీబింకమూ చూసి "కాపరం కడతేరినట్టే" అన్నట్టు వెకిలిచూపు చూశాడు మూర్తి.

అది కృష్ణంరాజు గాయం రేపింది.

"చూస్తా రేమండీ?" అన్నట్టు వురుముతూ చూశారు శాస్త్రి, యాజులూనూ.

ఊరుకోక అదిచూసి మూర్తి శిరఃకంపం చేశాడు.

"ఏమండీ, నాకు సలహా సెల విప్పిస్తారా?"

"తప్పకుండా మనవి చేసుకుంటాను"

"ఇలా దయచెయ్యండి"

"వద్దువద్దు తమరు జరగనక్కర్లేదు"

ఇలా అని, శంకరప్ప, మొదట శాస్త్రి యాజులుగార్ల కేసి గంభీరంగా చూశాడు. తరవాత మళ్ళీ ఫైకమాటు బలం చూశాడు. పిమ్మట "మీ కేమీ భయంలే" దన్నట్టు రాజు కేసి నిదానంగా చూశాడు. చివరికి మొగం వంచుకుని దూరంగా వెళ్ళి కూచున్నాడు.

౬

ఎలా చూసినా అక్కడికి బలమే కాదు, బల్లకూడా కనపడదు.

శాస్త్రికీ యాజులికీ యిదేమీ అర్థం కాలేదు.

మూర్తి బింకంగానే వున్నాడు; కాని అతనికి యిది బోధపడలేదు. రాజు కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఏం, అలా దూరంగా వెళ్ళి కూచున్నారేం?" అని అడగాడతను.

## వజ్రగింజలు

''దగ్గర కూచుని ఆడడానికి తాతగారి ఆటలో యేమంత వస వుంది? నే సిక్కణ్ణుంచే మనవి చేసుకుంటాను, తమరు యెత్తు వేయించండి'' అన్నాడు శంకరప్ప.

శాస్త్రీ రాజులూ యిది మూర్తికి తగిన జవాబని సంతోషించారు.

''ఇదేదో వుద్దండపిడుగులా వుంది'' అనుకుని రాజు బిగువు తెచ్చుకున్నాడు.

మూర్తి వారిపోకడలన్నీ కీగంట చూసి, శంకరప్పకేసి గుర్రు మంటూ చూశాడు.

ఒక్క నిమిషం యెవరూ అధరస్పందం చెయ్యలేదు.

''రాజుగారూ! కుడివేపున వున్న మన యేనుగుని వారి శకటు దగ్గరగా వేయించండి'' అని చెప్పాడు శంకరప్ప, కాని రాజుకది యిష్టం కాలేదు. అతనా యెత్తు వెయ్యలేదు. పైగా ''ముందు మన రాజుని తప్పించాలండీ! లేకపోతే ఆట మరీ చెడుతుంది'' అని వాదంలోకి దిగాడు.

''ఇదేమిటండీ?'' అన్నట్టు శంకరప్ప తనకేసి చూడగా ''వారు చెప్పినట్టు చెయ్యండి రాజుగారూ'' అని శాస్త్రి వొత్తి చెప్పాడు. ''చర్చ మొదలు పెట్టకండి. వారెలా చెబితే అలా చెయ్యండి. ఇష్టం లేకపోతే తమరు సొంతంగానే యెత్తు వేయించండి'' అని యీ రాజు కూడా కచ్చితంగా చెప్పాడు.

''అయితే వేశాను'' అంటూ రాజెత్తు వేశాడు. మూర్తి నిర్లక్ష్యంగా యెదురెత్తు వేసి కనుబొమ్మ లెగరవేస్తూ చూశాడు.

''వారు తమ శకటు మన యేనుగు పక్కకి తీసుకువచ్చారండీ—''

''మనకి తెలిసి రాజయిం దన్నమాట. అయితే, మన మొరగని

శకటు రాజుకి అయిమూల గదిలో పడేయ్యండి!''

''వే—శాను''

''అంతేనా!''

''మరేమిటి?''

''వారికి తెరిచి రాజయిందని చెప్పరూ?''

రాజు ఈమాట చెప్పగా గతుక్కుమని మూర్తి పైకి చూశాడు

''తాతయ్యగారూ!''

''ఎందుకండీ మనుమడయ్యగారూ!''

ఇలా అని మూర్తి కళ్ళు మూసుకున్నాడు.

''ఆలోచిస్తున్నారండీ''

''తొందరపెట్టకండి!''

మూర్తి వుడికిపోయాడు.

అతనికి వల్లమాలిన కోర్యం వచ్చింది. వెంటనే బలం అంతా నొక్కమాలు కలయచూసి, ఒక మాటొక బంటూ, ఇంకొక మాట శకటూ, మరొకమాటు గుర్రమూ ముట్టుకు, మూడు మాట్లూ వ్రాగిసలాడిపోయి, చివరికి రాజుని వెనక్కి తప్పించు కున్నాడతను.

గాజు శంకరప్పకి యీసంగతి చెప్పాడు.

''చూడండి, స్వస్థలంలో వుండిపోయిందే మన నల్లగది శకటు? దాంతో వారి బంటు—''

''కొట్టి రాజండీ''

''అట—''

''కట్టండీ తాతయ్యగారూ!''

మూర్తి కొయ్యయిపోయాడు.

శాస్త్రి యోగాజులూ అందుకూడా అన్వయించేటట్టు "సెబాస్" అన్నారు.

రాజు మీసంమీద చెయ్యి వేసుకున్నాడు.

స్వాగతాలు ముగిశాక యువకులు ముగ్గురూ శంకరప్పకేసి చూడగా, అతను, యెదటి గోడమీదవున్న పరశురాము పటంకేసి నిశ్చలంగా చూస్తున్నాడు.

ఆ నిర్వికారస్థితి చూసి ముగ్ధుడయి, లేచి వెళ్ళి చెవిలో యేదో చెప్పాడు శాస్త్రి.

శంకరప్ప తలవూపి వూరుకున్నాడు.

మూర్తికి రోషం కెళ్ళించింది.

దాని కద చల్లబడేటట్టు కనపడలేదు. దాంతో అతను బలం కలిసేసి "చిట్టచివర వచ్చి గరడీ చెయ్యడం కాదు ప్రయోజకత్వం! చేతనయితే మొదణ్ణుంచీ స్వయంగా యెత్తువెయ్యమనండి" అని మళ్ళీ తన బలం సద్దుకున్నాడు.

ఏమి సెలవు?" అని అడిగి రాజాకూడా బలం సర్దేటప్పటికి శంకరప్ప వచ్చి కూచున్నాడు.

"ఒక్క అరగడియ ఆట వడిగానే నడిచింది; తరవాత మందగించింది

ఆస్థితిలోకూడా మరో అరగడియ గడిచాక "యిక నాలుగో యెత్తు పడదవ్వ" న్నాడు శంకరప్ప.

"నీకు మూడో యెత్తు చేతనయితేకదా?" అని ముదలకిస్తూ మూర్తి రెండో యెత్తు వేశాడు.

శంకరప్ప నిర్విణ్ణత నటించాడు. అది చూసి యువకులు తెల్లపోగా మూర్తి "గుర్రం దిగండి" అన్నట్టు శిరఃకంపం చేశాడు.

"ఏస్తు వెయ్యమంటారా?" అని అడిగాడు శంకరప్ప.

"ఇంక మయితేనూ"

"అయితే మాటే చెప్పండి"

"అడిగేదేమిటి?"

"అయితే, యిదిగో సుద్రం యిక్కడ—వే—శాను."

"తెరచి రాజు"

"మిమ్మల్ని నాలుగో యెత్తు వెయ్యనివ్వనన్నాను"

"నీమాట లెక్కేమిటి జమేమిటి వేశేశాను."

శంకరప్ప శాస్త్రికేసి తిరిగి పెదవి విరిచాడు

"ఏమిటీ యీ ఘోరణీ" అనుకుంటూ శాస్త్రి బల్లమీదంతా పరిశీలించి "అయ్యో, తాతగారూ, ముందు 'ఆకు వేసి రాజు యిరిగింద' అని సద్దుకోకుండా మీరలా రాజు పెట్టాకండి" అన్నాడు.

తర్వాత, కృష్ణరాజు, యువకులతో కూడా శంకరప్పని తన యింటికి తీసుకువెళ్ళి, ఎంతో పొగిడి, ఎంతో ఆదరించి "యీ విద్యలో నన్ను ఉద్ధరించాలి" అంటూ రెండు చేతులూ పట్టుకుని ప్రార్థించాడు.

## ౧౦

శాస్త్రికి యీ జూదానికి నిద్రలేదు, ఆహారంలేదు. ఈ ప్రపంచమంతా రాణీ తక్కువైపోయింది,

వారికి శంకరప్ప ప్రత్యక్షదేవత అయిపోయాడు, గొప్ప గొప్ప ఆటగాళ్ళ దగ్గిరకి అతన్ని తీసుకువెళ్ళడమే వారికి వృత్తి అయిపోయింది.

భక్తియోగంలో శంకరప్పకి కాళ్ళు పట్టడందాకా వెళ్ళిపోయారు వారు.

ఇలాగ వొక్క — వారం గడిచింది.

ఈ వారంలోనూ పెద్దాపురంలో పేరుపడ్డ ఆటగాళ్ళు సగానికి పైగా చిత్తయిపోయారు.

శంకరప్ప వీధికి రావడం భయం. పదులు — యిరవైలు — యాభైలు చదరంగప్రియులతన్ని ముట్టుకుని "మేము చూస్తాం ఒక్క ఆట వెయ్యండి" "మాకు మెళుకువలు చెప్పండి" "తమరివూళ్ళో వుండిపోండి" "తమరొక మాటు మహారాజులుంగారితో ఆడాలండి" "తమర్ని దివాన్జీగారికి పరిచయం చేస్తాం దయచెయ్యండి" ఇలాగ ప్రార్థించడం మొదలుపెట్టారు.

"తంగిరాల శంకరప్ప" — ఇది పట్నం అంతటా — చుట్టుపట్ల కూడా రామనామం అయిపోయింది.

వూళ్ళవూళ్ళనుంచి ఆటగాళ్ళు రాసాగారు.

చూడనివారు "ఎంత పకడయిన మనిషో!" "ఎందర్ని వోడించి వచ్చాడో!" "ఎన్ని తోడాలున్నాయో!" "ఎన్ని సింహతలాటం మురుగులున్నాయో!" "ఎన్ని వుంగరాలు గడించాడో!" "ఎన్ని శాలువులు కొట్టేశాడో!" అనుకుంటూ మాని, తమ కళ్లు తామే నమ్మలేకుండా వున్నారు.

ఆ వేషం బాగాలేదని అనేకులు పట్టంచుల చాపులివ్వవచ్చారు. ఉప్పాడ జరీజాళ్లు కట్టబెట్టపోయారు. బరంపురం తాపితాలు కొందరు సమర్పించపోయారు. కాశ్మీర శాలువులు కొందరు కప్పపోయారు.

కాని శంకరప్ప వొకటీ పుచ్చుకోలేదు. ఒకటీ తాకలేదు, చూడనే లేదు.

"అన్నీ పుచ్చుకుంటాను. ఒకటీ విడిచి పెట్టను. ఏదీ పోనివ్వ

కోను; కాని యివ్వాడు కాదు. ఈస్థితిలో కాదు. ఎవరూ ఏమీ అనుకోవద్దు. ఎవరూ ఆగ్రహించవద్దు. నేనుపుచ్చుకోడానికేవచ్చాను. అడిగిపుచ్చుకుంటాను'' అని వారి కందరికీ సద్ది చెబుతూ వచ్చాడు.

అనేకులు విందు భోజనాలకు పిలిపించారు. వారికీ యిదే సమాధానం ఇదే సద్దుబాటు.

ఎవరికీ యేమీ బోధపడలేదు. ఏమీ తోచనేలేదు.

"పెద్దమ్మ చెల్లెలి కొడుకేమోరా" "మేనల్లుడేమోనయ్యా" "మొత్తానికి దగ్గిర వాడయి వుంటాడండీ" అంటూ యిలాగ యెన్నో రకాల ప్రతిపాదనలు జరిగాయి; కానీ వొకటీ నిలవలేదు.

శాస్త్రీ యాజులూ కూడా యీవిషయం తెలుసుకోలేకపోయారు.

పెద్దమ్మకూడా గాంభీర్యం వహించింది. ఇంకొక వారం గడిచింది.

సామంతులూ, సేనాధిపతులూ, రాజబంధువులూ, రాజపురుషులూ, సంపన్నులూ, సరసులూ కోరి తీసుకువెళ్ళి, శంకరప్పతో మళ్ళీ మళ్ళీ ఆడి, ఆట కట్టించుకొని, అదే తమ కొక గొప్పగా ఆనందించసాగారు.

అతనితో ఆడడమే వొక రాజయోగం అని అనేకులు ఆశ్రయించి, కనిపెట్టుకుని, పడిగాపులుపడి తహతహ లాడిపోసాగారు.

శంకరప్పకి శాస్త్రీ దివాన్జీ, యాజులు సేనాపతీ అయిపోయారు.

రాణీదారు కిదంతా వుప్పెనగా తోచింది. దివాన్జీ చెవులు తూట్లుతూట్లయిపోయాయి; కాని అతనిదేమీ యెరగనట్టు నటించసాగాడు. అయితే "మహారాజే కభురు చేస్తారేమో కొంప తీసి'' అన్న భయంమాత్రం అతనికోమూల పేగులు తోడేస్తూనే వుంది.

## ౧౧

చీకటి పడుతూ పడుతూ వుండగానే కోలాకోలాలు చేస్తూ రామసోదెమ్మ వడ్డించగా, పెద్దమ్మా, శంకరప్పా యేకబంతిని భోజనం

చేసి వచ్చి అరుగుమీద కూచుని కబుర్లు చెప్పుకోసాగారు.

మరో పది నిముషాలకి శాస్త్రి వచ్చి, నట్టివాకిట్లో మంచం మీద కూచున్నాడు.

ముగ్గురూ మాట్లాడుకుంటూ వుండగా "పెద్దమ్మగారూ!" అంటూ వీధిలోనుంచి పిలుపు వచ్చింది.

"ఎవరు వారు?" అంటూ శాస్త్రి వెళ్ళి తలుపు తియ్యగా, ఘుమ్మంటూ వీధిలో రెండు కాగడాలు. పాలకీ, పదహారుగురు బోయీలూనూ. ఈటెలతోటీ, బల్లేలతోటీ, తుపాకులతోటీ పది పదిహేనుగురు భటులు. అందరికీ జవాబుగా గుమ్మం దగ్గిరసా వెండి మీసాల ముస్సద్దీ అతనికి పక్కగా దళాయతు.

చకితుడై లేచి శంకరప్ప నట్టివాకిట్లోకి వెళ్ళాడు. "ఇది మహారాజులుంగారి పిలుపు" అని సన్నగా చెబుతూ, పెద్దమ్మ అతనితో కూడా రెండడుగులు వేసి ఆగిపోయింది.

"ఇక్కడ తంగిరాల శంకరప్పగారున్నారాండీ" అని ముస్సద్దీ.

"ఉన్నారు"

"వారి దర్శనంకోసం వచ్చాము"

"తమరు—" అంటూ శాస్త్రి మాట తేల్చేశాడు.

"మేము చామర్లకోట శ్రీరావు రాయణప్ప రంగారాయణింగారి మనుష్యులం"

"దయచెయ్యండి, వారే శంకరప్పగారు"

ముస్సద్దీ గుంజా దాటి వచ్చాటప్పటికి శాస్త్రి మనస్సు పురకలు వేసింది. "వారెవరూ?" అన్నట్టు శంకరప్ప పెద్దమ్మకేసి చూశాడు. "చెబుతా" అన్నట్టు పెద్దమ్మ కళ్లు చికిలించి, మళ్ళీ వెనక్కి రెండడుగులు వేసింది.

"నమస్కారాలు" అంటూ ముస్సద్దీ నమ్రుడు కాగా "శ్రీకృష్ణా

ర్వాలం. దయచెయ్యండి'' అంటూ శంకరప్ప మంచం చూపించాడు.

శాస్త్రికూడా "దయచెయ్యండి'' అన్నాడు; కాని మున్సబ్దీ నుంచునే వుండి, మోడ్పుకేలితో శంకరప్పకు చూపిస్తూ "వారి సన్నిధిని నుంచునే వుండవలసినవాణ్ణి నేను'' అన్నాడు.

"ఎంత మాట సెలవిప్పించారూ! అందరమూ కూచుందాం దయచెయ్యండి'' అంటూ మంచం దగ్గిరికి వెళ్ళాడు శంకరప్ప.

శాస్త్రి వెళ్ళాడు. మున్సబ్దీ కూడా కొంతదూరం వెళ్ళాడు; కాని కూచోక చేతులు దోయిలించుకున్నాడు.

చివరికి అందరూ నుంచునే వుండిపోయారు.

మంచం మొదణ్ణుంచీ నిలువు కాళ్ళమీదే వుంది.

అప్పుడు మున్సబ్దీ చేతులు మళ్ళీ జోడించుకుని "తమరు చదరంగంలో సిద్ధులని కోలాహలంగా వున్న జనశ్రుతి విని, తమ చాతుర్యం చూసీ, తమతో ఒక్క ఆట వేసీ ఆనందించకోరి, దయచెయ్యవలసిందని కోరుతూ, తమ కోసం మా దొరగారు ఈ పరివారం పంపించారు. వారి అభిలాష తీర్చవలసిందని మా సవినయ ప్రార్థన'' అని విన్నవించాడు.

ఇది విని "ఇలాంటి ఆహ్వానం యిదివరకెవరికి వచ్చింది!'' అనుకుంటూ శాస్త్రి పరవశుడయ్యాడు.

ఆయన ఏమి చెప్పడమో తోచక, శంకరప్ప, మొదట మిత్రుడికేసి, తరువాత పెద్దమ్మకేసీ చూశాడు.

ఈలోపునే ఆశ్చర్య సంభ్రమ సంతోషాదులన్నీ మింగించుకుని, కర్తవ్యం కూడా నిశ్చయించుకుని వున్న పెద్దమ్మ "వద్దు'' అన్నట్టు తల కొంచెం ఆడించి గుమ్మంలోకి వెళ్ళిపోగా, ఉండలాగ వెళ్ళి శంకరప్ప మున్సబ్దీ రెండు చేతులూ పట్టుకున్నాడు.

"ఇలాంటి ప్రభు సన్మానం నే నెన్నడూ నెరగను అసలు, నాకిలాంటి యోగ్యత వుందని నా కెప్పుడూ తోచలేదు. తమరాక నన్ను బ్రహ్మానంద భరితుణ్ణి చేసింది. దొరవారి కటాక్షం నాకు కొత్త ఆశలు రేపెడుతోంది. కాని నా దొక ప్రార్థన. తమరు బాగా ఆలోచించాలి. ఏదో రెండు మూడెకరాల కొండ్ర దున్నుకుంటూ, మిత్రులతో [illegible] అనుకుంటూ కాలక్షేపం చేస్తూ వున్న ప్రవృత్తుణ్ణి నేను. కార్యాంతరంమీద యీవూరు వచ్చిపడ్డాను. ఇక్కడికి వచ్చి చాలా రోజులయింది. ఇంకా చాలా రోజులూ వుండవలసివుంది, కాని పెద్దాపురం విడిచి యిప్పట్లో నే నవతల అడుగు పెట్టలేను పెట్టడానికి కొన్ని చిక్కులున్నాయి. తమరీ సంగతి దొరవారికి విన్నవించి, నామీద వారి అనుగ్రహం తప్పిపోకుండా వుండేటట్టు చేసే భారం తమ మీద వుంది. నేను తమ ఆశ్రితకోటిలో వాణ్ణి. తమ రన్యథా భావించవద్దు"

మొదట చకితుడయిపోయి, తరవాత ముస్సద్దీ అన్నాడు.

"ఏడు రోజులనుంచి మా దొరవారికి తమ లీలలు వినడంతోటీ, చెప్పుకోడంతోటీ సరిపోతోంది. మూడురోజులకిందట తమతో మొత్తు వెయ్యాలని వారికి సంకల్పం కలిగింది. తమరు ఆదివరాహమూర్తిగారిని చిత్తుచేసినవార్త వారికి ఈ సాయంత్రమే తెలిసింది తెల్లవారేదాకా వుండలేక వున్నపళంగా మమ్మల్ని తరిమారు."

"నేను పూర్తిగా పరితృప్తుణ్ణవుతున్నాను. చామర్లకోట దొరల సాహసౌదార్యాలు జగద్విదితాలు; కాని చదరంగం ఆటకోసమే మే మిప్పుడొకచోటికి వెడుతున్నాము. ఏర్పాట్లన్నీ యిదివరకే అయిపోయాయి. మాట తప్పడం అపరాధం అయిపోతుంది."

"పోనీ, ఫలానా రోజున దయచేస్తామంటే"—

"శ్రీహరీ" అని మాట సగంలోనే అందుకున్నాడు శంకరప్ప.

"అలా మనవి చెయ్యడానికిన్నీ సుతరామూ వీలు కనపడ్డం లేదు. నేనే బయలుదేరి వస్తాను. ఏక్షణంలో వీలుపడితే ఆక్షణంలో వచ్చి వాల్తాను. అయితే ఒక్క మనవి. ఈ పాలకీ—యీపరివారం—వీటికి నేనర్హుణ్ణి కాను. పాదచారినై వచ్చి, నేను దొరవారిని సేవించుకుంటాను"

"మా వుత్సాహం అంతా భగ్నపడిపోయింది"

ఈ మాట అన్నప్పుడు ముస్సద్దీ కొనవూపిరితో వున్నట్టయిపోయాడు.

"తమరలా సెలవిప్పించవద్దు. నాదగ్గిర దొరవారనుకుంటూ వున్న భక్తిచాతుర్యాలుండడమే నిజమయితే, యీ వ్యవధానం వారి వుత్సాహాన్ని ద్విగుణమూ, త్రిగుణమూ చేసి, చివరికి ఆనందాన్ని శతసహస్ర గుణాలు చేస్తుంది"

ముస్సద్దీ మరిమాట్లాడలేక, రెండు చేతులూ యెత్తి నమస్కారం చేసి, మెల్లిగా వెనక్కి తిరిగాడు.

గుమ్మందాకా వెళ్ళి శాస్త్రి సాగనంపాడు.

## ౧౨

సుతారంగా మొగంతిప్పుకుంటూ శంకరప్ప పెద్దమ్మకేసి చూశాడు. గభీమని వచ్చి అతనివీపు నిమురుతూ "చాలా చక్కగా చెప్పావు నాయనా! ఇలాగ మాట పొందిక వుంటే విద్యయెంతయినా రాణిస్తుంది" అని మెచ్చుకుంటూ అతన్ని మంచంమీద కూచోబెట్టి పక్కని కూచుంది పెద్దమ్మ.

"ఈపులకం యేమిటి పెద్దమ్మా?"

"పులకాని కేం వుంది నాయనా? ఇది రసికుల లక్షణం. కళ తెలుసుకోడమూ, అనుభవించడమూ, గౌరవించడమూ—ఇంతే వారి పని. కళాపరిజ్ఞానం వున్నచోట ద్వంద్వాల చింత తలయెత్త లేదు. అదలా వుండనియ్యి. నీకిదే చెప్పడం. నువ్వు వచ్చిన పని కాదో పండో తేలేదాకా పదవలనం చెయ్యవద్దు"

"సరిహద్దుకూడా మూడను, సరా?"

"మహాస్వామ్రండా. మహారాజుకూడా యిలాగే కభురు చేస్తారు."

"ఇదంతా నీ చలవ"

ఇలా అంటూ శంకరప్ప పెద్దమ్మ పాదాలు పట్టుకున్నాడు. "[illegible]రితండ్రీ! నీకు వచ్చిన లోటు లేదమ్మా! నువ్వు అగ్రహారీకుడ వయిపోతావు నాయనా!" అని పెద్దమ్మ శంకరప్ప శిరస్సు ఆఘ్రాణించింది.

ఈసమయంలో "మాట లెవరి కిచ్చారండీ మీరూ?" అని ముదలకిస్తూ శాస్త్రి వచ్చాడు.

కూచోమని మంచంమీద స్థలనిర్దేశం చేస్తూ "ఏంకివ్వలేదుటండీ?" అన్నాడు శంకరప్ప.

శాస్త్రి విభ్రాంతుడై తకీమని నిలిచిపోయాడు. "మా నాయన మాటల్లో దొరకడు" అని పెద్దమ్మ శంకరప్పమీద మెటికలు విరిచింది.

"ఇలాంటి గౌరవం ఏ పండితుడికి జరిగింది పెద్దమ్మా?"

"నాయనికింకా యెంతెంతలేని గౌరవాలు జరుగుతాయో అప్పుడే అయిందా శాస్త్రుల్లు బాబూ?"

"ఇదంతా పెద్దమ్మ చలవా, మీ అనుగ్రహమూనూ"

ఇలా అంటూ మోడ్పుకేలతో వృథయులేసి తిరిగి నమ్రుడైనాడు శంకరప్ప.

"నాసికేంగాని—మరితరవాయి?" అన్నాడు శాస్త్రి. దీనికి జవాబుగా "మాంచి గసగసందాయప్పట్టులో వుంది ఆట" అని నురగలు కక్కుకుంటూ వచ్చాడు యాజులు.

"వెళ్ళండి నాయనా, వెళ్ళండి" అని తొందర పెడుతూ పెద్దమ్మ లేచి నుంచుంది.

"ఇలా కూచో. ముందు ఆయాసం తీర్చుకో" అంటూ యాజుల్ని చెయ్యి పట్టుకు లాగి దగ్గిర కూచోపెట్టుకుని "ఏమిటి విశేషాలు? వివరంగా చెప్పు" అన్నాడు శాస్త్రి.

"వెళుతూ చెప్పుకోగూడదూ?" అని శంకరప్ప లేచి నుంచోగా, "నా కాయాసం యేమిటోయ్? పందిట్లో వెళ్ళి మన మక్కడ వాలాలి. అంత శోభాయమానంగా వుంది అట. మరి లే" అంటూ లేచి నుంచుని శాస్త్రి చెయ్యి పట్టుకు లాగాడు యాజులు.

ముగ్గురూ బయలుదేరారు.

"తొందరగా రండి నాయనా. నిద్ర పాడుచేసుకోకండి" అంటూ గుమ్మందాకా వెళ్ళి, తలుపు వేసి పెద్దమ్మ మళ్ళీ వచ్చి మంచం మీద నడుము వాల్చింది.

## ౧౩

పుచ్చపువ్వు లాగ వెన్నెల. గంధప్పొడి లాగ పిల్లగాలి. వీటికి అనుకూలంగానే మానసిక పరిస్థితులు.

యువకులు పొంగిపోతున్నారు.

రెండో వీధికి మళ్ళా టప్పటికి "శంకరప్పగారు కూడా వున్నారా యేమిట్రా?" అని ఒకప్రశ్న. "ఉన్నారోయి! కాని ఆగడానికి వీలులే" దని శాస్త్రి జవాబు.

మరి నాలు గిళ్ళు దాటారు. ఒక యువకుడు దారి కడ్డంగా నుంచుని "నుంచో, నుంచోవు కాదూ?" అని నిష్ఠురా లాడాడు. "నీ ఖోరణే నీదా? ఇవతలవాళ్ళ మంచిచెడ్డలు చూడవద్దూ? అక్కడెంత తొందరపని వుందో యెరుగుదువా" అంటూనే తప్పించుకుని ముందుకి సాగిపోయాడు శాస్త్రి.

ఇలాగే మరికొందరున్నూ పలకరించారు. "ఒక్క నెత్తు" అని అనేకు లువ్విళ్ళూరారు. "వీలు లే" దనడానికి శాస్త్రి విసిగిపోయాడు.

మలుపు తిరిగేటప్పటికి వేశ్యావాటిక.

సర్వవిధాలా అది విలక్షణ ప్రపంచం.

మామూలుగా కాక, అక్కడి వెన్నెల సురభిళంగా వుంది. పిల్లగాలి మధురంగా వుంది.

దీనికి సాయం, ఒక మేడమీద గాత్రపాట, ఒక మేడమీద వీణాధ్వని, ఒక మేడమీద మృదంగధ్వని వుజ్జీవింప చేస్తూ గజ్జెలచప్పుడు, ఒక మేడమీద కిలకిల నవ్వులు, ఒక మేడమీద ఛలోక్తులు.

కొన్ని ద్వారాలలో బంగరు బొమ్మలు, కొన్ని అరుగులమీద జంగమవల్లులు కొన్ని మేడల ముందు సీతాకోక చిలుకలు.

అక్కడక్కడ నీడల్లో కొత్త తుమ్మెదలు.

అలాంటిచోట యీ మిత్రమండలి.

ఒక మేడమీదనుంచి "అల్లుడుగారూ, దండాలు" అని వినిపించింది, "శ్రీకృష్ణార్పణం" అన్నాడు శాస్త్రి.

ఒక ద్వారంలోనుంచి "మామయ్యగారికోసం కళ్ళు కాయలు కాసిపోయాయి" అని వినిపించింది. "కోరగా అయినా పండనియ్యి" అని యాజులు దీవన.

ఒక అరుగుమీదనుంచి "బాపయ్యగారూ, బాపయ్యగారూ, రెండెత్తులు—దయచెయ్యరూ!" అని పిలుపు. "ఒకచోటికి శంకరప్ప గారిని తీసుకవెళుతున్నాము. ఇప్పుడు కాదు" అని యాజుల నిరాకరణం.

ఒక మేడమీదనుంచి శ్రీ సుభద్రానాయిక అడ్డంవచ్చి "అన్నయ్యగారికి దండాలు" అంది.

"శుభం. వెళ్ళివ్వాలి"

"ఒక్కమాటు శంకరప్పగారి పాదాలు కొలుచుకుంటాను"

"ఈమె, ఆ అలివేణి. రాజసభలో ప్రముఖురాలైన నర్తకి. విశేషించి రసరంగంలో నిధి. ఒకమాటు "ఆడ కట్టు" అన్నంత చాతుర్యం చూపించగా మెచ్చి, మహారాజులుంగారే తమ రత్నాంగుళీయకమూ, బంగారుజడా, ముత్యాలపువ్వులూ, దంతపుబల్లమూ బహూకరించారు. ఒక్కమాటు పాదాలివ్వండి"

శాస్త్రి యిలా చెప్పగా "నాపాదాలు ధూళిధూసరితాలు కదా!" అని శంకరప్ప సంకోచించాడు.

"మహాత్ముల పాదధూళి నాశిరసున దాల్తు" నంటూ అలివేణి శంకరప్ప పాదాలుపట్టి కళ్ళకద్దుకుంది.

"సెలవయితే—" అని శాస్త్రికేసి చూస్తూ శంకరప్ప నసిగాడు. "తప్పకుండాను" అని యాజులనగా "శంకరప్పగారు మీయింటికి సావకాశంగా వస్తారమ్మా వెళ్ళు!" అని శాస్త్రి వాగ్దానం చేశాడు.

"మహాప్రసాదం" అని అలివేణి తప్పుకుంది.

వారు నాలుగిళ్ళు దాటి ఒక భవంతి దగ్గిర ఆగారు.

"రంగనాయిక" అని చక్కని చుక్క. చికిలిచేసిన మన్మథ

బాలం. వయస్సు రసాలహి యిరక్షై. ఆటపాటల్లో మేటి. విటుడు పందొమ్మిదేళ్ళ క్షత్రియ యువకుడు. మహారాజు సదరంగం ఆడాటప్పుడు పరికరాలు సద్ది, సన్నిధిని వుండవలసిన నలుగురు వేశ్యలలోనూ వొకతె. అప్పుడప్పుడు మహారాజుని సదరంగ వినోదం చేకూర్చేవుజ్జీ''

ఇలాగ శంకరప్ప చెవిలో చెప్పి శాస్త్రి గుమ్మంయెక్కాడు.

## ౧౮

గుమ్మందాటితే, లోపల చక్కని భవనం. ముందు పెద్ద జాకా మల్లిపందిరి. బయలంతా పూలతోట. పందిరికి దక్షిణంగా పావురాల గూడు. హాల్లోనూ అరుగులమీదా పట్టపగలన్నంత దీపకాంతి.

వాతావరణం అంతా అగరువత్తుల పరిమళంతో గుమ్మయిపోయి వుంది.

పందిట్లోనే వొక కమాచీ బల్ల వుండగా, దాని మీద కూచున్నారు వారు.

ఎవరేనా కనబడతారేమో అని యిటూ అటూ యిటూ చూశాడు. ''ఏమిటి దారి?'' అని శాస్త్రి ఆలోచనలో పడ్డాడు.

శంకరప్ప కళ్ళప్పగించేశాడు.

ఇక్కడేలా అన్న సమయంలో ''ఇవాళ మీ ఆట కట్టి తీరతానండీ'' అని దక్షిణపు తెరిపిలోనుంచి వొక చిలకపలుకు వినవచ్చింది. ''అమ్మయ్యా'' అని యెగిరిపడి తర్జనితో నిర్దేశిస్తూ, ''రంగనాయక'' అన్నాడు మెల్లిగా శాస్త్రి.

''ఆ యేనుక్కి కాపు లేదే అక్కా?'' అని వొక నెమలి కేక. శాస్త్రి ''మగదలుపిల్ల'' అన్నాడు.

స్ఫుటంగానూ, స్పష్టంగానూ వినబడలేదు; గాని, జవాబుగా నవ్వుల పుదుసుకలరం.

"అలా వచ్చారా? ఆ యెత్తుమీద వచ్చారా? అందుకా మీ రాకా? ఉ-హూ! ఇందాకటికంటె ఆడింది చెల్లెమ్మోయ్! అయినా—గుర్రం యిక్కడ వేశానండీ" అని మళ్ళీ చిలకపలుకు.

ఉలిక్కిపడి, యాజులు శాస్త్రిని గోకాడు. "ఏమిటి దారి?" అంటూ శాస్త్రి మళ్ళీ తటపటాయించసాగాడు.

శంకరప్ప యివేమీ వినలేదు. మిత్రులనూ చూడలేదు.

అతనికి తాదాత్మ్యం కలిగింది. ఆవేశమున్నూ వచ్చేసింది

గభీమని లేచి నుంచున్నాడతను. లేస్తూనే దక్షిణపు తెరిపి కేసి పందిరి చివరికి వెళ్ళాడు.

శాస్త్రి యాజులూ "యెందుకో?" అనుకుంటూనే వుండగా "నీకంత కష్టం యెందుకు చిరంజీవీ? ఏగదిలో యే జంతు వుందో చెబితే, నే నెక్కించే సలహా చెప్పి, నాలు గెత్తుల్లో నిన్ను గెలిపించనూ?" అని కూడా అనేశాడు.

అది విని యేం చిక్కు వచ్చిపోతుందో అని నోళ్ళు మూసుకుని కంగారుపడసాగారు మిత్రులు. వారి గుండెలు పీచుపీచు మని పోతున్నాయి; కాని,

"మీరు తంగిరాల శంకరప్పగారా యేమిటండి?"

"ఔను సౌభాగ్యవతీ!"

"దండా లండి"

గలగల మని చల్లగా హస్తాభరణాల చప్పుడూ యీమాటా కలిసి వచ్చాయి.

"శ్రీకృష్ణార్పణం" అన్నాడు శంకరప్ప.

"ఏమండి, లోపలికి రానిద్దామా?"

ఈమాట యువతలికి చెవిలో చెప్పినట్లు వచ్చింది.

జవాబు వినపడలేదు.

"పోనీ, నేను వారి సలహా పుచ్చుకోనా?"

జవాబు వినపడలేదు.

ఏదో స్త్రీ కంఠస్వరం. అతి సుతారమైన వుచ్చారణ.

ఇది యిలా జరుగుతూ వుండగా, లోపలనుంచి వొక జరత వచ్చి, కింది చీడీలమీద నుంచుంది. గూాజులు వెళ్లి ఆమెతో ప్రస్తావన ప్రారంభించాడు.

"వారు, చెబితే చాలంటూ వుంటే, బల్లపట్టుకు వెళ్ళి చూపించడం యెందుకే అక్కా?" అని మరదలు పిల్ల అనగా, "అక్కర్లేదక్కర్లేదు, వొక్కమాటు చెబితే చాలు" నని శంకరప్ప మళ్ళీ అన్నాడు.

శాస్త్రి యింకా నిర్విణ్ణుడే అయి వుండగా, మరదలుపిల్ల వివరాలు చెప్పింది.

"చాలా మట్టుకు మంచి దారికే వచ్చావు; కాని, యెదటి బలంలో యెక్కడ అవుకుందో కనిపెట్టలేకపోయావు. అయినా మించిపోయిందేమీ లేదులే! చూదూ, కుడివేపున వున్న గుర్రం తీసుకు వెళ్ళి, వారి శకటు ముందు వెయ్యి"

"......వేశాను"

"సరే"

"వారు దానిమీదికి తమ మంత్రిని వేశారండీ. గుర్రానికి కుడి ప్రక్కగా వేశారు"

"చాలా బాగుంది. ఈమాటు ఎడమవేపునవున్న యేనుగుని నాలుగోవరస మొదటి గదిలో——"

"వేశానండీ"

"ఏమి జరుగుతుందో చెప్ప"

"ఆలోచిస్తున్నారు"

కొంచెం సేపు నిశ్శబ్దం

"ఇంకా ఆలోచనే నండి"

"తొందర పెట్టకు"

మళ్ళీ పావుగడియ గడిచింది.

"ఇంకా ఆలోచనే నండి"

"కనిపెట్టుకుని వుందాం"

మళ్ళీ పావు గడియ నిశ్శబ్దం.

"అమ్మయ్యా! తమ మంత్రిని తమ రాజుకి కుడిపక్కని వేసుకున్నారండి"

"ఈమాటు మన గుర్రాన్ని అయిమూలగా పురికించు"

"వేసి రాజు"

శంకరప్ప మొగం వికసించింది.

ఇంకో పావుగడియ చల్లగా జారుకుంది.

ఈ పావు గడియలోనూ జరత రావడమూ, శాస్త్రికి నమస్కరించడమూ, శాస్త్రి "మాట్లాడకు" అన్నట్టు చెయ్యి వూపడమూ, ఆమె మెల్లిగా లోపలికి వెళ్ళిపోవడమూ జరిగిపోయాయి.

"రాజుని, వొక్క గది ముందుకి—మన గుర్రం దగ్గిరికి వేశారండి"

"శివశివా! మన శకటింపోనే?"

"ఆట కట్టండి"

అచ్చంగా అది మయూర క్రేంకారం.

మరి మాట లేదు. బలం కలిపేసిన చప్పుడుమాత్రం వచ్చింది. ఒక్క పావు గడియ వేచివుండి, తరవాత వెనక్కి వచ్చి, బల్లమీద

కూచుని యాదాలాభంగా అరుగుమీది కిటికీ కేసి చూశాడు శంకరప్ప.

కళ్లు చెదిరిపోయేట్టు కిటికీలో మొదట రెండు చంద్రబింబాలు మెరిశాయి. వాటి వెనుక నూనూగు మీసాలున్నా తళుక్కుమన్నాయి.

చెరో వేపునా మొగంమీద మొగం ఉంచి, శాస్త్రీ యాజులూ "కొంపలు మునిగిపోతా యనుకున్నా" మనగా, శంకరప్ప ముక్కుమీద వేలు పెట్టుకున్నాడు.

వీరీ స్థితిలో వుండగా ఎక్కడోలాగ మంజీరనాదం సన్నసన్నంగా వినవచ్చింది. "ఏమిటి చెప్మా?" అనుకుంటూ వుండగా, "దణ్ణాలండి" అని వెనకాల చిలకపలుకు. ముగ్గురూ అదరిపడి వెనక్కి చూడగా, అంజలి బంధంలో ఒక బంగారు బొమ్మ.

"శ్రీకృష్ణార్పణం" అని శంకరప్పా "సౌభాగ్యవతీ భవ" అని శాస్త్రీ యాజులూ దీవిస్తూ లేచి నుంచున్నారు.

దరహాసలిప్తాలే అయినా, శంకరప్ప చూపులతో విభ్రాంతురాలై, అంజలిబంధంతో ఆమె అలాగే నిలిచిపోయింది.

అడ్డచారల శాబొంముమీద వున్న సన్నజరీకంచుకా వలె వాటు. ముద్దుముద్దుగా వాటిని పొదివి పట్టుకుని గంటల మొలనూలు. మెడలో పైటమీద యెదపై దిగుడుగా పచ్చలపతకం, ముక్కున నత్తూ బులాకినీ, చెవులకు జూకాలూ, కర్ణ పువ్వులూ, బావిలీలూనూ, చేతులకు మురుగులు, మురిడీగొలుసులు, పోచీలు, కంకణాలు, భుజబందులు, శిరస్సున సూర్యుడు, చంద్రుడు, పాపిడి పిందిరీలు, తమలపాకు, మొగిలిరేకు, తెగబారెడు బంగారుజడ. దానికి గుత్తులు గుత్తులుగా గంటలు.

ఆమె శరీరకాంతిలో కలిసి పోవడంవల్ల కొన్ని ఆభరణాల రత్నపరుకే గాని, బంగారం కనిపించడం లేదు. ఒక్క శిరోభూష ణాలు మాత్రమే సర్వాంగీణంగా మెరుస్తున్నాయి.

సంతత పరిచయం వుండిన్నీ శాస్త్రీ యాజులూ చకితులు అయి నారు. శంకరప్ప పరవశుడే అయిపోయాడు.

"దయ చెయ్యండి" అంది రంగనాయిక.

"ఇప్పటి దాకా కూచునే వున్నాం కాదూ? దాని కేమిగాని, రసభంగం చేశాను, సిగ్గుగా వుంది" అన్నాడు శంకరప్ప.

"ఎంత మాట సెల విప్పించారూ? మా యిల్లూ, మా వంశమూ, నా జన్మా పవిత్రం అయినాయి. మే మందరమూ, ధన్యులం అయి నాము"

అంజలి బంధం విప్పకుండానే రంగనాయిక యిలా అంది. శాస్త్రి శంకరప్పకేసి చూశాడు. ఆ చూపులో "ఆదరం అన్న మాటలో ప్రాతినిధ్యం స్ఫురిస్తోంది సుమండీ" అన్న భావం వుండడం గుర్తించి, శంకరప్ప "మీ వుదారబుద్ధి అలా అని పిస్తోంది. నాలో కించిత్తూ వైలక్షణ్యం లేదు" అన్నాడు.

"తమలో లేనిది వైలక్షణ్యం కాదు, దానికి పరిమితి"

శాస్త్రీ, యాజులూ "రంగా, నువ్వు సరిగా చెప్పా" వన్నారు.

"నేనసహాయుణ్ణయిపోయాను" అని శంకరప్ప మందహాసం చేశాడు

"అసహాయశూరులు తమరు. పదికోజులుగా తమ పేరుమీదుగా దేవదుందుభులు మోగిపోతున్నాయి. ఉబలాటం వురకలువేస్తోంది అయితే, నాజన్మలో తీరనికోరిక యిది; కాని అప్రయత్నంగా సిద్ధించింది"

"అంత నిరాశయేలా? కాకిచేత కబురుచేస్తే రాకపోదునా నేనుని

ఈపట్నంలో హేమాహేమీలున్నారని తెలిసి, మెళుకువలు గ్రహించడానికి కదా నేనువచ్చాను?"

"శ్రీహరీ! శ్రీహరీ! ఊరుకుంటారేం శాస్త్రుల్లుమామయ్యగారూ"

"ఊరుకోక యేమి టీచెయ్యడం! ఆటలో నెగ్గామకనక నా మాట నెగ్గడానికి?"

"నాకు వాగ్బంధంచేశారు మీరు" అన్నాడు శంకరప్ప.

"మీకు వాగ్బంధనం చెయ్యడానికి సరస్వతికూడా చాలదంటే యిక అస్మదాదులమాట చెప్పేదేమిటి? అయితే మీరీవూరునుంచి కదలకుండా అష్టదిగ్బంధనంమాత్రం చేసేస్తాంమేము" అన్నాడు యాజులు.

దానిమీద "అవునవును. అదితప్పకుండా చెయ్యాలి" అని రంగనాయికా, "ఇంకా చెప్పాలా?" అని శాస్త్రిదృఢంగాఅన్నారు.

ఈసమయంలో వెండిపళ్ళెంపట్టుకుని మరదలుపిల్లా, ఆమె వెనక జరతారావచ్చారు.

రంగినాయిక వెంటనే పోక తాంబూలం అందుకుని నమ్రురాలై శంకరప్పకి సమర్పించింది.

ఈఅవకాశంలో పళ్ళెం తల్లిచేతికందించి, మరదలుపిల్ల, శాస్త్రికీ యాజులికీ తాంబూలాలిచ్చింది.

ఒక్కమాటు అయిమగురికళ్ళూ మిలమిల్లాడాయి.

వెంటనే పురుషులుముగ్గురూ బయలుదేరారు.

గుమ్మందాకా సాగనంపి, మళ్ళీ దణ్ణాలునివేదించి, సెలవుపొంది అక్కా చెల్లెలూ వెనక్కిమళ్ళారు. తలుపువేసేసి తల్లికూడా కూతుళ్ళ వెనకనే వెళ్ళిపోయింది.

## ౧౫

"పట్నంలో కెవరో అసాధ్యపు ఆటకాడు వచ్చారుట, మీ కేమయినా జాడ తెలిసిందండీ?"

"లేదు మహాప్రభూ!"

ఉదయం రెండోఝామిదిగడియల పొద్దెక్కాక, జరుగుదలైన రాజకార్యాలన్నీ ముగించుకుని, పెద్దాపురంకోటలో, మహారాజాధిరాజ పేమటిహనుమంత, నెలవ్రోలుగండాంక, శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతిమహారాజు లక్కమేడ వసారాలో పచారు చేస్తున్నాడు.

లేజవరాలైన ఒకపరిచారిక వెనకవెనకనే కూడాకూడా తిరుగుతూ మహారాజు చెయ్యిచాపినప్పుడల్లా హుక్కాగొట్టం అందిస్తోంది. మరొకలేజవరాలు, చేతులుకట్టుకునీ, మొగంవంచుకునీ మెట్లదగ్గర నుంచునివుంది.

జరూరుకాగితాలు చేతపట్టుకుని, ఒక స్తంభందగ్గరగా నుంచుని దివాన్జీ మాట్లాడుతున్నాడు.

"ఊరంతా కోడయికూస్తోందిట మీకు తెలవకపోవడం ఏమిటండీ?" అని ఆశ్చర్యం కనపరుస్తూ మళ్ళీఅడిగాడు మహారాజు.

"నేను సత్యమే మనవిచేసుకున్నాను మహాప్రభూ! చదరంగం అంటే నాకు తూర్పుపడమరా ఏమీతెలవదుకనక, దానికి సంబంధించిన కబుర్లు నాతో ఎవరూ చెప్పరేమోనండి"

"అంతా విడ్డూరంగా మాట్లాడతారండీ మీరు"

ఇలాఅంటూ మహారాజు కొంచెం అసంతృప్తి కనపరిచాడు.

"మనిపూసి మారేడుకాయ చేసెయ్యడంయెలాగా?" అని దివాన్జీ ఆలోచనలో పడ్డాడు.

సరిగా యీసమయంలో, దూర్వాసుల ఆదివరాహమూర్తి వచ్చి కథచేసి, సెలవుపొంది పైకివచ్చారు.

"పట్నంలో కెవరో గొప్ప ఆట కాడు వచ్చారుట మీరువిన్నారుటండీ?"

వచ్చీరావడంతోటే నిలవేసినట్టు మహారాజిలాఅడగ్గా, మూర్తి వొక్కక్షణం గుక్కతిప్పుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిపోయి అంతలో మళ్ళీ సద్దుకున్నాడు.

"వినడముకాదు, చూశాను మహాప్రభూ! చూడ్డమూ, కాదు, ఆతగాడితో రెండెత్తులుకూడా వేశాను మహాప్రభూ"

"మరి సెలవిప్పించారు కారేం?"

"విధిలేక యివ్వాళ మనవి చేసుకుంటున్నాను జగత్ప్రభూ! ఆ మనిషి యేలినవారి సన్నిధిలో ప్రస్తావన చెయ్యవలసినవాడు కాడండి"

"అదేమి?" అంటూ మహారాజు నిర్విణ్ణుడయ్యాడు.

వెంగం పక్కకి తిప్పుకుని "నాలుగుబాములు బాదండి" అన్నట్టు దివాన్జీ కన్నుగీటాడు. అది గుర్తించి మూర్తి పూర్తిగా పురెక్కాడు.

"అతగాడు కట్టుపొగరుమోతు, నొసలు వెక్కిరించడమే కాదు నోరే బ్రాహ్మణనోరు కాదండి"

"అంటేని?"

"నిజానికొకమాత్రపు ఆటకాడే. మెళుకువలు తెలిసినవాడే. కాని, మాటపొందిక లేదు. వినయవిధేయత లెరగడు. పెద్దాపిన్నా తారతమ్యం తెలీనేలేదు. ఒకమంచియెత్తు యోచింకంటే—లేకపోతే యెదటిబలం లొంగుబాటులోవుందంటే చప్పట్లు—కేకలు—యీలలు—ఇకిలింపులు—భరించడం కష్టం మహారాజాధిరాజా!"

"ఒకగోచిపాత కట్టుకుని, మరోగోచిపాత కప్పుకుని—అతగాడా

యేమిటండి?" అని అడిగాడు దివాన్జీ.

"చిత్రం చిత్రం, అత నేనండి. తమరుకూడా"

"అతగాడే అయితే, నేనూ చూశాను మహాప్రభూ! ఒకనాడు మాయింటికివచ్చి నానాఅల్లరీ చేశాడండి"

"శ్రీహరీ! తమలోగిటికిదగ్గిరే?" అంటూనిర్విణ్ణతనటించాడు మూర్తి

"జవాన్లు అవతలికి పంపెయ్యబోగా, వొకడి అంగీ చింపేసి, వొకడి డవాలీలాక్కుని — ఠాణేదారుకూడా చాలా అవస్థపడ్డాడండి అతనితోటి"

మహారాజు చాలా పరితపిస్తూ "అదేమిటి చెప్మా?" అన్నాడు

"పొగరుమోత్తనమే కాకుండా, కొంచెం మతిభ్రమకూడావున్నట్టు కనపడింది మహాప్రభూ"

"దివాన్జీగారు సరిగా కనిపెట్టారు. అదికూడా వుందనే నాకిప్పుడనుమానం కలుగుతోంది జగత్ప్రభూ!"

మూర్తి యిలాఅనడం దివాన్జీకి బాగావూతంయిచ్చింది. దాంతో అతను "సెలవయితే అరగడియలో అతగాణ్ణి యేలినవారి పాదాల దగ్గిర నిలబెట్టగలను; కాని —" అంటూ నసికాడతను.

"ఆటలో సారస్యమా? మాటలో పారుష్యమా? నడతలో వైరస్యమా?"

ఇలాఅని మహారాజు ఆలోచనలోపడ్డాడు. ఉత్సాహంఅంతా విరిగిపోయింది. హుక్కాగొట్టం అందుకున్నాడు కాని, నోట పెట్టుకోలేదు. మళ్ళీ పరిచారికకిచ్చేశాడు.

అదిచూసి మూర్తీ, దివాన్జీ పొంగిపోయారు.

"సెలవయితే—" అంటూ మళ్ళీనసికాడు దివాన్జీ. ఒక్కక్షణం ఆలోచించి "అక్కర్లేదు; మీరువెళ్ళండి" అన్నాడు మహారాజు.

బరువుగా అడుగులు వేసుకుంటూ దివాన్జీ వెళ్ళిపోయాడు.

మహారాజు యింగితం కనిపెట్టి "సూరపరాజుగారుకూడా దయ చేసి వున్నారు, వారితో ముచ్చటలాడుతూ కిందవుంటాను మహా ప్రభూ!" అని విన్నవించి మూర్తికూడా వెళ్ళిపోయాడు.

## ౧౬

మహారాజొక్క విభుడయి బొమ్మలాగ నిలిచిపోయాడు. తరువాత, హుక్కాగొట్టంకోసం, పరిచారిక వొక వేపున వుండగా మరొక వేపుకి చెయ్యి చాపాడు.

ఆదుర్దాపడుతూ పరిచారిక తిరిగివచ్చి గొట్టం అందించింది. రెండు గుక్కలు పీల్చేటప్పటికి రాజుకి కొంచెం హుషారు కలిగింది. ఏదో చెబుదామని మెట్లదగ్గిరవున్న పరిచారికకేసి చూశాడు. ఈలోపున పక్కగదిలోనుంచి రంగనాయిక వచ్చి "అంతా సిద్ధంగా వుంది మహాప్రభూ!" అని విన్నవించింది.

ఆమెని చూశాటప్పటికి మహారాజుకి మళ్ళీ జిజ్ఞాస రేకెత్తింది.

"రంగీ!" అని పిలిచాడు మహారాజు.

"చిత్తం మహాప్రభూ!" అంటూ పక్కకి వచ్చి నుంచుంది రంగనాయిక.

"పట్నంలో కెవరో గొప్ప ఆటకాడు వచ్చారుటా?"

"అవును మహాప్రభూ!"

"అవునంటే! నువ్వు చూశావా?"

"చిత్తం, చూశానండీ"

"వారి బసకి వెళ్ళావా"?

"నిన్న రాత్రి వారు మా యింటికే దయచేశారండీ"

"రాత్రా?" అని కొంచెం శ్లేషగా అడిగాడు మహారాజు. రంగ నాయిక అందుకు మొదట సిగ్గుపడి, తరవాత ధైర్యం తెచ్చుకుని "అవును మహాప్రభూ! రాత్రి అయితే వారుంటారని గ్రహించి—"

"అవునవును. అలాగే అయివుంటుంది. సరే దయచేశారు"

"ఎక్కడెక్కడ యే యేజంతు వున్నదో వొక్కమాటు విన్నవించగా—"

"విన్నవించడమా?"

"అవునండి. గోడ అవతల నుంచుని నాలు గెత్తుల్లో—"

"గోడ అవతల నుంచునా? లోపలికి రాలేదు?"

"లేదు మహాప్రభూ! అసలు, వారు మా యింటికి వచ్చినట్టే మాకు తెలవదండి. మామూలుగా దక్షిణపు తెరిపిలో కూచుని యెత్తు వేసుకుంటూన్నాము. వారు నట్టివాకట్లోనే వుండిపోయారండి"

"నాలుగెత్తుల్లోనా?"

"చిత్తం—నాలుగో యెత్తుతో ఆట కట్టిపోయిందండి"

"ఎవరిది?"

రంగనాయిక మొగం వంచుకుని "వారిది మహాప్రభూ!" అంది.

"అయితే, వారు నీపక్షం వహించారన్న మాట"

"చిత్తం. వారు వచ్చేటప్పటికి యెత్తు నాది. వారు చాలా అసాధ్యపు రాకడ వచ్చారండి. ఉత్సాహాతిరేకంవల్ల 'ఇవాళ మీ ఆట కట్టితీరతా—"

"సిగ్గెందుకూ? సమయం అలాంటిది. కనక చెప్పు"

"నామాట వాకట్లోకి వినపడివుంటుంది. దానిమీద వారు 'నీ కంత కష్ట మెందుకు చిరంజీవీ! ఏ గదిలో యే జంతు వుందో—"

"ఓహో! అలా కలిసిందా కథ?"

"చిత్తం. వారియెదటికి బల్ల పంపబోయాను; కాని అక్కర్లే దని—వద్దే అని—"

"నీయింటి కెందుకు దయచేశారని?"

"తరవాత తెలిసినసంగతి మనవి చేసుకుంటాను. వారు గొప్ప ఆట ఆడతా రనీ, నేనుకూడా—"

"అవునవును, తరవాతా?"

"నిన్న రాత్రి మా యింటికి బయలుదేరుతూ వుండగా, చామర్లకోట దొరలు, వారికోసం పాలకీ, జోడు మషాల్చీలూ, పరివారమూ పంపి ప్రార్థించారుట మహాప్రభూ!"

"వారి కీర్తి పొరుగూళ్ళకిన్నీ వెళుతోం దన్నమాట. అయితే, మన కోట కెందుకు రాలేదూ?"

"ఇది అంత సులభ మైనదా రాజాధిరాజా?"

మహారాజుకి, రంగనాయిక మాటలో ఏదో ధ్వని వున్నట్టు తోచింది. దానిమీద మూర్తిదివాన్జిగార్ల మాటలుజ్ఞాపకంవచ్చాయి.

"వారిదగ్గిర పొగరుబోత్తనం యేమయినా వుందా?"

"శ్రీహరీ! గంగిగోవు మహాప్రభూ!"

"మతిభ్రమ వున్నట్టు తోచిందా?"

"అపర బృహస్పతు లని చెప్పవచ్చు మహాప్రభూ!"

"కట్టుకున్న బట్టలు అసహ్యంగా వున్నాయా?"

"నీరుకావి అంగవస్త్రాలొకటి కట్టుకుని, వొకటి కప్పుకుని—వారి వేషం కటికి దారిద్ర్యానికి సూచకంగా వుందే; కాని అసహ్యంగా లేదు రాజేంద్రా!"

"ఎందుకూ?" అనుకుంటూనే "వికారరూపులా?" అన్నాడు మహారాజు.

రంగనాయిక మొదట కొంచెం సిగ్గుపడింది. అంతకంటే ఎక్కువగా సంకోచపడింది; కాని తరవాత నిదానంగా చూస్తూ "చాలా చక్కనివారు మహాప్రభూ! వారి మొగమ్మీద బ్రహ్మవర్చస్సు తాండవం చేస్తోంది. తగిన వేషం వుంటే మన్మథుణ్ణి మించి వుంటారు" అని చెప్పేసింది.

ఇదంతా మహారాజుకి కట్టుకథగా కనపడింది. దీనిమీద సాలోచనగా పక్కకి చూశాడు; రంగనాయిక పక్కన పొక బ్రాహ్మణయువకుడుగా రూపొంది ఎదుట నుంచున్నట్టు కనపడింది. "ఒక్కయెత్తుకి సెలవిప్పించండి" అని దోసిలి వొగ్గి కోరుతూ వున్నట్టు కూడా అనిపించింది.

దాంతో వుత్సాహం రేకెత్తింది. మనస్సు తేరుకుంది. అంతా అర్థం అయింది. కర్తవ్యం తేలిపోయింది. వెంటనే "సరే పద" అంటూ గదిలోంచి బయలుదేరాడు మహారాజు.

మాలోక్క ధారిణి అనుసరించింది.

సన్న చేసి రంగనాయిక గదిలోకి వెళ్ళిపోగా, మెట్లదగ్గర వున్న పరిచారిక కిందికి బయలు దేరింది.

## ౧౭

నాటి సాయంత్రం శ్రీ దాట్ల అప్పలనరసింహరాజు గారింట్లో ఆట ఏర్పాటయింది. ఎత్తు వెయ్యడానికి, భీమవరపుకోట నుంచి, శ్రీ పత్సవాయి విజయరామరాజు అంచెగుర్రాలమీద వచ్చి వున్నాడు.

అప్పల నరసింహరాజు ఎప్పుడూ చదరంగం కేసి చూడడు. దశావతారీ అంటే మాత్రం అతనికి నిద్రాహారాలక్కర్లేదు. అందులో అతను సిద్ధహస్తుడు. మహారాజుతో ఆదినారాయణం ఆడగల ముగ్గురిలోనూ అతను మొనగాడు.

సొంతానికి, అత నెప్పుడూ చదరంగం ఆడకపోయినా, చక్కని దంతపుబలం మాత్రం ఒకటి సంపాదించి వుంచాడు. కోటకి వెళ్ళినరోజున అతను ఒక వేపున దశావతారీలో కూచుని వుంటే, మరొకవేపున బంధువులో, మిత్రులో, ఆశ్రితులో చదరంగం సాగిస్తూ వుంటారు.

మహారాజు దగ్గర లాగే యేదో ఒక ఆటలో సమర్థు లైన వారికే గాని సామాన్యులకు అతని దగ్గర ప్రవేశం కలగదు.

విజయరామరాజు మహారాజుకి సన్నిహితుడు. అప్పల నరసింహ రాజుకి సయానా మేనల్లుడు. పైగా అన్నగారి అల్లుడు.

భోజనానంతరం అల్లుడు మామ లిద్దరూ నిద్రపోయి లేచా టప్పటికి, పిద్ద పెద్ద ఆటగాళ్ళు చాలామంది వచ్చి కని పెట్టుకుని వున్నారు. విశాల మైన సావడి అంతా కిటకిట లాడిపోతోంది. రాజుకి సలహాలు చెప్పడానికి మొనగాళ్ళందరూ ముందువరసలో కూచుని వున్నారు.

పన్నెండేళ్ళ వయస్సుగల అప్పల నరసింహరాజు కొడుకు, వచ్చినవారి నందర్నీ చందనతాంబూలాలతో సత్కరించి, నౌకరు తెచ్చి యివ్వగా దంతపుబలం చక్కగా సద్ది, యింకా వచ్చేవారిక స్వాగతం నివేదించడానికి ద్వారంలో నుంచున్నాడు.

నలుగురు మంగళ్ళు గోడల దగ్గరగా చెదిరి నుంచుని విసనకర్రలు వేస్తున్నారు.

సావడి అంతా పునుగువత్తుల ధూమంతో గుబాళిస్తోంది. చూసి వుండినవారు శంకరప్ప నేప్పు పుగ్గడిస్తూ వుండగా చూడనివారు ఆప్యాయనంగా ఆలకిస్తున్నారు.

ఇలాంటి సమయంలో అప్పలనరసింహరాజు వచ్చి అందరికీ

నమస్కారాలు చేశాడు. సభ్యులందరూ ప్రత్యుత్తుగా లేచి ఆనమస్కారాలందుకుని ఆశీర్వచనాలు కొందరూ, ప్రతినమస్కారాలు కొందరూ చేశారు.

ఇది అయ్యేటప్పటికి ముందొక రాచకొమారుడూ, తరవాత, విజయరామరాజూ వచ్చారు ఎరిగినవారందరూ కుశలప్రశ్నాదికం చెయ్యగా, ఎరగనివారు పరిచయభాగ్యం పొందారు.

చివరికి యెవరికి నిర్దిష్టమైనచోట వారు కూచున్నారు

అల్లుడి యింగితం కనిపెట్టి, అప్పలనరసింహరాజు, ద్వారంలో వున్న కొడుక్కేసి చూశాడు. ఆరాచబిడ్డ వెంటనే వసారాగదిలోకి వెళ్ళి శంకరప్పనీ, శాస్త్రి యాజులుగార్లనూ తీసుకువచ్చాడు.

నమస్కార నివేదనలతోటీ, స్వాగతవచనాలతోటీ సావడి అంతా ముఖరితమయిపోయింది. శంకరప్పని, రెండు చేతులూ పట్టుకుని కొందరూ, కౌగిలించుకుని కొందరూ ప్రీతివిస్రంభాలు వెల్లడించారు.

సావడి అంతా నిండుగానే వుంది; కాని బల్లకీ దక్షిణద్వారానికీ మధ్య యేడెనమండుగురు కూచోతగినంత స్థలం కాళీగా వుంది. అప్పలనరసింహరాజు శంకరప్పకి ఆస్థలం చూపిస్తూ "అందరూ దయ చెయ్యండి" అన్నాడు.

అందరూ కూచున్నారు.

"నాకింతచోటెందుకూ?" అని సంకోచిస్తూనే శంకరప్ప కూడా కూచున్నాడు.

మిత్రులతని వెనక కూచోబోయారు; కాని అప్పలనరసింహరాజు "తమరిద్దరూ యిలా దయచెయ్యండి" అని పిలిచి బల్లకి పశ్చిమంగా తనదగ్గిర కూచోపెట్టుకున్నాడు.

శంకరప్పకి అనుమానం హెచ్చింది.

"వారిని ఏకాకిని చెయ్యాలనా? మోసలకూ అందకుండా చేద్దామనా? అయితే, యిదివరకి మహా వుండిందా? ఇప్పుడు లేకపోతుందని బెంగా?" అని శాస్త్రీ యాజులూ కిందా మీదా పడ్డారు.

మొనగాళ్ళు "ఇక ప్రారంభించకూడదూ?" అన్నట్టు చూడగా, అప్పలనరసింహారాజు "అందరికీ చందనచర్చ అయిందా? బాబూ!" అని అడిగాడు.

దానికి, కొడుకు "అందరికీ అయింది. కాని శంకరప్పగారికీ, శాస్త్రిగారికీ, యాజులుగారికీ మాత్రం తరవాయి. వారినీ యిప్పుడే సేవించుకుంటాను" అని జవాబు చెబుతూ శాస్త్రి యాజులుగార్ల యెదటికి వెళ్ళి నుంచున్నాడు. గంధపుగిన్నె పట్టుకుని వొక నౌకర తన్ని వెంబడించాడు.

యిది యిలా జరుగుతూ వుండగా, దక్షిణ ద్వారంలోనుంచి ముందొక ప్రౌఢ వచ్చింది. తరవాత వొక మధ్య వచ్చింది. ఆమె వెనక వొక ముగ్ధ కూడా వచ్చింది. వస్తూనే, వొక్కొక్కరే, అందరికీ నమస్కరించి నుంచున్నారు.

ఒక నౌకరు ప్రౌఢ చేతికి బంగారపు గంధపుగిన్నె అందించాడు. ఇంకొక నౌకరు మధ్య చేతికి వెండితాంబూలపు పళ్ళెం అందించాడు. మరో నౌకరు ముగ్ధ చేతికి నెమలిరెక్కల పట్టివేళ్ళ విసనకర్ర అందించాడు.

శంకరప్ప అతి గంభీరంగా శిరఃపంకం చెయ్యగా శాస్త్రీ, యాజులూ మొగ మొగాలూ, చూదుకున్నారు.

తరవాత అప్పల నరసింహారాజు మందహాసం చేశాడు. విజయరామరాజు కన్ను గీటాడు.

వెంటనే శంకరప్పకి కుడివేపున కూచుని, ప్రౌఢ, గంధపు గిన్నెలో చెయ్యి పెట్టింది. ఎడమవేపున కూచుని ముగ్ధ తమలపు చిలకలు చుట్టసాగింది. వెనకవేపున ముందు ముంగాళ్ళమీద కూచుని శంకరప్ప కప్పుకున్న అంగవస్త్రం మెల్లిగా తీసి, తరవాత సరిగా కూచుని విసనకర్ర అందుకుంది ముగ్ధ.

శంకరప్ప ప్రౌఢకేసీ, ముగ్ధకేసీ అతిగంభీరంగా చూశాడు. అతని మొగమ్మీద చిరునవ్వు తళుక్కుమంది. తరవాత అప్పలనరసింహారాజు కేసి చూస్తూ "ఇవాళ శంకరప్పకి అగ్ని పరీక్ష అన్నమాట. ఉచితంగానే వుంది. రాజాస్థానాల్లోకి వచ్చి గారడీ చేస్తామంటే సాధ్యపడుతుందా మరి? కాని, ప్రభూ! గోచిపాతరాయుడికా అప్సరసల చందనచర్చ?" అని అడిగాడు.

"తమకి పరీక్షా? అందులోనూ అగ్నిపరీక్షా? ఎంతమాట సెలవిప్పించారూ? తమర్ని పరీక్షించడానికెవరికి తాహతుంది? ఇంతకీ; తాము సాక్షాత్తూ ఆశ్రితకుల అవతారం గదా?" అని చమత్కరించాడు అప్పలనరసింహరాజు.

"తథాస్తు" అంటూ అందుకుని "తమ అమోఘ శుభచింతనం నన్ను తప్పకుండా వృద్ధికి తెస్తుంది; కాని తాహతు లేదే? ఈ విలాసాల మాధుర్యం చవిచూడగల యోగ్యత కూడా లేదే? అనే విచారం తప్ప నాకు మరే బెంగా లేదు. సకలానికీ నాకు ఆ పినాకపాణే వున్నాడు" అని చెప్పి, మహామేరువు లాగ సుస్థిరుడై ప్రౌఢకి, దర్జాగా కుడిచెయ్యి అందించాడు శంకరప్ప.

"ఇందులో ఏదో కిటుకుందని తమరనుకోవద్దు. అయ్యవారులకు ముగ్గురికీ చదరంగంలో తగినంత నేర్పుంది. పది పదిహేను రోజులుగా తమరీపట్నంలో ప్రకటిస్తూ వుండిన చాతుర్యం విళ

ముగ్ధలై, తమర్నీ, తమ చాతుర్యాన్నీ ప్రత్యక్షంగా చూడదలిచి ప్రార్థించారు. ఇందులో దోష మేమీ లేదని మామయ్యగా రంగీకరించారు. ఇక తరవాయి సంగతి. ఈ ముగ్గురూ కళావతులు, సకలవిధాలా యీవూరి వేశ్యలలో యెన్నిక అయినవారు. తమర్ని సేవించుకోడాని కింత కంటే మంచిమార్గం కనపడలేదు. నేనే యిది పురమాయించాను. ఇది భక్తిప్రపత్తుల ఫలితమే కాని మరొకటి కాదు. కనక తమరు మరోక విధంగా భావించవద్దు'' అని విజయరామరాజు కూడా చాలాచాలా చెప్పాడు; కాని, శంకరప్ప నమ్మలేదు.

శాస్త్రి యీాజులూ ''ఇది శంకరప్పగారి యేకాగ్రత భంగపరచడానికే'' అని దృఢంగా నమ్మారు.

ఈనమ్మకమే శంకరప్ప చూపుల్లో వారికి కనపడింది. ఆ చూపుల్లో ''మీారు బెంగపెట్టుకో నక్కర్లేదు'' అని ధీమాకూడా కనపడి వారు స్థిమితపడ్డారు.

ప్రౌఢ గంధం తీసింది.

అసలే వెన్నకంటే మృదువయిన చందనం. అంతకంటే మృదువయిన వేశ్య చేతిలో అది సంస్కారం పొందింది. అందులో మల్లె అత్తరుకూడా కలిసింది. దీనికి సాయం ఆప్రౌఢ, ముందు తాను కరిగిపోయి అతన్ని కరిగించివేయ్యా లన్న ప్రీతితో అలదింది.

కాని, అంతా వ్యర్థం.

శంకరప్పలో వికారం యేమీా కనపడలేదు. అతనికి గంధం పూస్తూ వున్నంతసేపూ ఆమె ''లక్కబొమ్మకి పూస్తూన్నానా?'' అని సిగ్గు పడుతూనే వుంది.

అనతల మధ్యకూడా వొక్కొక్క చిలకే అందిస్తూ రాగా, ముగ్ధ పైక పక్కకి వచ్చి విసరసాగింది.

*

## ౧౫

"ఇక ప్రారంభిద్దామా?" అంటూనే విజయరామరాజు మూడెత్తులు వేశాడు.

"చిత్తం" అని శంకరప్ప ఒకమాటు మిత్రులకేసీ, ఒకమాటు పైకీ చూసి, తన బలంలో మంత్రీ వొక శకటూ తీసి బరిణలో పడేసి, తానున్నూ మూడెత్తులు వేశాడు.

అదిచూసి అందరూ చకితులయిపోయారు.

"అదేమీ?" అనాలనుకునిన్నీ అప్పలనరసింహరాజు నీరవుడయిపోయాడు.

"మొదటి యెత్తులోనే మనలోకువ కనిపెట్టేశారా యేమిటీ శంకరప్పగారు?" అని విజయరామరాజు ఆశ్చైర్యపడ్డాడు.

"ఏమిటీ యీసాహసం?" అన్నట్టు నలహాదార్లు మిడుతూ మిడుతూ చూసుకున్నారు.

శాస్త్రీ రాజులూకూడా మొగమొగాలు చూసుకోకపోలేదు; కాని, వారికేమాత్రమూ అపజయశంక కలగలేదు. "ఒక గుర్రమూ వొక యేనుగూ తీసేసుకున్నా వారిని గెలవగల మొగాడెవడోయ్!" అన్నట్టున్నాయి వారిచూపులు.

శంకరప్ప మనస్సు కలిచేసి ఆట పాడుచెయ్యాలని వచ్చిన—రప్పించబడ్డవేశ్యలు తామే విభ్రాంతిపొంది బొమ్మలయిపోయారు.

కొంతసేపటికందరూ ప్రకృతిలో పడ్డారు.

మొదట మనోవేగంతో సాగి, తరవాత వాయువేగంలోకి మారి, పిమ్మట ప్రవాహావేగంలోకి దిగి, కొంతసేపటికి తాబేటి నడకలో పడి, మొత్తం ఒక్కగడియ గడచేటప్పటికి చెరువు నీటిలాగ స్తంభించిపోయింది ఆట.

అది రాజు వంతు.

ఆలోచన తోచదు. దారికనపడదు. చెయ్యిఆడదు. ఎత్తుపడదు.

ఇలాంటిస్థితి సంభవించేటప్పటికి శంకరప్పకే వంతువచ్చేటట్టు చెయ్యాలని రాజెంతో వుబలాటపడ్డాడు. చాలా శ్రద్ధవహించాడు. ఎంతో ప్రయత్నించాడు. రణపెంకి రాకడలు వచ్చాడు, ఒకయెత్తు బుకాయించడానికీ సిద్ధపడ్డాడు; కాని యింతచేసినా చివరికి తానే ఆస్థితిలో పడిపోయాడు.

మొదట కలిగిన అధైర్యానికీ ఆశాభంగంతోడయి అతన్ని దిగ తీసేసింది.

మొదట, రాజూ సలహాదార్లూ కొంతసేపు అదేపనిగా బలంకేసి చూశారు. తరవాత వుండివుండి చూశారు. చివరికి బల్లవిడిచిపెట్టేసి పైకీ—కిందకీ—ఆపక్కకీ—యీపక్కకీ, అయిమూలలకీ చూడసాగారు.

పెదవులు కొరుక్కోడం, నిట్టూర్పులు విడవడం, కళ్ళు మూసుకోడం, ఒకమాటు కుడిచేతిమీదికీ, వొకమాటు యెడమ చేతిమీదికీ వాలడం, మరోమాటు యెడమచెయ్యి వెనక్కి ఆనుకుని కుడిచెయ్యి కుడి మోకాలిమీదికి చాపుకోడం, కొంతసేపటికి నడ్డిలాగి, చేరబడవాము వెనక్కివాలి, యెవరిదో చెయ్యో కాలో తలో తగలగా ఉలిక్కిపడి సరిగా కూచోడం, మధ్యమధ్య మించిపోయినట్టు గభీమని ముందుకివంగి బలం పరకాయించడం, కాని దారీతెన్నూ కనపడక, తోచక మళ్ళీ మొదటికిరావడం — ఈస్థితికిన్నీవచ్చేశారు.

శంకరప్పకీమాత్రం నిశ్చింత.

కాస్తనిదానమైనవాడితో యెప్పుడాడినా తనకి వంతురాక అతనిలాగ కూచుంటూ వుండడమే పరిపాటి. తనయింటో అయితే,

ఆట అలాగేవుంచి యెదటివాళ్లు పిలిచేదాకా యింటిపనులు చేసు కుంటూ వుంటాడు. ఏశాకుంతలమో, యేకాదంబరో, యేవుద్యోగ పర్వమో చూస్తూఅయినా వుంటాడు.

మరి యిక్కడ?

తన మిత్రులూ, దూరంగా వుండిపోయారు. దగ్గరగానే యెదటి వరసలో కూచున్న వున్నవారా, యీ ప్రపంచంలో లేరు. మరేమిటి చెయ్యడం?

అతని కీ జిజ్ఞాస కలిగి, యాదాలాభంగా అటూ యిటూ చూశా టప్పటికి, మనస్సు గుబగుబ లాడిపోయేటట్టు పదునైన చూపులు విసిరింది ప్రౌఢ; కాని ఆ చూపులు కళ్ళల్లోనే లీనం చేసుకుని గంధపు గిన్నెకేసి చూశాడు శంకరప్ప.

ప్రౌఢ కనక గ్రహించేసి, బెల్లింపు చూపులు పరుపుతూ మళ్ళీ చందనచర్చకి పూనుకుందామె.

ఆమెకి కుడిచెయ్యి అందిస్తూ మిత్రులకేసి చూసి శంకరప్ప మందహాసం చేశాడు.

ఆచూపులో "గిన్నెలోనా, కావలసినంత గంధం వుంది. అలద డానికో, అప్సరస వుంది. తీరుబడా, కావలసినంత. ఏం? తప్పా?" అన్నభావం మెరిసి ఆ మిత్రులను ముగ్ధలను చేసేసింది.

తరవాత శంకరప్ప అటూ తిరిగి పళ్ళెంకేసి చూశాడు. సత్యవరపు కవటాకులు పళ్లెం నిండా వున్నాయి. మధ్య కళ్ళల్లోకి చురుక్కున చూశాడు. ఆచూపులకు భరించలేక మొగం వాలిపోయింది; కాని, ఆమె చేతులకు మాత్రం చురుకు వచ్చింది.

ఇదంతా చూసి, తన గుండెలికి అపాయం రాకుండా ముందే జాగ్రత్తపడింది ముగ్ధ.

అప్పుడు నరసింహరాజు "దశావతారీ వేస్తావా యీపక్కని?" అని అడిగాడు, దానికి శంకరప్ప "ఇది తేలి వొడ్డెక్కితే అంతే చాలు మహాప్రభూ!" అని మందహాసం చేశాడు.

ఈచందనచర్చా, యీమాటా విజయరామరాజుని తట్టిలేపాయి. సలహాదార్లకు కళాఘాతా లయినాయి.

వెంటనే ఎక్కడ లేని తొందరా పుట్టి అందరూ బల్లమీదికి వంగారు.

రాజు కొక ఎత్తు కనపడింది. అది పాతదే గాని, యీ ఆడావుడిలో అదే తారకం లాగ తోచింది. చివరి కేమయినా అది శంకరప్పని ఒక స్త్రాపు పూపకపో దని సలహాదార్లు భావించారు.

వెంటనే రాజు ఆ యెత్తు వేసి తేరిచూశాడు. సలహాదార్లు కూడా "దీని కేం చెబుతా?" వన్నట్టు విర్రుగా చూశారు

శంకరప్పకి నవ్వు వచ్చింది; కాని దాన్ని అధరంలోనే విశ్రమింపచేసుకొని మొదట ప్రౌఢకేసి, తరవాత మధ్యకేసీ, చివరికి మిత్రులకేసీ, చూసి అతను మూడోవరస ఆరోగదిలో వున్న బంటుని మెల్లిగా ముందుకి నెట్టి, ఏమీ ఎరగనట్టు మధ్యకేసి చెయ్యి చాపాడు.

అందరికీ గుండెలు తు—వ్వు మన్నాయి.

చూడగా తెరిచి రాజు.

కంగారుపడి, ఎవరి సలహా పుచ్చుకోకుండానే రాజా తన రాజుని పైకి గది పక్కకి వేశాడు.

వెంటనే శంకరప్ప గుర్రాన్ని ముందుకివేసి, మిత్రులకు చిరునవ్వు అందిస్తూ చేతులు దులుపు కున్నాడు.

అది చూసి, శాస్త్రి యాజులూ ఔడు కరిచి శిరఃకంపం చేశారు.



5—10

ప్రౌఢ కేసి చూస్తూ మధ్య కన్ను గీటింది.

అప్పలనరసింహరాజు కేసి చూస్తూ ప్రౌఢ పెదవి విరిచింది.

లక్షణంగా కూచుని వున్న ముగ్ధ నిలువునా లేచి నుంచుంది

శంకరప్పకేసి చూస్తూ విజయరామరాజు రెండు చేతులూ జోడించుకున్నాడు.

శారు మంటే గాని తృప్తి పడని సలహాదా రొకడు "వేసి రాజా ఆట కట్టాను" అంటూ బిక్క మొగం వేసి చేతులు తేల వేసుకున్నాడు.

## ౧౯

ఆ మాటా యీ మాటా చెప్పుకుంటూ అందరూ నట్టి వాకిట్లోకి వచ్చారు.

అప్పటికి నాలుగ్ఘళ్ళ పొద్దు మాత్రమే వుండడంవల్లా, యెండ తగ్గి పొద్దుకూడా భవంతి చాటుకి వెళ్ళిపోయి వుండడంవల్లా వాకి లంతా విలక్షణ కాంతితో ముచ్చటగా వుంది

ఏమి టేమిటో ప్రస్తావనలు రావడంలో హఠాత్తుగా స్ఫురించగా, అప్పలనరసింహరాజు "తమ రొక్కమాటు మహారాజులుంగారితో ఆడాలండి" అని మహోత్సాహంతో శంకరప్పని ప్రోత్సహించాడు.

"హర హరా! నేనెక్కడ మహారాజులుంగారెక్కడ మహా ప్రభూ. వారిపట్నంలోకి రావడమే నేను మహాపరాధంగా భావించుకోవలసి వుండగా—"

"అలా కాదండి! మహారాజులుంగారితో ఆడతగ్గవారు తమ రొక్కరే. అలాగే తమతో ఆడతగ్గవారున్నా మహారాజులుంగా రొక్కరే. ఏమంటావోయ్?"

అప్పలనరసింహరాజిలా అడగ్గా "తప్పకుండానూ" అని విజయ రామరాజనుకున్నాడు.

"తగినవృద్ధిదొరక్క చదరంగం ఆటకోసం మహారాజులుంగారు మొగంవాచిపోయి వున్నారు. రోజూ సన్నిహితులతో యెత్తులు వేస్తూనే వున్నారుగాని, వారికి తృప్తిలేదు. మొత్తానికి వారిదివరలో కొన్ని వందలమందితో ఆడివున్నారు; అయినా యింతవరకెవ్వరి నడకా, యింత అసాధ్యపు రాకడలూ మానిఅయినా వుండరు. కనక నాయనయ్యగారు సెలవిప్పించినట్టు తమరు మహారాజులుం గారితో తప్పకుండా ఆడాలి."

"నాయెడల తమకి మాలాత్తుగాకలిగిన ఆదరం అలాఅనిపిస్తోంది. వెర్రివాడచేతి రాయిలాగ యివాళ నాయెత్తులు పొంకంగావున్నా యేమోగాని, అన్నప్పుడూ, యిలాఆడడం నాతరమా? అదీకాక; ఆటలోకూమని వోడిపోతే వచ్చినవాడితలకొట్టించి—"

"క్షమించి మేలెంచాలి. గత్యాగత్యా మహారాజే వోడిపోతే?" తలుపుంకిస్తూ అప్పలనరసింహరాజిలా అడగ్గా "అదీ మాట" అంటూ విజయరామరాజు మళ్ళీ అందుకున్నాడు.

"కనక మహారాజులుంగారి శపథం అసమగ్రం. నిజానికి, ఆయిన వాడూ కానివాడూ వచ్చి ఆట రసాభాసు చేసి వెళ్ళిపోకుండా వుండడానికి అది వుద్దేశించబడి వుంటుంది; కాని, తమవంటి నిపుణులను బాధించడానికి కాదు. ఎలాంటివాడూ కూడా అసహాయ శూరుడైన శత్రువు వోడిపోయినా మెచ్చుకుంటాడు గదా! యిక మహారాజులుంగారి ఔచిత్యమా మనం సందేహించవలసింది? పోనీ, తమరే వోడిపోతారనుకుందాం, అయితే, తమ వింతపోకడలు గమనించవద్దూ? వాటికి విలువ యివ్వవద్దూ?"

దీనిమీద వొక సలహాదారు గభీమని ముందుకి వచ్చి "తమరు సెల విప్పించింది బాగుంది. ఆటలో మూడున్నాక జయం యెవరికో ప్రకరికే; కాని శంకరప్పగారి యెత్తుల వంటియెత్తులు మన మెప్పుడయినా చూశామా? విన్నామా? వారికి కంగారు ఏకోశంలో అయినా వుందా? నానవేత అయినా వుందా? ఈచాతుర్యం మహారాజులుంగారిని నిర్విణ్ణులను చేసెయ్యదూ? కనక, ప్రభూ! ఈవిషయమై తమ రుభయులూ తప్పకుండా పూనకోవాలి. మహారాజులుంగారితో ఆడకుండా మనం శంకరప్పగారిని కదల నివ్వకూడదు" అంటూ మూతి బిడాయించుకున్నాడు.

"కదల నివ్వడమా? అదేమిటి తమరలా సెల విప్పిస్తారేమిటి జగన్నాథశాస్త్రులువారూ? శంకరప్పగారు మహారాజులుంగారితో ఆడనివ్వండి ఆడకపోనివ్వండి. ఆడి గెలవనివ్వండి వోడిపోనివ్వండి. ఏమయినా పెద్దాపురం దాటి ప్రక్క అడుగయినాకదలనివ్వనునేను"

"ఇంత ఆదరం కనపరుస్తూ వున్న తమర్ని కాదని వెళ్ళి, అవతల నేను బాముకునే దేమీలేదు; కాని వున్నదల్లా యేమిటంటే? మహారాజులుంగారిని తెలుచుకుంటేనే—"

శంకరప్ప జలదరింపు నటించాడు.

"అలా కాదు. తమరు మామనవి చిత్తగించక తప్పదు. మొదట ప్రెక్క ఆటకే యేర్పాటు చేసుకుందాం. మామయ్యగారు సర్వమూ అనుకూలంగా యేర్పాటు చేయిస్తారు"

"తమకి భయంవద్దు శంకరప్పగారూ! తమ ప్రాణాలకు నా ప్రాణా లడ్డు!

ఇలాఅంటూ అప్పలనరసింహరాజు శంకరప్ప రెండుచేతులూ పట్టుకున్నారు.

ఇక్కడ యిలా జరుగుతూవుండగా, అక్కడ, ద్వారంలో తానేషా రు ప్రత్యక్షమయినాడు.

మెల్లిగా లోపలికివచ్చి ముందు అతను అప్పలనరసింహరాజుని పలకరించాడు. "ఎప్పుడు దయచేశారు?" అని తరవాత విజయ రామరాజును పలకరించాడు. తక్కినవారిలో కొందరిని సాదరంగా పలకరించి, కొందరు సవినయంగా కుశలప్రశ్నచెయ్యగా వెన్ను విరుచుకుంటూ జవాబుచెప్పాడు. చివరికి శంకరప్పకేసితిరిగి చేతులు సరిగా జోడించకుండానే "నమస్కారం" అన్నాడు.

శంకరప్పకి మొదట వళ్ళుమండిపోయింది; కాని, అక్కడి మహాజనుల సాన్నిధ్యం వెంటనే దాన్ని చల్లార్చివేసింది. అయినా అతని మొగం కరకర లాడుతూనే వుంది. కళ్ళు నిప్పులుకక్కుతూనే వున్నాయి.

కాని, రాజులిద్దరూ తనకేసి చూస్తూవుండడం గమనించి, బాగుండదనీ, పైగా మోటతనం అనిపించుకుంటుందనీ భావించి, అతివెంకితనంగాతలమాత్రంవూపిఆనమస్కారంఅందుకున్నాడతను.

రాజులాశ్చర్యచకితులయినారు. వినయమూర్తి అయిన శంకరప్ప దగ్గిర యింతవెంకితనం వుంటుందని వారెప్పుడూ అనుకోలేదు. "ఇది పగా, వైరస్యమా" అని ఆలోచన ప్రారంభించారు; కాని, వారెరిగివున్నంతవరకీ రెండింటికీ కారణాలులేవు.

అందుకి తానేదారగ్గయిపోయాడు; కాని యేమిచెయ్యగలడు నివ్వున్నకర్రఅతను. లోపల్లోపల రగిలి బుగ్గయిపోవడంతప్ప వేరే గతిలేదు; కాని, అంతరు పెద్దమనుష్యులయెదట శంకరప్ప అలాగ ప్రవర్తించడం తనకే లాభంఅనుకున్నాడు. దీన్ని మనస్సులో పెట్టుకుని యెంతపనయినా చెయ్యవచ్చు ననుకున్నాడు.

ఈవుద్దేశంతో శాంతించి, యేమీయెరగనట్టు నటిస్తూ "రాత్రి భోజనంచేశాక వొకమాటు దర్శనానికిరమ్మని దివాన్జీగారి సెల వయింది" అని చెప్పాడు.

ఆతనిధోరణికిన్నీ రాజులాశ్చర్యచకితులయినారు. వారి కనుబొమ్మలు ముడిపడ్డాయి.

అది గ్రహించి, ధైర్యంతెచ్చుకుని "నాకవసరంలేదు. నేను—రా—రాను" అని దురుసుగా జవాబుచెప్పాడు శంకరప్ప.

అప్పుడున్నూ శాంతివహించి శాణేదారు "సరే" అని నిర్లక్ష్యంగా జవాబుచెప్పి, రాజులదగ్గిర సెలవుపుచ్చుకుని వెళ్ళిపోయాడు.

అందరూ వొక్కమాటే అన్నారు. అయితే "యేదో గొడవ వున్నట్టుందే" అన్న అప్పలనరసింహామాట శంకరప్పని ఆకర్షించింది.

"చిత్రం చిత్రం వుంది. పెద్దగొడవేవుంది"

"రహస్యమా?"

"ప్రస్తుతం రహస్యమే. ఇప్పుడింతకంటే నన్నేమీ అడగవద్దని ప్రార్థిస్తున్నాను కొద్దిరోజులు వోపిక పట్టించండి. జరిగిందంతా సావకాశంగానూ, పూర్తిగానూ మనవి చేసుకుంటాను. ఏమీ తరవాయి అట్టేపెట్టను. తమతో మనవి చేసుకోకుండా యిక్కణ్ణుంచి కదలనే కదలను"

తరవాత మరొక అరగడియ విషయాంతర ప్రస్తావన జరిగింది. అందరి అభిలాష గమనించి "మళ్ళీ రేపుదయం వొకమాటు దయ చెయ్యాలి" అని కోరుతూ శంకరప్పని లాలకీ మీద బసకి పంపేసి, అందరికీ సెలవున్నూ యిచ్చి, రాజు లిద్దరూ గుర్రా లెక్కి కోటకి వెళ్ళిపోయారు.

శంకరప్ప లాలకీ యెక్క బోయేటప్పుడు వేశ్యలు ముగ్గురూ

ముందు పాదాభివందనం చేసి, తరవాత నల్లకలవదండలతో ముంచెత్తేశారు.

## ౨౦

నాలుగ్ఘుళ్ళ పొద్దెక్కింది.

శాస్త్రీ యాజులూ వాకట్లో కూచుని వున్నారు. అప్పటిదాకా లోపల పెద్దమ్మతో మంతనం చేసి చేసి "కభురు వస్తుందా మనమే వెళ్ళడమా?" అని అడుగుతూ వచ్చి, శంకరప్ప, వారి కిద్దరికీ మధ్యగా కూచున్నాడు.

"కభురు కోసం చూడవద్దు, మీరే వెళ్ళండి నాయనా! గొప్ప వారితో పని. ఏం శాస్త్రుల్లు బాబూ! మన మర్యాద మనం తక్కించుకోవడం మంచిది కాదూ?" అంటూ అతని వెనకనే వచ్చి ఒకటి బల్లమీద కూచుంది పెద్దమ్మ.

"మీరు చెప్పింది బాగానే వుంది. అయితే, నిన్న సాయంత్రం లాంకీమీద బండి పంపించినవాళ్ళు, ఇవాళ నౌకర్ని పంపయినా వర్తమానించకుండా వుంటారా? ఇంకొక్క గడియ చూస్తే యేమి మించిపోతుంది?" అన్నాడు శాస్త్రి.

యాజులు దీన్ని గట్టిగా బలపరిచాడు.

"పోనీ, అలాగే చెయ్యండి" అంది పెద్దమ్మ.

ఈ సమయంలో "పెద్దమ్మగారూ" అంటూ పిలుపు వచ్చింది.

"కభురు వచ్చింది" అన్నట్టు శాస్త్రి కన్ను గీటగా, "ఎవరు వారని?" అని అడుగుతూ పెద్దమ్మ గుమ్మంలోకి వెళ్ళింది.

"నేను దాట్లవారి మనిషి నమ్మా!"

"ఏమిటి పని?"

"పెద్దబాబయ్యా, భీమవరపుకోట నాన్నగారూ, సేనాధిపతి గారూ వచ్చారమ్మా"

ఇది విని పెద్దమ్మ, యేక కాలంలోనే చకితురాలూ, నిర్విణ్ణురాలూ అయిపోయింది. యువకులు ముగ్గురూ నట్టివాకట్లోకి వొక్క దూకు దూకారు.

అప్పటికి కప్పుడే విజయరామరాజూ, అప్పలనరసింహరాజూ, దంతులూరి జగ్గరాజూ గుర్రాలు దిగి, కొంజా దాటి లోపలికి వచ్చారు.

వెంటనే ముందు విజయరామరాజూ శంకరప్పా కౌగిలించుకుని ప్రీతి నెరపుకున్నారు. తరవాత శంకరప్ప అంజలిబంధం పట్టుకుని, అప్పలనరసింహరాజు, తన ఆదర గౌరవాలు ప్రకటించాడు. జగ్గరాజూ శంకరప్పా వొక్కమాటే చేతులు మోడ్చుకున్నారు ఒక్కమాటే వొకరి చేతు లొకరు పట్టుకుని మర్యాద చేసుకున్నారు.

శాస్త్రి యాజులుగార్లూ శ్రోత్రియులూ కూడా కుశలప్రశ్నాదికం చేసుకున్నారు.

తరవాత అప్పలనరసింహరాజు "నిన్న సాయంత్రం, యీపూట కూడా ఆట మాయింట్లోనే అనుకున్నాం; కాని, మన మిప్పుడు కోటకి వెళ్ళాలి" అన్నాడు.

దానిమీద జగ్గరాజు అందుకుని "మహారాజులుంగారు తమతో చదరంగం ఆడాలని అభిలషిస్తున్నారు. అందుకోసం తమ దర్శనం కోరుతున్నారు తమ రాక నిరీక్షిస్తూ, తమ కోసం పాలకీ, పరివారమూ పంపారు: కనక తమరు దయచెయ్యవలసిం దని నా ప్రార్థన" అని విన్నవించాడు.

"ఏమి సెల విప్పించారు ప్రభూ?" అంటూ శంకరప్ప మొదట

ఆశ్చర్యం కనపరిచాడు. "ఎంత మాటా? దీనికోసం ప్రభువులే దయచేయించాలా? నౌకరుచేత కభురు చేయిస్తే, మహారాజులుంగారి పాదాల దగ్గిర వాలకపోదునా?" అని తరవాత వినయం చూపించాడు. చివరికి అప్పలనరసింహరాజు కేసి తిరిగి, "సకలమూ నిన్న తమతో మనవి చేసుకునే వున్నాను; కాని, తమరు నావిషయమై కొంచెమున్నూ యోచించలేదు. నేను యదార్థం విన్నవించుకుంటున్నాను. మహారాజులుంగారితో ఆట అంటే నా కిప్పటికీ గుండెలు తాళడంలేదు" అని బెదురు నటించాడు.

"తమ కేమీ భయం వద్దు శంకరప్పగారూ! చివరికి గెలుపు యెవరి దయినా తమ యుక్తులకే సంతోషించి, ప్రభువు తమర్ని ఆదరిస్తా రని నా సంపూర్ణవిశ్వాసం"

"మాకెంత ధైర్యం లేకపోతే మేము మహారాజులుంగారితో విన్నవించుకో గలుగుతామూ? తమ రిది యోచించారా?" అని అడిగాడు విజయరామరాజు.

శంకరప్ప యిలా నిరుత్సాహపడడం చూసి, శాస్త్రి యాజులూ "ఈయన కీ కంగా రెప్పట్నుంచోయ్?" అన్నట్టు చూచుకున్నారు.

అప్పుడు జగ్గరాజు ముందుకు వచ్చి, "మరి దయచెయ్యండి" అని చెయ్యి పట్టుకున్నాడు.

"ఇక తప్ప దన్నమాట. అయితే ప్రభూ! నన్ను చిత్తగించారా? నా వేషమూ నావాలకమూ పరకాయించారా? ఈ వేషంతో రాజదర్శనం చెయ్యడం అంటే నాకు కలిగే సిగ్గుమాట అలా వుండగా, మహారాజులుంగారిని అగౌరవ పరిచినట్టు కాదూ?"

"తమ కా సందేహం అక్కర్లేదు. తమ రిలాగే రావచ్చు"

"నిండుకుండ, మహారాజులుంగారు తొలకక పోవచ్చు. తమరు

సద్ది చెప్పగలగనూ వచ్చు; కాని, కొండంతలేని ఛాణేదార్లుంటారు. ప్రభువు తరవాత అంతవారు డివాన్జీ లుంటారు. చికిలీ చేసిన కత్తులను మించి వారి జవాన్లుంటారు. దరిద్రు ణ్ణీ, పిచ్చివా ణ్ణీ, శనిగ్రహా న్నసీ ద్వారంలో అడుగు పెట్టాటప్పటికే వారు నామీద పడకుండా వుంటారా? నన్ను వీధిలోకి పడ గెంటకుండా వుంటారా? నాయజ్ఞోపవీతాలు తెంపి, పోగులు పెట్టకుండా వుంటారా?''

ఈమాటలనేటప్పుడు శంకరప్పలో కొంచెం ఆవేశం కనపడింది.

ఇది విని అప్పలనరసింహరాజూ, విజయరామరాజూ తెల్లపోయారు. ''ఇంత అమానుషం జరిగిందా?'' అనుకుని శాస్త్రి యాజులూ స్తబ్ధులయిపోయారు.

''ఆ ముండాకొడుకులికి గడ్డి పెట్టించండి మహారాజా'' అని పెదవులు కదుపుతూ తలుపు చాటునుంచి తొంగిచూసింది పెద్దమ్మ.

ఒక్కక్షణం అందరూ నిశ్చలంగా వుండిపోయారు.

తరవాత జగ్గరాజు చేతులు అప్రయత్నంగా దోయిలించుకున్నాయి. ''క్షమించకోరుతున్నాము'' అని అతను నమ్రుడైనాడు.

తలుపోరగా వుండి అంతా చూస్తూవుండిన పెద్దమ్మ ''ఇక చాలు. ఈపాటికి చెప్పాలో'' అన్నట్టు గుమ్మాని కెదురుగా వచ్చి నుంచోగా, శంకరప్ప వెళ్ళి అమాంతంగా ఆమె పాదాలమీద వాలాడు.

ఆటు కొడుకులాగ చూసుకుంటూ వున్న శంకరప్పకిలాంటి గౌరవం జరగడం—అలాంటి శంకరప్ప అంతంతలేని పెద్దమనుష్యులు చూస్తూవుండగా తనకి పాదాభివందనం చెయ్యడం—పెద్దమ్మకి ఆనందంతో వుక్కిరిబిక్కిరి అయింది.

''పెద్దమ్మా, ఇదంతా నీ అనుగ్రహం. గాలికి కొట్టుకు వచ్చిన

పరదేశిని కొడుకుని చూసుకున్నట్టు చూశావు. నాకీగౌరవం కలగడానికి కారణం నువ్వు. ఏమి చేసినా నేను నీ ఋణం తీర్చుకోలేను"

"అదంతా యిప్పుడు కాదు నాయనా! తొరగా వెళ్ళు తండ్రీ! ఆలస్యం చెయ్యడం మర్యాద కాదు బాబూ!"

"భోజనాల వేళకి వస్తానా, యిక ఘరవాలే దనుకో! లేదూ, నాతల కోటకొమ్మలికి వేలాడుతూ వుంటుంది, వొక్కమాటు చూడేం"

ఇలా అని శంకరప్ప, మళ్ళీ పెద్దమ్మ పాదాలు స్పృశించి కళ్ళ కద్దుకున్నాడు. "వెఱ్ఱితండ్రీ, నీకా ప్రాటమి? అధైర్యపడకు. గుండె నిబ్బరంచేసుకో" అని చెబుతూ ఆమె అతని శిరసు మూర్కొని సెల విచ్చింది.

ఇద్దరి కళ్ళూ ఆనందబాష్పాలతో దొప్పదోగి పోయాయి. పెద్దమ్మ తన పమిటి కొంగుతో ముందు శంకరప్ప కళ్ళు తుడిచి, తరవాత తనకళ్ళు తుడుచుకుంది.

శాస్త్రీకీ, యాజులుకీ, శంకరప్ప పెద్దమ్మకేమీ కాడని స్పష్టం అయింది; కాని, వారి ఆత్మీయానుబంధం గుర్తించి వారు చకితు లయినారు. పెద్దమ్మ ఔదార్యానికి కూడా వారు ఆశ్చర్యపడ్డారు.

విజయరామరాజు చెయ్యి పట్టుకు తీసుకువెళ్ళగా "జయ మహాదేవా" అనుకుంటూ శంకరప్ప వెండిఅడ్డల పాలకీలో కూచున్నాడు.

నిశానీవాడు వెంటనే "ధన్యు" మని ఢంకా బజాయించాడు.

దండెలమీద చేతులు వేసుకుని సిద్ధంగావున్న బోయీలు వెంటనే పాలకీ యెత్తగా రాజులు ముగ్గురూ గుర్రా లెక్కారు.

"నేను పాలకీలో కూచోడం, మీరు రెండు పక్కలా నడిచి రావడం——" ఇలా అని చేతులు పిసుక్కుంటూ శంకరప్ప చాలా

యిదయిపోగా, "మీరేమీ కించ పడవద్దు. మీరు మాకు గురువులు. మీ తరవాతే మాకు మహారాజులుంగారు. మాకు చోపుదారులం కావడమే మాకు గొప్ప గౌరవం" అని నచ్చచెప్పి, శాస్త్రి, యోజులూ అతని విచారం పోగొట్టారు.

ప్రస్థానం మళుపు తిరిగేదాకా చూసి "పెద్దాపురం రాజ్యం పుట్టాక నా నాయంకి తప్ప యిలాంటి గౌరవం మరెవరికి జరిగింది?" అనుకుంటూ పరవశురాలయి పెద్దమ్మ కొంజా అరుగుమీద చతికిల పడగా, రామసోదెమ్మ బొమ్మ అయి అలాగే నిలిచిపోయింది.

## ౨౧

పాలకీ కోటగుమ్మంలోకి వెళ్ళేటప్పటికి ఠాణేదారు వచ్చి, వంగి నమస్కారంచేసి, చేతులు కట్టుకుని వెంట బయలుదేరాడు.

వంకదార ప్రవేశించాటప్పటికి కిల్లేదారువచ్చి వీరనమస్కారం చేసి ముందు బయలుదేరాడు.

కచేరీసావడి దగ్గిర శంకరప్ప అడుగు కింద పెట్టాటప్పటికి దివాన్జీవచ్చి "దయచేయించండి" అంటూ ఆహ్వానించాడు.

సేనాధిపతికి వెనకా, అప్పలనరసింహరాజుకీ, విజయరామ రాజుకీ మధ్యగానూ వుండి ద్వారంలో అడుగు పెట్టాటప్పటికి గదిలో, యెదట, మహారాజు నుంచుని వున్నాడు.

ఇద్దరి మొగాలూ ప్రఫుల్లపద్మా లయినాయి

శంకరప్పకి మహారాజు దగ్గిర, విష్ణుంశద్యోతకం అయింది. మహారాజుక, శంకరప్ప దగ్గిర మహేశ్వరాంశ కనపడింది

పెద్దాపురం వచ్చినప్పణ్ణుంచీ ఆ నేకుల వల్ల దినచర్య సకృత్ప్రాంగా వింటూ వున్నాడు కనక, శంకరప్ప మహారాజునీ, రెండు రోజుల

నుంచి గుణగతు లన్నీ అతిసూక్ష్మంగా తెలుసుకుంటున్నాడు కనక, మహారాజు శంకరప్పనీ చిరకాలంగా యెరిగి వుండిన ట్లనుకున్నారు.

అప్పటి కప్పుడే అంకురించిన యీ అనుబంధం తత్క్షణమే కొనలుసాగి వారి నిద్దర్నీ వొకరికేసి వొకర్ని ఆకర్షించింది.

మహారాజు నమస్కారం చేశాడు.

వేదోక్తంగా ఆశీర్వదిస్తూ నమ్రుడై దోసిలివొగ్గి శంకరప్ప ఆ నమస్కారం అందుకున్నాడు.

అప్పుడు మహారాజు ఇంగితం కనిపెట్టి, జగ్గరాజు బలం సద్దించడానికి మేడమీదికి వెళ్ళిపోయాడు.

తరవాత, శంకరప్పకీ, అప్పలనరసింహరాజుకీ, విజయరామరాజుకీ మహారాజు తహాజీమివ్వగా, మహారాజుకి వారున్నూ యిచ్చారు. ఇదిఅయ్యాక నలుగురు యేకకాలంలో కూచున్నారు.

భృత్యులతో సరిగా నుందునివున్న దివాన్జీని చూసి శంకరప్ప మందహాసం చేశాడు. ఆ మందహాసంలో వెటకారం వుండడం గుర్తించి, దివాన్జీ వుడికిపోయాడు.

ఇది యిలా జరుగుతూనే వుండగా మహారా జందుకున్నాడు.

"తమకి శ్రమ యిచ్చాను. తమరు మా పట్నంలోనే యిరవై రోజులుగా వీరవిహారం చేస్తూ వుండినా, గుర్తించలేకపోయినందుకున్నా సిగ్గుపడుతున్నాను"

"తమ రలా సెల విప్పిస్తే నే నేం మనవి చేసుకోగలను? సర్వవిధాలా నేను సామాన్యుణ్ణి. పైగా పిచ్చివాణ్ణి. ఎటు చూసినా జగత్ప్రభువుల సన్నిధికి రావడానికి నేను తగను. అయినా తమ ప్రజ్ఞ మొదట పెనుగొండలో విన్నాను. చూడాలని పేరాస పుట్టింది. కందనోలిలో అది సహస్రగుణం అయిపోయింది. తాహాతు

లేకపోవడం యెరిగి వుండీన్నీ యిక, ఆగలేక, అంచె పరుగులమీద పెద్దాపురం చేరుకున్నాను; కాని—"

శంకరప్ప మాట తేల్చేశాడు.

ఆ ఆర్థోక్తిలోనే మహారాజుకి, శంకరప్ప పొందిన పరాభవం అంతా స్ఫురించింది.

వెంటనే, ఆకర్ణాంతాలైన మహారాజు నేత్రాలు దివాణ్ణిమీద విషపుకోలలు నిగిడించాయి.

అది చూచి కూడా శంకరప్ప "చాలు" అనుకుని తృప్తి పొందాడు.

## ౨౨

తరవాత, మహారాజు "ఇకమనం పైకివెడదాం" అంటూ అప్పల నరసింహరాజుకేసీ, విజయరామరాజుకేసీ ప్రసన్నంగా చూసి, "దయచెయ్యండి" అని శంకరప్పని ఆహ్వానిస్తూ "మాచుట్టూ బల మైన ప్రాకారంవుంది. అహితులనెప్పుడూ దూరంగా వుంచే అలవాటుచొప్పున అది, ఒక్కొక్కప్పుడు విహితులనుకూడా దగ్గరికి చేరనివ్వదు. నిజానికి, అహితులను చేరనిస్తే యెంతఅపాయమో విహితులను పారగొట్టినా అంత అపాయమే కాని,యెటు చూసినా అప్పుడప్పుడిదితప్పని సరిగా కనపడుతోంది. అయితే, భీమవరపు కోటదాకా భూనభోంతరాళాలు దద్దరిల్లజేసినప్రజ్ఞ తమది. దాని యెదట ఆప్రాకారం లెక్కేమిటి జమేమిటి?" అన్నాడు.

మాటముగిశాటప్పటికి నలుగురూ వసారాలోకే వచ్చారు.

అక్కడ కనిపెట్టుకునివుండిన శాస్త్రియాజులూ మహారాజును చూసి నమ్రులై చేతులుకట్టుకుని, పక్కకి వోసరిల్లారు.

శంకరప్ప వారిని చూసి తెల్లపోయాడు. వారక్కడే వుండి పోయినందుకూ, ఆసంగతి తానుగుర్తించలేకపోయినందుకూ చాలా పరితపిస్తూ నాలుక కరుచుకున్నాడు. తరవాత వారిదిక్కుగా సంఘటిల్లిన అంజలిబంధం మహారాజుకేసితిప్పి "జగత్ప్రభూ! ఒక్కమనవి. ఏలినవారి ఆశ్రితకోటిలో చేరిన యీమహానుభావులిద్దరూ నాకళ్ళకి రెప్పలు. నాకళ్ళే అనికూడా చెప్పవచ్చు. అకించనుడూ, అపరిచితుడూ అయిన శంకరప్పని పెద్దమ్మ కడుపులో పెట్టుకుని కాపాడగా, "పిచ్చివాడు" కాడని పెద్దాపురంలో మహామహులందరిదగ్గిరా రుజువుచేసి వీరు నన్నీస్థితికి తీసుకువచ్చారు. చూసుకున్న వేళావిశేషం యెలాంటిదో కాని, నిద్రపోతప్ప మేము ఒకర్నివిడిచివొకరం వుండలేని పరిస్థితుల్లో వున్నాం. పైగా పెద్దాపురంలో వున్నంతకాలమూ నాకు వీరి అవలంబం కావలసికూడా వుంది. వీరిని విడిచి వుండడం నాకు శ్రేయస్కరమూ కాదు. కనక నాదగ్గిరకూచోడానికి సెలవిప్పించి, వీరిని సంతోషపెట్టవలసిందని ప్రార్థన" అని కోరాడు.

మహారాజు వారికేసి ప్రసన్నంగా చూశాడు.

శాస్త్రి "నేను కొంపెల్ల జగన్నాథభట్టుగారి కుమారుణ్ణి మహాప్రభూ!" అన్నాడు.

"అలాగా! వారు దశావతారీలో నిధులు. వారిచాతుర్యం నేను చాలామార్లు చూశాను. తమరు—"

"వీరు చదరంగంలో నిధులు మహాప్రభూ!" అన్నాడు శంకరప్ప.

"అతిశయోక్తి కంటేనూ యెక్కువమాట సెలవిచ్చారు శంకరప్ప గారు – నాకు జంతువులనడకమాత్రం తెలుసు మహాప్రభూ!" అని శాస్త్రి వినయం కనపరిచాడు.

"చిత్తం, దయచెయ్యండి"

"ఇతను చిలుకూరి గోవిందశాస్త్రిగారి కుమారుడు మహాప్రభూ!" అని శాస్త్రి యాజుల్ని పరిచయం చేశాడు.

"గోవిందశాస్త్రిగారూ!" అంటూ మహారాజు అప్పలనరసింహ రాజుకేసి ప్రశ్నార్థకంగా చూచాడు.

"వారు చాలామాట్లు తమదర్శనం చేసుకుని వుండినారు, ఒక మాటు తమ సంతోషారమున్నూ గడించుకున్నారు వారు. మణ్తో రూపాయలు తెచ్చుకుంటూ, యెరజెర్లవాకదగ్గిర దొంగలడ్డుకోగా లంకొదవానఘట్టం పురాణంచెప్పి వాళ్ళవల్ల బహుమతీలు పొందిన-"

"ఓహో, వారా? పాతికసంవత్సరాలనాటిమాట అది, జ్ఞాపకం వచ్చింది. పెద్దబ్బాయి నామకరణ మహోత్సవ సమయంలో కాదూ వారు కోటలో పురాణంచెప్పడం!"

"చిత్తంచిత్తం. అప్పుడే తమరు నెయ్యియన్నూటపదార్లూ, దుశ్శాలువలూ, పట్టుతాపితాలూ——"

"వారి చాతుర్యంముందు అవియేపాటివి? వారి పురాణధోరణి శ్రోతలకు వీరావేశం యెత్తించేది. ప్రాస్తావికశ్లోకాలంటున్నారంటే గవ్వలగుత్తిలాగ రాత్రీపగలూ విరామంలేకుండా——"

"ఆవిషయంలో యితనూ అంతవాడే మహాప్రభూ!"

"అలాగా? అయితే సావకాశంగా వొకమాటు——" అని అంచించి అప్పల నరసింహరాజు కేసితిరిగి "సమయం కనిపెట్టి తమరు జ్ఞాపకం చెయ్యండి" అన్నాడు మహారాజు.

"చిత్తం"

'ఇవాళ తమ వుభయుల దర్శనమూ అయాచితంగానూ, అప్రయత్నంగానూ లభించింది, చాలా సంతోషం-దయ చెయ్యండి"

ఇలా అని, మెట్లమీద మహారాజు ముందడుగు పెట్టాడు. అతని

వెనక జంటగా అప్పల నరసింహరాజూ, శంకరప్పా బయలు దేరారు. వారిని విజయరామరాజు అనుసరించాడు. శాస్త్రి యాజులూ పొంగిపోతూ అతని వెనక బయలు దేరారు.

## ౧౩

అప్పటి కప్పుడే రంగనాయిక బలం చక్కగా సద్ది వుంది.

ఒక పక్షానికి కెంపులూ, వొక పక్షానికి పచ్చలూ పొదిగిన బంగారపు బలం అది.

కెంపుల బలంవేపున మహారాజు కూచోగా, పచ్చల బలంవేపున శంకరప్ప కూచున్నాడు.

మహారాజుకి రెండుపక్కలా అప్పలనరసింహరాజూ, విజయరామరాజూ, జగ్గరాజూ కూచున్నారు. శంకరప్ప రెండు పక్కలా శాస్త్రీ, యాజులూ ఆసీను లయినారు.

మందపాటి సూరపరాజూ, దూర్వాసుల ఆదివరాహమూర్తీ, పాణంగిపల్లి వెంకటరాయడూ అర్థ్వసలాల్లో కూచోగా మహారాజు వెనక యిద్దరూ, శంకరప్ప వెనక యిద్దరూ వేశ్యలు నుంచుని ఆజ్ఞలకు నిరీక్షిస్తూ వుండినారు.

"తమ"రంటే "తమ"రంటూ వొకనిమిషం మొదట మర్యాదలు జరిగాక, గంభీరంగాచూస్తూ ముందు మహారాజు యెత్తు వెయ్యాగా, మందహాసంచేస్తూ తరవాత శంకరప్ప అనుసరించాడు.

అతిదురితంగా యెత్తులువేసే సూరపరాజూ, యెంతో నిదానించి గాని కాయకదపని విజయరామరాజూ, కాళ్ళమీద కాళ్ళు వేసుకునిగాని యెత్తువెయ్యని ఆదివరాహమూర్తీ, యెత్తువేశాటప్పటికి తెరిచిరాజరయేటట్టు, శకట్లూ, యేనుగులూ దూరందూరంగా వుంచా

కుంటూ, యెంతసేపూ బంట్లు కొపుదలమీద మంత్రినీ గుర్రాలనూ యెదటి బలంమీదకి వురికించే వేంకటరాయడూ కూడా వొక గడియ గడిచేదాకా ఆట పోకడ గమనించలేకపోయారు.

నలుగురూ తరుచు మహారాజుతో ఆడేవారే. శంకరప్పతోటినీ ఆడివుండినవారే; కాని, తమతో ఆడినప్పటికంటే వారికా యిద్దరి ఆటలోనూ యెంతో వైలక్షణ్యం కనపడింది. అనడకే కొత్తగా తోచింది.

కాకేమీ?

సూచిభేద్యమైన గాఢాంధకారంలో నేకదా మెరుపుతీగల చకచకలు? మదగజం తారసిల్లినప్పుడేకదా సింహప్పిల్ల శౌర్యోద్రేకం?

దిగ్గంతుల ద్వంద్వయుద్ధం భయంకరమే. అయినా ద్రష్టలకు దర్శనీయమే. మరి ఆ దిగ్దంతులకు?

మహారాజు అసాధ్యపు యెత్తులూ, శంకరప్ప పెంకరాకడలూ దుర్గ్రాహ్యాలుగానే వుండినా ద్రష్టలకు వుల్లాసకరంగానే వున్నాయి.

అయితే, మహారాజుకి మానహానిభయమూ, శంకరప్పకి ప్రాణహాని భీతినీ.

ఏమయినా యెత్తులమీద యెత్తులు పడిపోయాయి.

అనలే తాపీగా ప్రారంభంఅయినఆట నాలుగ్ఘడియలు గడిచే టప్పటికి "యెత్తుపడదేం?" అన్న స్థితికివచ్చింది.

మరేనాడు ఆడినా మహారాజుకి గువ్వపిట్టలవేటలా వుండేది. శంకరప్పకి ప్రాణమాలుసిద్ధించడంగా కనపడేది; కాని,యిప్పుడుమహారాజుకి కొండ తాకినట్టుంది. శంకరప్పకి బ్రహ్మవిద్యలోపడ్డట్టుంది.

ఎత్తుపడ్డకొద్దీ వారికి కసిపెరిగింది, కసి పెరిగినకొద్దీ యెత్తులు బిగిశాయి.

దీంతో, ఒక్కొక్కయెత్తు వేసినప్పుడు, వారికి, వొక్కొక్క ప్రాణం వొడ్డుకున్నట్టు తోచసాగింది.

మరో నాలుగ్ఘడియలు వెళ్ళిపోయాయి.

మహారాజుకీ, శంకరప్పకీ ముచ్చెమటలూ పోశాయి.

అది చూసి కంగారుపడుతూ వేశ్యలు విసనకర్రలు పుచ్చుకున్నారు.

కాని, అప్పటికే ఆట స్తంభించిపోయింది.

చివరిమాటు, యెడమతర్జనితో మొగం తుడుచుకుని, శంకరప్ప, యెర్రగడి శకటం నొక్కివేసి శాస్త్రికీ యాజులుకీ చిరునవ్వు అందిస్తూ, వూపిరి తీసుకుని నిటార్గా కూచున్నాడు.

మహారాజు కళ్ళు మిలమిల్లాడాయి.

ద్రష్టలు మొగమొగాలు చూసుకున్నారు.

రంగనాయిక వొక్క అడుగు వెనక్కివేసింది

ఇది గుర్తించినట్టుగా, వందిమాగధులు, మాధ్యాహ్నిక సమయ సూచకంగా కైవారాలకు అందుకున్నారు.

## ౨౮

"నాతండ్రేనీ నా నాయనేనీ నా శంకరప్పా? ఇంటికి వచ్చావా బాబూ? అగ్రహారం కొట్టుకు వచ్చావా?" అం పొంగిపోతూ కౌగిలించుకుందామని పెద్దమ్మ ముందుకి దూకింది; కాని, అంతకు ముందే శంకరప్ప "పెద్దమ్మా!" అంటూ ఆమె యెదుట సాష్టాంగపడి, మరి మాటరాక, చేష్టలు కూడా లేక, అలాగే వుండిపోయాడు.

ఆదుర్దాపడుతూ పెద్దమ్మ శంకరప్పని లేవదియ్యబోతూ పక్కని చూచేగా శాస్త్రీ యాజులూ అతన్ని లేవదీసి పట్టుకూర్చున్నారు.

ఇంతలో పచ్చ అక్షింతలూ యెఱ్ఱ అక్షింతలూ పట్టుకు వచ్చి రామసోదెమ్మ విభ్రమవిలాసాలతో అతనికి దిష్టి తీసింది.

"సగ్గెశాం పెద్దమ్మా" అంటూ పెద్దమ్మ రెండు చేతులూ పట్టుకుని ప్రారంభించాడు శంకరప్ప.

"ప్రతిష్ఠ అడ్డు వచ్చింది; కాని మహారాజు యివాళే తన వోటమి అంగీకరించి వుండును. అయినా యిప్పుడు మనకి వచ్చిన లోటేమీ లేదు. ఆరుమాసాలకయినా ఆట కట్టిందని వొప్పుకో వలసిందే కాని, మహారాజుకి మరోదారి లేదు. అవునా శాస్త్రి గారూ? మీ రేమంటారు యాజులుగారూ?"

"ఆట కట్టేపోయింది" అన్నాడు శాస్త్రి, "ఆమాట ఒప్పుకోడానికే వాయిదా" అన్నాడు యాజులు.

జరిగిందంతా అతిమధురంగా చెప్పాడు శంకరప్ప.

శంకరప్పని కౌగిలించుకుని వొక్క క్షణం మాట్లాడలేక పోయింది. పెద్దమ్మ.

శాస్త్రినీ, యాజుల్నీ ఆపూట భోజనానికి ఆపేసింది.

* * *

జాము పొద్దువేళ మళ్ళీ పాలెకీ రాగా, ఒక్కమాటు ఏకాంతంగా గదిలోకి వెళ్ళివచ్చి మిత్రులతో కోటకి వెళ్ళాడు శంకరప్ప.

మామూలు మర్యాద లన్నీ జరిగాయి. తరవాత అందరూ యథోచితంగా కూచున్నారు.

రాజుకీ శంకరప్పకీ రంగనాయికా, తక్కిన వారికి తక్కిన వేశ్యలూ తాంబూలా లందించారు.

ఏమి చేమిటో కబుర్లు వెళ్ళాయి. ఏమి చేమిటో సంగతులు వచ్చాయి. చదరంగానికి బదులు లోకాభిరామాయణం ప్రారంభమయింది.

"చంద్రవదన అని మావూళ్ళో వొక వేశ్య" అంటూ అందుకున్నాడు శంకరప్ప.

"ఆమె మానాయనగారి దగ్గిర కావ్యనాటకాలంకారగ్రంథాలు నాతో సరిగా తుణ్ణంగా చదివింది. ప్రస్తుతం ఆమె మొగలితుర్రు ఆస్థానంలో మన్ననలు పొందుతోంది భాతృప్రేమతో పెంచిన న్నామె చదరంగంలో ప్రవేశపెట్టి దిద్దింది"

"సరసంగా వుంది. అంచేతనే తమరియెత్తుల్లో యీ చాతుర్యం" అన్నాడు మహారాజు.

రంగనాయికా, ఆమె సహచారిణులూ వుత్సాహంతో మొగమొగాలు చూచుకున్నారు.

"కందనోలి నవాబుగారి వజీర్లలో వొకాయన యీ ఆటలో అఖండుడు. వయసుకాలంలో సేనావిన్యాసంలో ఆయన అసాధ్యుడుగా వుండినాడనీ, ఈవార్ధకంలో ఆ నేర్పంతా చదరంగం ఆటలో కనపడుతోందనీ కర్ణాకర్ణిగా విని, వసుకట్టుకు వెళ్ళి, నెల రోజులు తంటాలు పడి ప్రవేశం సంపాదించాను. మూడురోజులు యెన్నో పెంకి యెత్తుగడలు వచ్చాడాయన. ప్రతీ యెత్తూ నన్ను మూడు చేరల నీళ్ళు తాగించింది"

"దేశంలో యెంతెంతవారేనా వున్నాయి. అలాంటివారిని చూడాలంటే అదృష్టంవుండాలి. అయితే తరవాత యేమిజరిగిందీ?"

"నాలుగో నాడు బల్ల దగ్గిర కూర్చోగానే కౌగిలించుకుని, నా చెయ్యి ముద్దాడి ఆయన చేసిన బహుమతీ మహాప్రభూ! యిది"

ఇలా అని తన మొలలో గుప్తంగా వుంచిన కటారి తీసి, మహారాజు దగ్గిరగా వుంచాడు శంకరప్ప.

శాస్త్రీ, యాజులూ వులిక్కిపడి "ఇదివరకే మనకి చూపించారు

కారు చూశావా?" అన్నట్టు చూసుకున్నారు.

"ఎందరు వీరాధివీరుల కణ్ఠోష్ణరక్తం చవిచూసిందో యిది. లేక పోతే యీ కెంపుల కింతపూత యెలా వచ్చింది? మంచి సరసు డాయన" అని మెచ్చుకుంటూ మహారాజది అందుకుని పరిశీలనగా చూసి, పైరతీసి వాయి కూడా పరీక్షించి, "బాగుంది" అని అప్పల నరసింహరాజుకి అందించాడు.

"నాలుగో నాడు కొత్త ఆట వేశాం. నా యెదుట కూచుని ఆడింది ఆయనే కాదు, తెరచాటునుంచి సలహాలు వచ్చాయి. తెర చాటున నెమిలిపిట్ట వున్నదా అని భ్రాంతిపడ్డాను నేను. ఆట వారం రోజులు సాగింది; కాని, మహాప్రభూ! ఏమి రాకడలూ అవీ? ఏమి ప్రతిఘటనలూ అవీ? ఒకొక్కెత్తు కొకొక్క వూపు వూపేసింది నన్ను. ఎనిమిదో సాయంత్రం, తెరచాటునుంచి తన నోడిలో పడిన యీ వుంగరం నా వేలికి తొడుగుతూ ఆయన చేసిన ప్రశంసా, తెర చీల్చుకు వచ్చిన మందహాసజ్యోత్స్నా యిప్పటికీ నాకు పులకలు రేపెడుతున్నాయి"

ఇలా చెప్పి, శంకరప్ప, యెడమచేతి అనామికనుంచి తీసి, ఆరత్నాంగుళీయకం మహారాజు సన్నిధిలో వుంచాడు.

మరో గడియ యిలాగే గడిచాక అందరూ లేచారు.

మన్నాడు కూడా వుదయం యిలాగే గడిచిపోయింది.

తరవాత అదే మామూలు అయిపోయింది.

"మనం కొంచెం జోరు చేసేశాం. తమరు వుసికొల్పడంవల్ల నేను కూడా వుద్రేకంలో పడిపోయాను" అంటూ చాలా పరితపించాడు ఆదివరాహమూర్తి.

"నేను మాత్రం యిలా అవుతుం దని యెరుగుదును టండీ? ఆతాజేపాయగాదు నన్ను తప్పుదారిలో పెట్టేవాడండీ?" అంటూ పినుక్కున్నాడు దివాన్జీ.

"మహారాజు దృష్టిలో తుచ్ఛుణ్ణయిపోయాను నేను. నాకు తర జోపాయం కనపడ్డం లేదు"

"ఆం పూర్తి కాకుండా అంత బెంబేలు పడిపోతా రేమిటండి?"

"ఆట వేరూ శంకరప్పగారి ప్రవృత్తి వేరూ కాదండీ? ఆ వినయ విధేయతలూ, ఆ సభ్యతా మర్యాదలూ మహారాజుని ముగ్ధుణ్ణి చేసేస్తున్నాయి. నే ననత్యవాదినే కాదు, ఈర్ష్యాళువు నయిపోయాను. అదీకాక: ఆట యెప్పుడో పూర్తి అయిపోయింది,"

"అంటేని?"

"అంటే యేంవుందీ? ఇక్కడికి వెల్లాళ్ళనుంచి ప్రతీదినమూ వుదయమూ సాయంత్రమూ వెళ్ళి. బల్లదగ్గిర కూచోడం తప్ప మరేమీ పనిలేదు. మహారాజిక యెత్తు వెయ్యలేరు"

"వెయ్యలేరూ!" అంటూ దివాన్జీ మాన్పడి పోయాడు.

"వేసేం లాభమూ? ఇప్పుడు వేసిరాజుమాత్రమే. ఎత్తువేస్తే కొట్టిరాజే. అంచేతే మహారాజు తటపటాయిస్తున్నారు"

"..............."

"ఎటుచూసినా ఆటకట్టిందని ఒప్పుకోడమే మర్యాదగా కన పడుతోంది"

"మరి దారిలేదంటారా?"

"ఉంది, మహాప్రభూ! వుంది. బల్లదగ్గిరికే, బల్లదగ్గిర్నుంచీ కావలసినంతదారి"

* * *

"శ్రీకేమమ్మా? వారి చాతుర్యం కళ్ళారా చూస్తున్నావునువ్వు"

"అవును, చూస్తున్నాను"

"రోజూ రెండుపూటలా వారిదర్శనం అవుతోందినీకు"

"ఆహా; అవుతోంది"

"వారు మీయింటికి విజయంచేశారు"

"నీకు కనపడుతూ వున్నదీ, నిన్నూరిస్తూ వున్నదీ యిదే; కాని, దీనివల్ల నాకుకలిగిన మహాభాగ్యం యమయాతనమాత్రమే అని యెరగవు నువ్వు"

ఇదివిని అలివేణి వులిక్కిపడింది.

"పందిట్లో నుంచునివుండి పందిట్లోనుంచే వెళ్ళిపోయారు వారు. నాచైతన్యం అంతా వారివెంటే వెళ్ళిపోయింది. ఇప్పుడు నీయెదట వున్నది రంగమ్మ కట్టెమాత్రమే"

ఈ మాటతో రంగనాయిక కంఠంలో గద్గదిక అంకురించింది. అలివేణి కళ్ళు అనిమిషా లయినాయి.

"రెండుపూట్లా వారి దర్శనం అవుతోంది కనక, కర్పూరవిడెం సమర్పించుకునే టప్పుడు మునివేళ్ళ స్పర్శ అయినా అవుతోంది కనక, యెప్పుడైనా వొకొక్కమాటు, వారు, కాటుకకళ్ళనిండా చూస్తున్నారు కనక రంగమ్మ నింకా నువ్వు చూడగలు గుతున్నావు"

"నా కందులో నహస్రాంశమూ లేదుగా?"

రంగనాయిక వొక్కక్షణం ఆలోచించి "శాస్త్రుల్లు మామయ్యగారున్నారుగా? వారి నాశ్రయింనరాదూ?" అంది.

"అదీ అయింది. ఈ ఆటసంగతి తేలితే గాని, వారు మాట్లాడరన్నారన్నయ్యగారు" అని అలివేణి మొగం వేలవేసుకుంది.

"ఒకపని చెయ్యి"

"ఏమిటదీ?"

"తెల్లవారితే యిటు మహారాజు కొలువు. దీపాలు పెడితే అటు వారి రాక. కనక నాకెలాగా యోగం లేనట్టే. నువ్వు బసకే యెందుకు వెళ్ళకూడదూ?"

"శాస్త్రం చెప్పిన ట్టుంది నీసలహా"

"అదేమే!"

"పెద్దమ్మగా రంటే వారికీ భయమే, అన్నయ్యగారికీ భయమేట"

"పాద సేవకీ అభ్యంతరం వుంటుందా?"

అలివేణి "అవునుసుమా" అంటూ యెగిరిపడి "నువ్వు చెప్పింది బాగుంది. ఇక ఆప్రయత్నం చేస్తాను. ఆయేర్పాటు చేసేదాకా అన్నయ్యగారి పాదాలు వదలను" అంది.

"ఆవిధంగా చివరికి నీకేనా అదృష్టం—"

"నాకంత అదృష్టం పడితే నీకూ పట్టిందన్న మాటే. మొదటి రోజున నిన్ను తీసుకునే వెడతాను"

"అయితే, మధ్యాహ్నం రెండుజాముల వేళ మామయ్యగారి నోమాటు మీయింటికి రప్పించగలవా?"

"వో! నిమిషంలో రప్పిస్తాను. మా అమ్మ వెళ్ళి తీసుకువస్తుంది"

"అట్నుంచి నరుక్కువద్దాం. నాకు వేళఅయింది, వెళ్ళిపోవాలి, యిక నువ్వు వెళ్ళు"

ఇద్దరూ వొకమాటు గంభీరంగా చూసుకుని, "సంరయే" "సంరయే" అనుకుని, అభీష్టం నెరవేరినట్టే ఆనందిస్తూ అలివేణి యింటికి వెళ్ళిపోగా, వుపక్రమణిక ఆలోచించుకుంటూ రంగనాయిక కోటకి వెళ్ళిపోయింది.

*　　　*　　　*

"ఏ మాద్దంటాగు బాబయ్యా?"

"ఏమిటోయ్ ఆరయేవీ? మహారాజే నెగ్గేస్తారు. వాడి కలకాయుని

దగ్గిర వుండి, కోట కొమ్మలికి నేను కట్టిస్తానిక మాదిగ అమ్మిగాడి చేత'' అంటూ వెన్ను విరుచుకుని మీసంమీద చెయ్యి వేసుకున్నాడు తాణేదారు.

''అంతమాట అనెయ్యకండి బాబయ్యా! ఇదివరకే తొందరయిపోయిం దిక నేనా జాగ్రత్తగా వుండడం మంచి దండి''

''అయితే, ఏమంటావ్?''

''ప్రభువ్వారు నెగ్గలేరుటండి. నెగ్గడం దాకా ఎందుకూ, కాయే కదపలేరు టండి''

''ఆఁ!''

''సూరవరాజు బాబయ్య సెలవిప్పించారండి. ఆటకట్టిపోయే వుందిట దేవరా!''

''కొంపతీసి గోచిపాతగాడు నెగ్గేస్తాడా ఏమిటి?''

''మనవి చేసుకున్నాను కాదండి? ఇక అలాంటిమాట రానియ్యకండి బాబయ్యా! దేవిడీ మన్నా అయిపోయిందంటే—''

''ఓరి నీ యిల్లు—''

తాణేదారు నోరెండిపోయింది.

* * *

''పైకి దయ చెయ్యండి బాబయ్యా!'' అన్నాడు చల్లా జగ్గప్ప.

''అప్పుడే శంకరప్పగారు వచ్చారా ఏమిటి?'' అని సూరవరాజూ ''మెత్తేమయినా వడిందా?'' అని ఆదివరాహమూర్తి వొకే మాటే అడిగారు.

ఇద్దరికీ ''లేదండి బాబయ్యా!'' అని వొకటే జవాబు.

''మ రేమంటావోయ్?''

''ఏమీ లేదు పైకి దయ చెయ్యండి''

"ప్రభువు —"

"ఈపాటికి నల్ల చెరువుదగ్గిరికి చేరుకుంటారండి"

"అదేమిటి?"

"ప్రభువ్వారూ, శంకరప్పగారూ, అప్పలనరసింహారాజు బాబయ్యా వేటకి—"

"మరి ఆట?" అని అడిగాడు మూర్తి.

"శంకరప్పగారికి వేటకూడా అలవాటుందా యేమిటి?" అని ఆశ్చర్యపడుతూ అడిగాడు సూరపరాజు.

ఇంతలో "వేటేమి టండోయ్?" అంటూ వెంకటరాయడు వచ్చాడు.

జగ్గప్ప వివరాలు చెప్పాడు.

దానిమీద "అయితే యిక మేము పైకెందుకూ?" అన్నాడు మూర్తి.

"ఎత్తేమయినా తోచకుతుందేమో పరకాయించమని సెలవయింది బాబయ్యా!"

"ప్రభువ్వారికి తోచని యెత్తు మనకా తోస్తుంది?" అని అన్నాడు వెంకటరాయడు.

"ఎత్తుతోచడం సర్వాబద్ధం. ఇక వున్నదల్లా యేమిటంటే! ప్రభువు లేరు కనక, బలంచూస్తూ మనం ధారాళంగా చర్చించుకోవచ్చు. ఇది కాదని అదీ, అది కాదని యిదీ యెత్తువేసీ చూడవచ్చు"

సూరపరాజిలా అనగా "బలం యేమాత్రం కలిసిపోయినా మనపరువు తక్కువదండోయ్" అన్నాడు మూర్తి.

"పైనెవరున్నారు జగ్గప్పా?"

"బంగారపు బలం యెలా వుందో అలాగే దంతపుబలం సర్ది

వుంచింది అలాయిదాగా రంగనాయిక. నాగరత్నం కూడా పైనే వుందండి. వీరభద్రమూ విరిబోణీ వచ్చే వేళయిందండి''

''బతికాం మరి తొరగా పదండి'' అంటూ మెట్లకేసి తిరిగాడు బోసినోరు చప్పరించుకుంటూ మూర్తి.

నూరపరాజు మెట్లదగ్గిరికి బయలుదేరి ''వెంకటపతిరాజు దద్దయ్యగా రుంటే బాగుండును. అన్నట్టు విజయరామరాజుగారూ-'' అని అర్థోక్తిలో వుండగా, ''వారు భీమవరపుకోట వెంచేశారు బాబయ్యా! మళ్ళీ పదిరోజుల్లో దయచేస్తారండి. వెంకటపతిరాజు బాబయ్యకీ, అప్పలాచార్యులయ్యవార్లంగారికీ, మల్లికార్జునలింగం అయ్యవార్లంగారికీ కభురు వెళ్ళింది. తమరు దయచెయ్యండి, రాగానే వారిని పైకి తీసుకువస్తాను నేను'' అంటూ జగ్గప్ప బయలుదేరాడు.

వారు ముగ్గురూ యేకవరసన మెట్లెక్కేశారు.

* * *

రోజులు కాదు, వారాలు కాదు, మాసాలే అరుగడిచిపోయాయి. కాని, యెత్తు పడలేదు. దారీ దొరకలేదు. ఆశే అంతరించి పోయింది.

ఈ ఆరుమాసాల్లోనూ యెక్కడికెక్కడికో కభుర్లు వెళ్ళాయి. ఆహూతులూ, అనాహూతులూ యెవరెవరో, యెందరెందరో ఆటకాళ్ళు వచ్చారు.

ఎన్నో పరిశోధనలు చేసి, యెన్నోమాట్లు రకరకాల యెత్తులు వేశారు.

కాని, బంగారపుబలం బంగారపుకొండ అయి అలాగే ఉండి పోయింది.

కోటలో బంగారపుబలం యెలా వుందో అలా సద్దుకుని మూర్తి వగైరాలు తమ యిళ్ళల్లో కూడా తీవ్రప్రయత్నాలు చేశారు.

ఒక్కొక్క బల్లదగ్గర పదేసిమందీ, యిరవయ్యేసిమందీ నలుగుళ్లు పడ్డారు.

పెద్దాపురానికి పెద్దాపురమే సుడికిపోయింది. కాని, ప్రయోజనం కలగలేదు.

చివరికి, మహారాజుకి, నిద్రాహారాలు కరువయి పోయాయి, రాచకార్యాలమీద వెగటున్నూ పుట్టింది.

## ౧౮

కరకర పొద్దుపొడిచింది.

ఎర్రని సూర్యబింబం, పొగనింపి అప్పుడే వెలిగించిన కాగితబుట్టలాగ మెల్లిగా పైకి లేవసాగింది.

దేవిడీలో ఝూంఝుంకారా మంటూ నగారా మోగిపోసాగింది.

ఊళ్ళో శివాలయంలో రుంజలు, ఆ నగారాకి జవాబివ్వసాగాయి.

బురుజుమీది నరసింహస్వామిఆలయంపు పసిడికుండ, జిగజిగ మెరసిపోతోంది.

ఘంటాపథాలన్నీ అసివారులు బయలుదేరిన ఆశ్వికులతో నిండిపోయి వున్నాయి.

సాలలు బాగుచెయ్యడంకోసం, కోటలో బయటకట్టివున్న మదపుటేనుగులు ఘీంకారాలతోటీ, పారశీకాశ్వాలు సకిలింపులతోటీ అన్నదాతలను ఆహ్వానిస్తున్నాయి.

అగడ్తలో, తమ్మిచెర తప్పించుకుని, మహోల్లాసంతో పాట

లు పాడుకుంటూ గంధంతుమ్మెదలు పూలతోట కొల్లగొట్టడానికి కోటలో చొరబడుతున్నాయి.

ఇలాంటిసమయంలో, సాముగరిడీలు చాలించి, మహారాజు అప్పుడే స్నానపుగదిలో ప్రవేశించాడు.

నూనెజిడ్డు వదలడాని కిద్దరుగుబ్బెతలు సుగంధచూర్ణంతో నలుగులు పెడుతున్నారు.

ఒకతె సువర్ణకలశం పట్టుకుని గంగాళందగ్గర నుంచునివుంది.

మరొకతె ఆగంగాళంలోనీళ్ళు తొరుపుతూవుండగా, యింకొకతె అందులో పన్నీరుగుమ్మరిస్తోంది.

వేరొకతె, వుండుండి చెయ్యిపెట్టి నీళ్ళు పాళ్ళాలుమాస్తోంది

ఇంకొకతె కొంచెం దూరాననుంచుని చెంగావివంచెకి దంగలు సవరిస్తోంది.

మరొకతె అందరిమీదా కళ్ళతో అధికారం చెలాయిస్తూ, ఆజ్ఞలకోసం యెదురుచూస్తూ కొంచెం పక్కగా నుంచునివుంది.

మానసికాందోళనవల్లా, సుఖస్పర్శవల్లా కళ్ళు మూసుకుని, మొగంకూడా వంచుకునివున్న మహారాజు హఠాత్తుగా మెరుపు కొట్టినట్టయి ఆమెకేసి చూశాడు.

వెంటనే "చిత్తం మహాప్రభూ!" అంటూ ఆమె సావధాన అయింది.

"చల్లా జగ్గప్పనుంచున్నట్టుగా" అని కొంచెం ఆత్రంగాచెప్పి మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు మహారాజు.

ఆజ్ఞ అంచెనోళ్ళమీద వెళ్ళింది.

జగ్గప్ప రొంగిరివచ్చి "హాజర్ మహాప్రభూ!" అంటూ దోసిలి ఒగ్గి, నమ్రుడయినాడు.

కళ్ళు తెరవకుండా మొగంమాత్రం అటుతిప్పి, "జగ్గప్పా!" అన్నాడు మహారాజా.

"చిత్తం మహాప్రభూ!"

"ఎలావున్నానరే, శంకరప్పగారిని నిమిషాలమీద తీసుకు రావాలి"

"తీసుకువస్తాను మహాప్రభూ!"

"పాలకీ అయితే ఆలస్యం అవుతుంది. గండభేరుండాన్ని తీసుకు వెళ్ళు"

"చిత్తం చిత్తం"

"ఇంకా నుంచున్నావు"

"లే—ద్—మ—"

జగ్గప్ప మాటకంటేముందు వుడాయించాడు.

"తొరగా తెమల్చాలి" అన్నట్టు పరిచారికలకేసి చురుగ్గా చూశాడు మహారాజు.

## ౧౭

స్నానసంధ్యాద్యనుష్ఠానాలన్నీ ముగించేసుకుని, ఆరివున్న అంగా స్త్రాళజత ధరించి, పుత్రులకిద్దరికీ మధ్యగా, కవాచీ బల్లమీద కూచునివున్నాడు శంకరప్ప.

కొంచెం పక్కగానూ, పడమటింటి గుమ్మానికి చేరికగానూ పెద్దమ్మా, లోగుమ్మంలో తలుపు ఆనుకుని రామసోదెమ్మా, మండువా దక్షిణపుఅంచున గోడఆనుకుని ఆలివేణీ రంగనాయికా నుంచుని వున్నారు.

"చెల్లాయిది ఆరుమాసాల తపస్సు. రంగనాయికదిన్నీ అపాటిదే

కనక మీరీపాటికి వరదులు కావడం ధర్మం" అన్నాడు శాస్త్రి.

అలివేణి దోసిలి వొగ్గింది.

"సంగతిసందర్భాలన్నీ మామయ్యగారితో మనవిచేసుకునే వున్నాను. మళ్ళీ యిలాంటిఅవకాశం యెప్పటికో? అంచేతే నే నాదుర్దా పడిపోతున్నాను" అని జాలిగా అంది రంగనాయిక.

"మిమ్మల్ని నిర్బంధించడానికి మేము చాలం; కాని, మీరివాళ దయచెయ్యకతప్పదు. బాహాటంగా అంగీకరించడం తరవాయిగా మహారాజు వోడిపోయే వున్నారు. ఆకాస్తా అయిపోయిందనుకుందాం. ఇక మీతో యెత్తు వెయ్యడానికెవరికి గుండెలు తాళుతాయి? కనక మీరివాళ "ఊఁ అనాలి, తప్పదు" అని యాజులు వృత్తి చెప్పాడు.

దానిమీద "యిక తప్పేటట్టు లే" దన్నట్టు శంకరప్ప పెద్దమ్మకేసి చూశాడు. అదిగుర్తించి "పెద్దమ్మగారి అనుగ్రహమూ మా భాగ్యమూనూ" అంది అలివేణి.

"వెర్రిపిల్లవు, జగత్పండితుడైన నా వరహాలమూటకి నేనా చెప్పగలదాన్ని?" అంటూ పెద్దమ్మ రామసోదెమ్మకేసి చూడగా, ఆమె, శంకరప్పకిమాత్రమే కనపడేటట్టు విభ్రమవిలాసాలు మొలిపించి తలుపుచాటున నక్కింది.

దాంతో శంకరప్ప కళ్ళల్లో వింతతేజస్సు మెరిసి, అలివేణి కనుదమ్ములకు వికాసం యిచ్చి, రంగనాయిక చెవులకు మధురశబ్దం అందించింది.

ఈసమయంలో కొంజాదగ్గిరనుంచే "పెద్దమ్మగారూ?" అంటూ పిలుపు వినిపించింది. వెంటనే గుమ్మంలోకి వెళ్ళి పెద్దమ్మ "యేం జగ్గప్పా?" అని అడిగింది

వచ్చినమనిషి జగ్గప్పఅని తెలవడంతోటే నాలుక కరుచుకుంటూ రంగనాయికా, అలివేణీ తూర్పింటోకి దూరారు.

"దండాలు బాబయ్యా! దండాలండి, దండాలండి"

"శుభం......ఏమోయ్ తెల్లవారకుండావచ్చావూ?"

"ప్రభువ్వారు తరిమిపంపారు దేవరా! నుంచున్నపాళంగా తోడితెమ్మని సెలవు. పాలకీఅయితే ఆలస్యం అయిపోతుందని గండభేరుండం పంపారు. ఈపాటికి సగందూరాన వుంటుందండి"

"అంత పులకం రేమిటోయ్?"

"తెలవదు బాబయ్యా"

తదేకదృష్టితో చూస్తూ "విసుగ్గా వున్నారా?" అని అడిగాడు శంకరప్ప.

"లేదండి" అన్నాడు జగ్గప్ప.

"ఏంచేస్తున్నారూ?" అని అడిగాడు యాజులు.

స్నానప్రయత్నంలో ఇంకా నలుగుల్లోనే వున్నారండి"

శంకరప్ప చిరునవ్వు బిగపట్టుకుని, మిత్రులకేసి వెల్లింపు చూపులు చూశాడు.

"ఏదో యెత్తు తోచింది, మరి లేవండి" అంటూ యాజులు లేచి నుంచున్నాడు.

చిరునవ్వు నవ్వుతూ, పెదవివిరుస్తూ, తల అడ్డంగావూపుతూ తొంగిచూసి రంగనాయిక మళ్ళీదాక్కుంది.

"అదిగో గండభేరుండం బాబయ్యా!" అన్నాడు జగ్గప్ప.

శంకరప్ప నిశ్చలంగా అలాగే కూచుని వున్నాడు.

అదిచూసి "లే, యింకా జాప్యంచేస్తావేం నాయనా?" అంటూ పెద్దమ్మ తొందర పెట్టింది.

అప్పుడు. మొగం పక్కకి తిప్పుకుని, కిందికి చూస్తూ వొక్క మాటు తలపంకించి, తాపీగా మళ్ళీ మొగం తిప్పుకుంటూ "జగ్గప్పా!" అంటూ అందుకున్నాడు శంకరప్ప.

"చిత్తం బాబయ్యా!"

"శంకరప్ప యేనుగెక్కేగాని, గుర్రం యెక్కి వెళ్ళడోయ్"

అదేవో బోధపడక జగ్గప్ప తెల్లపోయాడు.

శాస్త్రీ యాజులూ మొగమొగాలు చూసుకున్నారు.

పెద్దమ్మ శంకరప్పని విడిచి జగ్గప్పనీ, జగ్గప్పనివిడిచి శంకరప్పనీ చూడసాగింది.

"కనక నువ్వు వెళ్ళిపోవచ్చు"

"నెడతాను దేవరా!" అంటూ చేతులు నలుపుకున్నాడు జగ్గప్ప.

"ఈమాటే మనవిచెయ్యి ప్రభువ్వారితోటి"

"చిత్తం చిత్తం" అంటూ నసికాడు జగ్గప్ప.

"ఇక గండభేరుండం యెందుకూ?"

"పాలకీ—"

"ఇప్పటి కంతే మరి"

"సెలవు బాబయ్యా!"

"శుభం"

"దండాలండి, దండాలండి, దండాలండి"

బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి జగ్గప్ప గుర్రంయెక్కాడు.

గుర్రాలు మేఘాలెక్కాయి.

౨౭

"ఆరుమాసాల ఆందోళనవల్ల, గుర్రం కదిపితే యేనుగుతో తెరిచి శాశ్వతం వున్న సంగతి మరిచిపోయారు ప్రభువ్వారు" అని

కళ్లు చికిలించుకుంటూ, జగ్గప్ప వెళ్ళి వెళ్ళడంతోనే రంగనాయిక మళ్ళీ వాకిట్లోకి వచ్చింది.

"శాబాసు" అంటూ ఆమె వెనకనే అలివేణిన్నీ వచ్చింది.

"ఏమిటి?" అంటూ రాజులూ, "అవును సుమా" అంటూ శాస్త్రి పూగిపోయారు.

అది శంకరప్పకి వుద్రేకం కలిగించింది.

ఆరుమాసాలుగా బలవంతాన అణిగి వుండిన వుత్సాహం అంతా వొక్క వూపున కట్టతెంచుకుని వురికి, శంకరప్పని గుంజిగుంజి విడిచిపెట్టింది.

దాంతో "మనం నెగ్గేశామండి! మహారాజవాళ్ల తమ వోటమి వొప్పేసుకుంటారండి" అంటూ చంటిపిల్లాడిలాగ పరవళ్ళు తొక్కి, అమాంతంగా వెళ్ళి పెద్దమ్మ కాళ్ళదగ్గిర చతికిల బడ్డా డతను.

పెద్దమ్మకిన్నీ వుత్సాహమూ, ఆనందమూ వెల్లివిరిసిపోయాయి.

వెంటనే శంకరప్పని పొదివి పట్టుకుని "నాతండ్రే! నా బాబే! ఈమాట వినడానికి కనిపెట్టుకుని వున్నాను నాయనా! నేను. నా కళ్ళు చల్లబడ్డాయి బిడ్డా!" అంటూ వూర్ధ్వశ్వాసతో మూర్ధాఘ్రాణం చేసిం దామె.

అదిచూసి అలివేణి "యిదంతా పెద్దమ్మగారి చేతిచలవ" అనగా "యింకా సందేహమా?" అంటూ ఆవేశంతో అందుకున్నాడు శంకరప్ప.

"మీ రంతా శంకరప్ప మహా తెలివయినవా డనుకుంటున్నట్టుంది. ఇదంతా శంకరప్ప ప్రజ్ఞే అనుకుంటున్నట్టూ వుంది; కాని, అసలు శంకరప్ప ఆదిలోనే మొగం వేలవేసేశాడు. ఇప్పుడు మీయెదట వున్న శంకరప్ప పెద్దమ్మ ప్రాణప్రతిష్ఠ చేసి విడిచి పెట్టిన పిండి

బొమ్మ. నిజంగా పెద్దమ్మ కటాక్షించి వుండకపోతే, శంకరప్ప యెవరో, మీ రెవరో, మహారాజెక్కడో, యీగొడవ అంతా యేమిటో? ఎన్ని జన్మ లెత్తి యెంత సేవ చేసినా నేను పెద్దమ్మరుణం తీర్చుకోలేను. పెద్దమ్మ శక్తి యీవూళ్ళో యెవ రెరుగుదురూ? మహారాజు నాకోసం పాలకీ పరివారమూ పంపారంటే— సేనాధిపతినే పంపారంటే అది పెద్దమ్మ వేసిన ఎత్తుకి ఫలితం. ఎందుకని దయతలిచి ఆవేళ వారు రాగానే నన్ను పంపించింది గాని, పెద్దమ్మ వొకరోజు బెట్టుసరీ చూపిస్తే మహారాజే పాదచారి అయి రాక పోదురా వెతుక్కుంటూను? ఆదిలో పెద్దమ్మ వేసిన యెత్తే యిప్పుడు మహారాజు ఆట కట్టిం దనుకోండి. నామరూపాలు లేక గాలికెగిరి వచ్చిన యీదూదిపింజెని "మనిషి, పుక్కుతునక" అనిపించింది పెద్దమ్మ. దివాన్జీ నౌకర్ల చేత యీడ్పులుపడ్డ శంకరప్పకి పెద్దాపురం మహారాజుచేత తివాజీ మిప్పించింది పెద్దమ్మ. నా పెద్దమ్మ అంటే ఆ ఆదిశక్తి అని యిప్పుడేనా తెలిసిందా మీకు? నా పెద్దమ్మ నా యిలవేల్పు"

ఇలా అంటూ పరవశుడయిపోయి కళ్ళుమూసుకుని అతను పెద్దమ్మపాదాలమీద వాలాడు.

అందరి కళ్ళూ చెమ్మగిల్లాయి.

శాస్త్రీ, యాజులూ, అలివేణీ, రంగనాయికా పెద్దమ్మ కేసి చూస్తూ అప్రయత్నంగా దోసిళ్లు వొగ్గారు.

కళ్లు తుడుచుకుంటూ వచ్చి, పెద్దమ్మమీద వొక చెయ్యి ఆనుకూర్చుని, రామసోదెమ్మ, బోర్లాపడుకున్న వున్న శంకరప్ప వీపు నిమిరింది.

అప్పటికి పెద్దమ్మకి మాట తిరిగింది.

"అన్నం అమ్ముకుంటూ పొట్టపోసుకునే ముసలిముండ యింత పని చెయ్యడం యెక్కడేనా వుందా? కనక, నావెర్రితండ్రి మాటలు మీ రెవరూ నమ్మకండి నాయనా!" "చేతిలో యెర్రని రాగాని లేదు. మహారాజుని ఆశ్రయిద్దా మని వచ్చాను. అన్నం పెడతావా పెద్దమ్మా?" అంటూ వచ్చాడు నాతండ్రి. ఆ దైన్యంలోనే ఆ మొగంమీద నాకు దేవతాకళ కనపడింది. "నీకొడు కనుకో" అని యెవరో చెవిలో చెప్పినట్టయింది. దీనికి సాయం నామేనకోడలు—యీవెర్రిపిల్ల "కట్టుకోడానికి బట్టలు కూడా లేనట్టుంది అత్తా— మొగం కలకల్లాడుతోంది, గొప్పవాడు కామోను, వుంచుకోవమ్మా" అంటూ పాకులాడింది. లే దనలేకపోయాను. పెట్టా లని వుంటే పదిమంది తిని పోయేచోట గుప్పెడన్నమే మిగలక పోతుందా? "నీకు లోటు లేదు, రా, నాయనా!" అన్నాను. అది విని పొంగిపోయాడు నాతండ్రి. అప్పుడే మొదలు ఈ పడిపడి దణ్ణాలికి. చిట్టి తండ్రికి నేనంటే యేనో వెర్రిభక్తి కుదిరిపోయింది. ఇంతకీ, నాతండ్రికి జయం కలిగిందే నాకు కావలసిం దదే" అందామె.

అప్పటికి ప్రకృతిలో పడి మెల్లిగా లేచి కూచున్నాడు శంకరప్ప.

వెంటనే రామసోదెమ్మ పడమటింటోకి వెళ్ళిపోయింది.

తరవాత నాకర్మచేత యీడ్పులు పడ్డం యేమిటో కూడా చెబితే గాని వల్లకా" దంటూ వెళ్ళి శంకరప్ప రెండు చేతులూ పట్టుకున్నాడు శాస్త్రి.

యీజులుకూడా మొండిపట్టు పట్టాడు.

పెద్దమ్మా శంకరప్పా వొక్కమాటు చూసుకున్నారు. ఆ చూపుల్లో మెరుపుతీగలు పాకిపోయాయి.

వెంటనే ఒక్కమాటు కంఠం సవరించుకుని శంకరప్ప జరిగిం

దంతా చెప్పేశాడు.

విని విని "దివాన్జీకీ, ఠాణేదారుకీ పుట్టగతు లుంటాయా?" అంటూ పెద్దమ్మ వళ్ళు కొరికింది.

అలివేణీ రంగనాయికా కంట తడి పెట్టుకున్నారు.

"ఈతుచ్ఛుల్ని దేవిడీమన్నా చేయించవలసిందే" అంటూ శాస్త్రి, యాజులూ అగ్గయిపోయారు.

ఇంతలో పాలకీ వచ్చింది.

ఒక్కమాటు రంగనాయికనీ, అలివేణినీ చూసి పెద్దమ్మ శంకరప్పకి కనుసన్న చేసింది.

వెంటనే "అలివేణీ? రంగనాయికా!" అంటూ మహోత్సాహంతో లేచి అత నందుకున్నాడు.

"ఇప్పటికి నేను వచ్చినపని అయింది. అనుకున్నదీ నెరవేరింది. ఇక రేమిది రేమయినా యిబ్బంది లేదు. ఆదివర కెందరితో ఆడినా, మహారాజుతో యెత్తు వేశాక అటో యిటో అది తేలిపోయే దాకా మరెవరితోటీ ఆట వెయ్యకూడ దనుకున్నాను. శాస్త్రిగారితోటీ యాజులుగారితోటీ కూడా ఆడలే దంటే యిక చెప్పడాని కేం వుందీ? ఇక ఆ వ్రతం పూర్తి అయినట్టే; కనక యివాళ రాత్రి—తెలిసిందా? మీయింటికి వచ్చి యెత్తు వేస్తాను. మీకోరిక తీరుస్తా"

శాస్త్రీ యాజులూ చాలా ఆనందించారు.

అలివేణీ రంగనాయికా పొంగిపోయి, అంతలో కొంచెం సిగ్గుపడ్డారు.

ఈసమయంలో చాకలిపెద్ద వచ్చి "హాజర్ బాబయ్యా!" అని విన్నవించి పాలకీదగ్గిరికి వెళ్ళిపోయాడు.

అందరిదగ్గిరా సెలవు పొంది, కళ్ళు తిప్పుకుంటూ శంకరప్పని

పొగుడుతూ రామసోదెమ్మ దారి చూపించగా "అలాగాండి? బాగుందండి. అవును, మంచిబట్టలే వుంటే వారి యెదట రాచ కొమాళ్ళ విశేషం యేమిటండి? మీమేలు మరిచిపోరండి వారు. దీపాలు పెట్టాటప్పటి కివాళ భోజనం పెట్టించండేం అక్కయ్య గారూ!" అని గునిసి, రంగనాయిక, దొడ్డిదారిని కోటకి వెళ్ళి పోయింది.

ఆమె కోట సమీపిస్తూం దన్నంతవరకూ జాప్యం చేసి శంక రప్ప లేచాడు.

వెంటనే అలివేణి అతని పాదాలు అంటి కళ్ళకద్దుకుని, ఒక్క మాటు అతని కళ్ళల్లోకి సవిలాసంగా చూసి, తానే కరిగిపోయి, నును సిగ్గుతో పక్కకి తప్పుకుంది.

"అబ్బూరాయ్ అగ్రహారం, జ్ఞాపకంవుందా? మరోటయితే నేవొప్పనుసుమా" అంటూ పెద్దమ్మ సాగనంపగా, శాస్త్రి యాజులు గార్ల బుజాలమీద చేతులువేసుకుని పున్నమ చంద్రుడు లాగ మెరిసిపోతూ శంకరప్ప పాలకీదగ్గిరికి బయలుదేరాడు.

## ౨౯

పాలకీలో కాలు గుమ్మంలో పెట్టాటప్పటికి వూచలాగవచ్చి మహా రాజు శంకరప్పుని కౌగిలించుకున్నాడు.

కళ్ళు తెరిచి చూశాటప్పటికి ఆ కౌగిలింతతోనే యిద్దరూ సింహా సనం మీద కూచుని వున్నారు. మహావిలవఅయిన తలకాయకు తగినసత్తాలేక, దివాన్జీ మెడ జవజవలాడి నోటకూరకాడ అయి పోయింది.

సభ్యులందరికంటే ముందు తన కంఠంసవరించుకుని "శంకరప్ప గారూ!" అని సంబోధించాడు మహారాజు.

"ఏమి సెలవు జగత్ప్రభూ?" అంటూ శంకరప్ప దోసిలి యొగ్గాడు.

"తమరు నా ఆట కట్టేశారండీ"

"ఎంతమాట? నిర్హేతుకజాయమాన కటాక్షంవల్ల తమరలా సెలవిప్పిస్తున్నారే కాని, యేలినవారి ఆటకట్టడానికి నేనెంతవాణ్ణి మహాప్రభూ?"

"అలా కాదండీ! స్పష్టంగా నేనోడిపోయాను. చదరంగంలో నాకిదే మొదటివోటమి. ఓటమివల్ల మనుష్యుల మానసికావస్థలెలా పరిణమించేదీ నాకిప్పుడే బోధఅయింది. అయితే, ప్రతిక్షీరసికుడైతే వోటమికూడా ఆనందకరంగా వుండేటట్టే కనపడుతోందండీ"

"ఒక్క మనవి మహాప్రభూ!" అంటూ అందుకున్నాడు అప్పల నరసింహరాజు.

"నా అంచనా తప్పిపోలేదు. తమరుభయులూ ఆటకి కూచుంటే యెవరోడినా పర్యవసానం యిలాగే వుంటుందని నేనాదిలోనే నిశ్చయించుకున్నాను. అంచేతే యెంతజంకినా, శంకరప్పగారిని నేను బలవంతపరచ గలిగాను. నిజంగా, ఆరుమాసాల తీవ్రస్పర్ధకి ఫలితంగా, చివరికి, విజితులూ విజేతలూకూడా సమంగా ఆనందించడం—యిది మానవప్రవృత్తికి అతీతమైన విషయం"

"తమరింకొకటికూడా సెలవిప్పిస్తారని తలుస్తున్నాను"

"చిత్తం మహాప్రభూ, మనవి చేసుకుంటున్నాను. ఈ ఫలితానికి సన్నికృష్టకారణం శంకరప్పగారి ప్రవృత్తిన్నీ. ఏమంటే? శంకరప్పగారి యీ విజయం సామాన్యమైనదా? కాని, దానికి సంబంధించిన పొంగు లేశమయినా వారిదగ్గిర కనపడుతోందా? వారి మొగంమీద యెంత సాత్త్విక తేజస్సు భాసిస్తోందో చిత్తగించారా?"

"అదీసంగతి. దానివల్ల పరిసరాలన్నీ అకలుషా లయినవి. బ్రహ్మతేజస్సంటే అదేకదూ?"

"చిత్రం చిత్రం"

దీనిమీద చేతులు జోడించుకుని "శ్రీహరీ! మాటలురాని కొండిక వాణ్ణిపట్టుకుని యిద్దరు ప్రభువులుఅలా సెలవిప్పించడం ధర్మమా?" అంటూ అందుకున్నాడు శంకరప్ప; కాని, మాటకి అడ్డంవచ్చి మహారాజు "ఇద్దరుకాదెంతమందయినా యీపని చెయ్యవలసిందే. ఏమంటే నిజంగా చదరంగం ఆడతగ్గవారు తమరొక్కరే కనబడు తున్నారు. ఇందులో తమర్ని జయించగలవాడింతవరకూ పుట్ట లేదు ఇకముందూ పుట్టబోడు" అన్నాడు.

శంకరప్ప మొగంవంచుకున్నాడు.

"తమచేతిలో అపజయం పొందడంకూడా వొక భాగ్యంలోనే లెక్క"

"................."

"మనస్సు నిలుపుకోలేక ఆట వెయ్యడమేకాని, యెవరితో వేసినా చంటిపిల్లలతో ఆడుతున్నట్టే వుండేది. తమతో ఆడ్డం మాత్రం కత్తులమీద పరీక్షా, సేలవిడి చిసాములాన్నూ"

"ఇప్పటివాకా నేనున్నూ—" అంటూ మోదుప్పకేకతో ప్రభువు కేసి తిరిగి అందుకున్నాడు శంకరప్ప.

"అనేకులతో చదరంగం ఆడాను అనేక మాట్లాడాను. అతి నిర్లక్ష్యంగానూ ఆడాను. అందర్నీ ఓడించాను; కాని, పెద్దాపురం కోటలో అడుగుపెట్టినప్పుడు కాళ్ళు వొణికాయి. తమ యెదట కూచున్నప్పుడు గుండెలు కొట్టుకున్నాయి. తమ దివ్యతేజస్సు నన్ను విభ్రాంతుణ్ణి చేసేసింది. తీరా యెత్తువేసిన తరవాత తమతో ఆటని



8—15

కూచోడం దుస్సాహసం అని బోధపడింది. పట్టుపట్టి ఏలినవారితో ఆడినందుకు నేను సిగ్గుపడిపోతున్నాను మహాప్రభూ.''

''సిగ్గా? ఓడిపోయిన నాకే ఆనందంగా వుందే, తమ కేలా సిగ్గు! ఆట మొదలుపెడితే యెవరికో ఒక్కరికే గెలుపు. రెండో వారోడి పోవలసిందే. అయితే, అంతమాత్రాన వారిని తీసిపారెయ్యవలసిందేనా? నిజంగా, చూడవలసినవి శక్తిసామర్థ్యాలూ, యుక్తిప్రయుక్తులూ కాని, జయాపజయాలు కావు''

ఇలా అని మహారాజు తనకేసి చూడగా ''ఏలినవారు సత్యం సెలవిప్పించారు'' అంటూ అందుకున్నాడు అప్పలనరసింహరాజు.

''శంకరప్పగారెంతకేనా సమర్థులు; కాని, వారు తమ శక్తి యెంతటిదో యెరగరు. వారిని కోటకి తీసుకురావడం నాకు చాలా కష్టం అయిపోయింది''

''దీనికంతటికీ కారణం నా శపథం. నేనయ్యా మహామొనగాణ్ణని యెక్కణ్ణుంచో వచ్చి, యెత్తువేశాటప్పటికి చేతులు వెలవేస్తె యెలాంటివాడూ కూడా సహించడం కష్టం. అంచేత అసమర్థులూ, కళాజీవులు కానివారూ సిద్ధపడకుండా వుండడానికే నేనీ శపథం పట్టాను గాని, మరొకందుకు కాదు. దీనికి నిదర్శనం, వచ్చినవారోడిపోతే తల కొట్టించివేస్తానన్నానుకదా, నేనే వోడిపోతే?''

''చిత్రం చిత్రం, నేనామాటే మనవి చేసుకున్నాను శంకరప్ప గారితోటి. కొంత యోచించగలవారికెవరికయినా యిది తోచే ప్రశ్నే. ఇందులో ఏదో గంభీరార్థం వుండకపోదు—''

''వుండకపోదంటే తమరు గ్రహించలేనిదా యిది? అయినా నేనే మనవిచేసుకుంటాను''

ఇలా చెప్పి, శంకరప్పకేసి తిరిగి, చేతులు కట్టుకుని, ''దాసో

హుమ్'' అంటూ మహారాజు శిరస్సు వంచుకున్నాడు.

అది చూసి అప్పలనరసింహరాజు చకితుడైనాడు.

శాస్త్రీ యాజులూ నిర్విణ్ణు లయిపోయారు.

విజయరామరాజు దివాన్జీకేసి నిరసనగా చూశాడు.

సభ్యు లందరూ గతుక్కుమనిపోయారు.

అంతకు ముందే "శ్రీహరీ! శ్రీహరీ!'' అంటూ చెవులు మూసుకుని "ఎంతమాటా? కిరీటమాంధాతలు మమ్మేలినవా రెక్కడ, క్షుద్ర భిక్షుకుణ్ణి నేనెక్కడ మహాప్రభూ? తమ రంతమాట సెలవిప్పిస్తే నేను భరించగలనా?'' అంటూ శంకరప్ప తహతహలాడిపోయాడు.

## 30

ఒక్క క్షణం గడిచాక, ఆనందబాష్పాలు కొనగోట చిమ్ముకుంటూ "శంకరప్పగారూ!'' అని మళ్ళీ సంబోధించాడు మహారాజు.

"చిత్తం మహాప్రభూ!'' అంటూ అంజలిబంధంతో శంకరప్ప సావధాను డైనాడు.

"ఇంతటి ఉత్కృష్టానందం నాకింతవర కెప్పుడూ కలగలేదు. దీనికు గుర్తుగా, తమ ప్రతిభముందు నాసంపత్తి అణువునూ పోలదు గాని, అయినా చంద్రున కో నూలుపో గని శాస్త్రమే కనక, పెద్దాపురం రాజ్యంలో వున్నది యేమయినా సరే తమకు సమర్పించుకుంటాను సెలవిప్పించండి''

"నాకు బహుమానమా మహాప్రభూ?''

"అవును......కాకేమి?......తమకంటే బహుమానార్హులు మరెవరూ?''

"పోనీ, యిప్పటికే నేను బహుమానం పొందివున్నాను కదా?''

"అదెలాగా?''

మహారాజు, అప్పలనరసింహరాజుకేసి చూస్తూ యిలా అనగా, ఇదంతా వోరకంట చూస్తూవున్న దివాన్జీ యీవిందుసభలో తాను చేసిన పని బయటికి వచ్చేస్తుందేమో అని కుతకుత లాడిపోతూ తల కాయ తీసుకువెళ్ళి పొట్టలో పెట్టుకున్నాడు.

అది చూడ మని శాస్త్రియాజులుగార్లకు కన్నుగీటి శంకరప్ప మళ్ళీ అందుకున్నాడు.

"వత్సవాయవారి సాహసౌదార్యాలు చాలా విన్నాను. ప్రకృతం సకృచ్ఛంగా చూస్తూనూ వున్నాను. నాకు ఆనందపారవశ్యం కలుగుతోంది. ఇదిలా వుండలా: కందనోలిసంఘటన చిరస్మరణార్హమే కాని, మాచెల్లెలు, చంద్రవదన, అది చాల దని పూర్వ పక్షం చేసేసింది. పెద్దాపురం మహారాజులుంగారితో కూడా యెత్తువేస్తే కాని, తనకి తృప్తి లేదని ఆమె నన్ను తరిమిపంపింది. నేను చాపలం జయించలేక పోయినాను. మురిసిపోతూనే వచ్చాను; గాని పెద్దాపురం ప్రవేశించడం చాలా సాహసం అని అనుభవం అయింది. ఏమయినా ముళ్ళకంచెల్లో బాధపడి చివరికి సహకారం పొందగలిగాను. ఏలినవారితో వైక్క— ఆట ఆడగలిగాను. తమతో అర్థాసనమున్నూ అధిష్ఠించగలిగాను. తృప్తిఅయింది. నాబతుకున్నూ సఫలం అయింది. ఒక పిచ్చిబ్రాహ్మడి కిది సంభవమా మహాప్రభూ? ఒక దరిద్రదేవత కిది లభ్యమేనా రాజాధిరాజా? ఇంతకంటే నేను కోరతగినట్టిన్నీ పొంద తగినట్టిన్నీ బహుమానం మరేం వుంది భూలోకదేవేంద్రా?"

దీనికి మహారా జేదో చెప్పదలచుకుంటూ వుండగా "నేను మనవి చేసుకుంటాను" అంటూ అప్పలనరసింహరాజు లేచాడు.

మహారాజు "సెలవిప్పించండి" అన్నాడు.

"సంగతంతా తమకి విశద మయ్యే వుంది. దాన్నిబట్టి చూస్తే తమ దర్శనం లభించడమూ, తమతో యెత్తువెయ్యగలగడమూ— ఇవే శంకరప్పగారికి మహా మేరువులు; కాని, వారి కళాభిజ్ఞత—"

"అదీ సంగతి. వారి కళాసంపద మన మందరమూ కొల్లలాడి నాము. దానికి పరిహారం చూపించవద్దూ? ఇంతే కాక: ఏవిద్యలో నయినా, యేకళలో నయినా నిష్ణాతు లైన వారికి వత్సవాయివారి సత్కారం లేకుండా వుండగూడ దని మా మూలపురుషుల శాసనం. దానికి తప్పడం మాకు ధర్మమా, సాధ్యమా? విద్యలకు మా రాజ్యం లో అయినా అనాదరం జరగకూడదే, యిక నాదగ్గిరా అది జరగ వలసిందీ?"

"నాదగ్గిర యేలేశమాత్రమైనా కళాభిజ్ఞత వుండడం నిజమే; కాని, అది చెప్పుకోతగ్గది కాదు. నాయెడల శ్రీదాట్ల అప్పలనర సింహరాజు బహద్దరువారికి నిర్హేతుకంగా పుత్రవాత్సల్యం కలిగి పోయింది. భీమవరపుకోట నాన్నగారు దానికి దోహదం చేశారు. ఆ రసికప్రభువుల ఆదరవాత్సల్యాలే నన్ను తమ సన్నిధి చేర్చాయి గాని, నాశక్తిసామర్థ్యాలు కావు"

"అయితే, మామయ్యగారికి అలాంటి ఆదరవాత్సల్యాలు తమ యెడల మాత్రమే కలగడాని క్కారణం?"

ఉన్నట్టుండి విజయరామరాజిలా అడగ్గా మందహాసం చేస్తూ "మరి వారి సందేహం తీర్పించండి" అన్నాడు మహారాజు.

అంజలిబంధంతో విజయరామరాజుని నిర్దేశిస్తూ "ఆదిలోనే వారికి నచ్చచెప్పుకోలేక పోయాను. ఇలా నిలవతీసి అడిగితే యిప్పుడేం చెప్పుకోగలనూ? కాక జగత్ప్రభువులతో చర్చసాగించడం అను చితం" అంటూ వినయ విధేయతలు కనపరిచాడు శంకరప్ప.

అవ్యవధానంగా :"కనక తమ అభీష్టం సెల విప్పించండి" అన్నాడు అప్పలనరసింహరాజు.

"తప్పనిసరి కావడంవల్ల విన్నవించుకుంటున్నాను. అయితే, నాకొక తృప్తి లేకపోలేదు. అదేమిటంటే? ఎదటవున్నది మహా సముద్రమే. కాని నాచేతిలో వున్నది బుడ్డిచెంబు మాత్రమే. మరి ప్రకృతం, మహాప్రభూ! నేను నిరుపేదను. నిరుపేదలకు కావలసినవి కూడూ గుడ్డానూ. వీటిలో యేలినవారు నాకొక్క అన్నంమట్టుకు పెట్టిస్తే, అదే మహామేరువుగా సంతోషిస్తాను"

ఈమాట అనేటప్పుడు శంకరప్ప చాలా నిర్లిప్తత కనపరిచాడు. అదిచూసి అందరూ మొగమొగాలు చూసుకున్నారు.

శాస్త్రి యాజులూ "కొంపతీసి యేదో కొస్తమాన్యంకోరేస్తారా యేమిటి శంకరప్పగారు" అంటూ అదుర్దాపడిపోయారు.

ఈధోరణి గుర్తించుకోలేక మహారాజు తనకేసి చూడగా, అప్పలనరసింహరాజు "విందాం మహాప్రభూ" అన్నాడు.

"మనవిచేసుకుంటున్నాను" అని శంకరప్ప, మాట అప్పల నరసింహరాజు కందించి, మహారాజుకేసి తిరిగాడు.

"నాయిష్టక్రీడ చదరంగం. దానివల్లనే యేలినవారికి నాయెడల ఆదరభావం కలిగింది"

"చిత్తం" అన్నాడు మహారాజు.

"కనక నా కోరిక కూడా దానికి సంబంధంగానే వుండడం వుచితం"

"సెలవిప్పించండి"

"చదరంగానికి అరవైనాలుగు గదులు. మొదట; మొదటి గదిలో వొక వడ్లగింజ వుంచండి. తరవాత, రెండో గదిలో

రెండు, మూడోగదిలో నాలుగు, నాలుగోగదిలో యెనిమిది— యిలాగ వెళ్ళినకొద్దీ రెట్టింపు చేయిస్తూ నాకు వడ్లగింజలు దయ చేయించండి మహాప్రభూ!''

ఇలాఅని శంకరప్ప వొక్క క్షణకాలం మహారాజుకేసి చూశాడు. తరవాత సన్నిహితులకేసి చూశాడు. చివరికి సభఅంతా కలయచూశాడు.

కాని, వొక్కరూ తనమాట బోధపరచుకున్నట్టు లేకపోగా మందహాసంచేస్తూ, కనపడీ కనపడనట్టొకమాటు తల వంకించు కున్నాడు.

శాస్త్రికీ యాజులికీ కూడా అది బోధపడలేదు; కాని, ''యిందులోకూడా గొప్పచాతుర్యం వుంటుంది. వుండితీరుతుంది'' అనుకుని, యింతలో శంకరప్ప ధోరణి చూసి ''ఫ్రాన్!వుందోయ్'' అని వొకరూ ''ఓహో! వుండకేమోయ్?'' అని వొకరూ తలలెగర వేసుకుంటూ చూసుకున్నారు.

అప్పటిదాకా కమిలి, కుమిలి, వుడికి, మాడిపోతూ వుండిన దివాన్జీ ''పుట్టెడుగింజలయితే పారబోస్తాను పట్టుకుపో'' అనుకుని తలకాయ విసిరేసుకున్నాడు.

ఉండుండి ''మళ్ళీ మనం మధ్యాహ్నం కలుసుకుందాం'' అన్నాడు మహారాజు.

''చిత్తం చిత్తం'' అన్నాడు శంకరప్ప.

ఇద్దరూ సింహాసనందిగారు.

సభఅంతా ఉబ్బెత్తుగా లేచింది.

అర్ఘ్యాలదగ్గిర కళ్ళతో సెలవుపుచ్చుకుని మహారాజు వాసగృహా నికి వెళ్ళిపోయాడు.

## ౩౧

గద్దె దిగీదిగడంతోటే అప్పలనరసింహరాజూ, విజయరామరాజూ శంకరప్పని కౌగిలించుకున్నారు.

శాస్త్రీ యాజులూ పాదాభివందనం చేశారు.

ఇంతలో మూర్తి మొదలయినవారు వచ్చి ముట్టడించేశారు.

ఇక్కడ యిది యిలా జరుగుతూవుండగా, సేనాధిపతివచ్చి కనుసన్న చేసి, అప్పలనరసింహరాజుని యెడంగా తీసుకువెళ్ళాడు.

"చిత్తగించారా?"

"సెలవిప్పించండి"

"తాణేదారుకి దేవిడీమన్నా అయిపోయింది. పెద్దాపురంలో వుండడాని క్కూడా సెలవు లేదు"

"ఒ—క—టి"

"దివాన్జీవారి విషయం సందేహాస్పదంగా వుంది. కేవలమూ దేవిడీమన్నా కాకపోవచ్చుగాని—"

"రెండు పూర్తి చేయిస్తారనుకున్నాను"

"కావాలనేనా తమ నిశ్చయమున్నూ?"

"ఇంకా—మెల్లిగా—"

"నిజమే కాని—మనిషికి పర్యశేయు స్వభావం—"

"శేషమయినా వుందిటండీ?"

"లేదు లేదు"

"ప్రత్యక్షశయ్యా కనపరిచిన బులుసు రామగోవిందశర్మగారిని కూడా యిలాగే అగౌరవపరిచారు కాదుటండీ ఈయన?"

"ఛ్చ"

"గొట్టుముక్కల రామభద్రరాజు మామయ్యగారు పూనుకుం

రాకపోతే అలివేణికి దివాణంలో ప్రవేశం కలగనిచ్చును టండీ ఈయన? నృత్యం విషయంలో పెద్దాపురం రాజసభకి అది తెచ్చిన పేరు మరేరాజసభకి మరేనర్తకి తేగలిగిందండీ?"

"జ్ఞాపకం వుంది"

"రామతీర్థం వైణికులు పరమశివశాస్త్రిగారు విసిగిపోయి ముందుకి సాగిపోడాని కారణం ఈయన కాదుటండీ? వారు చిక్కాన ప్రోలు దాటి వెళ్ళకపూర్వమే రేమనుగు భీమరాజుగారు మహారాజులుంగారికి సంగతి విన్నవించి వుండకపోతే, అప్పుడు పెద్దాపురం సంస్థానాని కెంత అప్రతిష్ఠ వచ్చి వుండేదండీ?"

"నిజమే"

"ఢిల్లీ అత్తరువర్తకుడు షుకురల్లీఖాను, గులాబీ అత్తరుసీసా కోటగోడకి వేసి కొట్టడానికి కారణం ఈయన కాదుటండీ?"

"అవునవును"

"లాహోరుపస్తాదు దళపతిసింగు, ఇంకెవరూ లేరూ?" అంటూ కొలువువ్వి తొడ చరిచి మీసంమీద చెయ్యివేసుకున్నప్పుడు, యీరంకి వీరావధానులుగారు జబ్బచరిచి నిలవకపోతే, పెద్దాపురం రాజ్యం నామరూపాలు నిలిచి వుండునుటండీ? నల్లపరాజు వెంకటపతిరాజు దద్దయ్యగారు అడ్డుకున్నారు కనక సరిపోయింది. కాని, అవధానులుగారిని ఈయన కోటలో అడుగుపెట్టకుండా చెయ్యాలని చూశారు కాదుటండీ?"

"యథార్థమే"

"అప్పుడదా? ఇప్పుడిదా? ముందేనా ఈయన బుద్ధి వక్రించకుండా వుంటుందని హామీవుందా? అయినా మహారాజులుంగారింకా వ్రాపికపట్టడం బాగుందా?"

"తమరు సెలవిప్పించింది ఏదీ కాదనను. ఈయన్ని సమర్థించాలేను; కాని, లెక్కల్లో వున్న ప్రావీణ్యమూ, పనుల్లో వున్న శ్రద్ధా ఈయన్ని కాపాడుతున్నాయి. అయితే, కళలన్నా, విద్యలన్నా మహారాజులుంగారు చెవికోసుకు నేటప్పుడు ఆవిషయాలలో ఈయన్ని కలగచేసుకోకుండా వుంటే బాగుండిపోవును"

"మహారాజొక్కమాటు గట్టిగా మందలిస్తే"

"తమ కోసం దేహం అక్కర్లేదు. ఇవాళ మహారాజు వీరభద్రావతారం తాల్చేశారు"

"నిజంగా?" అని కనుబొమ్మ లెగరవేసుకుంటూ, తల వూపుతూ అడిగాడు అప్పలనరసింహరాజు. మహారాజు, దివాన్జీయెడల ప్రాతికూల్యం చూపించ లేడని అతని నమ్మకం. అంచేత యిది వినేటప్పటి కతనికి చాలా ఆశ్చర్యం కలిగింది.

"ఆవుగ్రరూపం చూసి నేనే జంకిపోయాను"

"ఐనా ఏమయినా—"

"క్షేమన్నాస్తి. అసలు కన్నెత్తి చూడగలిగితేనా?"

"అలా గేం?"

"ఈజన్మలో పోదు దివాన్జీగారికి ఆ వుదుటు"

"తమ కలా తోచింది"

"తోచడ మేమిటి, మరొకరయితే యీ పాటికి వుద్యోగం వదలుకుని—"

"అంతపని కాదు లెండి ఈయనవల్ల"

"నిజమే. కాని, కొన్నాళ్ళపాటు మొగం చూపించలేరు"

"ఐతే, యిందుకే సంతోషిద్దాం ఇప్పటికి"

ఇంతలో చల్లా జగ్గప్ప వచ్చి పిలవగా సేనాధిపతి "సెలవు

అంటూ లోపలికి వెళ్ళిపోయాడు. అప్పలనరసింహరాజు శంకరప్ప దగ్గిరికి బయలు దేరాడు.

## ౩౨

అప్పటికి జాము పొద్దుంది.

పెద్దాపురపట్నం అంతా కోటలో వుంది.

కోట అంతా సభా భవనంలో వుంది.

సభ అంతటా లక్ష్మీ సరస్వతీ లాస్యం చేస్తున్నారు.

ఒకవిధంగా, క్షణాలు యుగాలూ, మరోవిధంగా యుగాలు క్షణాలూ అయిపోతున్నాయి.

సముద్రతీరాన లాగ, ఒక వేపున తరంగకల్లోలమూ వినబడుతోంది. మరోవేపున గాంభీర్యమూ విరాజమానం అవుతోంది.

ఈస్థితిలో, సభలో వున్నవారి కందరికీ యెవరికి వారికే మనస్సు గుబగుబలాడిపోయింది.

ఉత్తరక్షణంలో చల్లా జగ్గప్ప ద్వారంలో అడుగు పెట్టాడు.

అతగాణ్ణి చూసి చోపుదారులు బరాబరులు చేశారు.

ఆ సందట్లో వేత్రహస్తులు ప్రవేశించారు.

ఉప్పాడ జరీపస్తాలూ, కాశ్మీర దుశ్శాలువులూ, సింహతలాటం మురుగులూ, భుజబందులూ, కెంపుల కంఠమాలా, మకరకుండలాలూ, బంగారపు గోవతాడూ, రవ్వల వుంగరాలూ ధరించి, నడికట్టున కందనోలి కటారితో, అపరమన్మథుడయిపోయిన తంగిరాల శంకరప్ప చెయ్యి పట్టుకుని, రెండుపక్కలా గుబ్బెతలు వింజామరలు వీస్తుండగా, శ్వేతచ్ఛత్రం వహించి మరొకతె అడుగుల్లో అడుగులు వేసుకుంటూ అనుసరిస్తూ వుండగా, వాళ్ళ వెనక, సాక్షాత్తూ శ్రీమన్నారాయణమూర్తిలాగ భాసిస్తూ మహారాజు విజయంచేశాడు.

వెంటనే సభ్యు లందరూ వుబ్బెత్తుగా లేచి నుంచున్నారు.

ఈ అడావుడిలో, దంతపుబలమూ, దంతప్పనిచేసిన చదరంగం బల్లా పట్టుకుని విరిబోణీ, రత్నఖచితమైన చంద్రహాసం పట్టుకుని రంగనాయికా వచ్చారు.

తరవాత, షరాబు అనుసరిస్తూ వుండగా, సేనాధిపతి వచ్చాడు.

అప్పటి కప్పుడే మహారాజు శంకరప్పతో సింహాసనం అలంకరించాడు.

ఆసన్ని వేశం, సూర్యచంద్రు లిద్దరూ ఒక్కమాటే — ఒక్కచోటే వుదయించిన ట్టుంది.

సభ అంతటా ఒక విలక్షణతేజ స్సావరించినట్టూ అయింది.

దాంతో, సోత్సాహులై సభ్యు లందరూ కూచోగా, వుద్రిక్తులై వందిమాగధు లొక్క గడియసేపు కైవారాలు చేసి వూసరిల్లారు.

* * *

"ఏమి లెక్క తేలిందా?" అని అడిగాడు మహారాజు.

"చిత్తం, తేలింది మహాప్రభూ! అయితే, వారి కోరిక తీర్చాలంటే పెద్దాపురం రాజ్యంలోనే కాదు, త్రిలింగదేశం అంతటా వరాసగా నూరుసంవత్సరాలు పండిన ధాన్యం అయినా చాలదు" అంటూ షరాబు కాగితం మహారాజు కందించాడు.

"అయ్యో!" అని చకితు డైపోయాడు మహారాజు.

శంకరప్ప యేమీ యెరగనట్టు చల్లగా మొగం వంచుకున్నాడు.

విజయరామరాజు "నేను మనవి చేసికున్నాను కామా?" అన్నట్టు అప్పల నరసింహరాజుకేసి చూశాడు.

శాస్త్రి యాజులూ విజయగర్వం ప్రకటించుకున్నారు.

తరవాత, వొక్క క్షణం ఆలోచించి మహారా జందుకున్నాడు.

"శంకరప్ప గారూ!"

"చిత్తం మహాప్రభూ!"

"వడ్లగింజలతో కూడా నన్నోడించేశారు తమరు"

"తమ రంతమాట సెలవివ్వించడం—"

"ఇదేమంత మాటా? ఆటలో తమ రెంతవారో, మాటలో అయినా నే నంతవాణ్ణి కాలేకపోయాను. అయితే, వత్సవాయి వారిలో నేటివరకూ ఆడితప్పినవారు లేరు; కనక తమరు కోరిన ధాన్యానికిబదులుమా రాజ్యమేసమర్పించుకుంటున్నానుస్వీకరించండి"

ఇది విని, సభ్యులు స్తబ్ధు లయిపోయారు.

"ధర్మమా జగత్ప్రభూ?" అంటూ మోడ్పుకేలితో నమ్రుడై నాడు శంకరప్ప.

"ఏమీ, ఎందుకు కాదూ?"

"నేను పుట్టినప్పూరే తూర్పూ పడమరా యెరగనే, నా సంసారం నిర్వహించుకోడమే నాకు చేతకాదే, నే నీ విశాలరాజ్యం యేమి చేసుకోనూ?"

"తమ రది యేమయినా చేసుకోండి. నేను మాట అనేశాను. అది జరిగితీరవలసిందే"

"మమ్మేలినవారి మాట వరహాలమూటే. అది చెలామణీ అయి పోవలసిందే. అయితే, తమరు చెల్లించవలసింది నాకు దయచేసిన మాటే గాని మరోమాట కాదు మహాప్రభూ!"

"నేను మాట మార్చలేదే?"

"మార్చించారు జగత్ప్రభూ!"

ఉలిక్కిపడి "నిజమా?" అన్నట్టు అప్పలనరసింహరాజుకేసి చూశాడు మహారాజు.

"అవు" నన్నట్టు మొదట మహారాజుకి మందహాసం అందించి, అప్పలనరసింహరాజు, తరవాత శంకరప్పకేసి చూసి "సెలవిప్పించండి" అన్నాడు.

"జగత్ప్రభువులు నాకు వాగ్దానం చేసింది రాజ్యంలో వుండు కున్నది యేదయినా సరే అనే కాని, రాజ్యానికి రాజ్యమే కాదు" అని శంకరప్ప అప్పలనరసింహరాజుతో అన్నాడు.

అది విని మహారాజు విభ్రాంతు డైనాడు.

"అదీ సంగతి. శంకరప్పగారు సర్వతోముఖ ప్రజ్ఞావంతులు. ఇక వారి దగ్గిర చాతుర్యానికీ, ఔచిత్యానికీ కొదవ యేలా వుంటుందీ?" అని మహారాజుతో విన్నవించి, అప్పలనరసింహరాజు, శంకరప్పని చూసి "కనక తమ వాంఛితార్థం యేమిటో సెలవిప్పించండి" అన్నాడు.

వెంటనే శంకరప్ప "ఒక బ్రాహ్మణ కుటుంబం సుఖంగా జీవించడానికి చాలినంత వృత్తి దయచేయిస్తే నాకదే మహామేరువు జగత్ప్రభూ!" అన్నాడు.

ఇది విని, రాజబంధువులూ రాజపురుషులూ తేరుకున్నారు.

అప్పలనరసింహరాజూ, విజయరామరాజూ అది కూడా గుర్తించి చకితు లైనారు.

సభ్యు లందరూ ఒక చివరినుంచి మరొకచివరికి విసరబడ్డటయి పోయారు.

ముఖ్యంగా శాస్త్రి యాజులూ నిరుత్సాహ పడిపోయారు.

మహారాజు సభ అంతా కలయచూశాడు. అందరి యింగితమూ గుర్తించాడు.

శంకరప్ప వేసిన యెత్తుకూడా గమనించి "శంకరప్పగారూ!" అంటూ మెల్లిగా అందుకున్నాడు.

"నేను అనేక కళలలోనూ, అనేక శాస్త్రాలలోనూ ఆరితేరిన అనేకమందిని సందర్శించి, వారి నైపుణ్యం గ్రహించి ఆనందించి వున్నాను; కాని, తమలాగ నాకు పారవశ్యం కలిగించినవారు లేరు. తమ నైపుణ్యం సర్వతోముఖంగా వుంది. తమ సాన్నిధ్యం నాకనేకవిధాల వుత్తేజనం కలిగిస్తోంది"

శంకరప్ప నమ్రుడైనాడు.

"మరి ప్రస్తుతం. ఒకపనివాడొక సంవత్సరం కిందట యీ బలమూ, యీబల్లా తయారుచేసుకుని వచ్చాడు. ఇంతటి పనివాడితనం నే నిదివరకెప్పుడూ చూడలేదు. యోచించగా, యివి తమ కోసమే నిర్దేశించబడ్డవా అనిపిస్తోంది, కనక తమ రివి వుపయోగించండి"

శంకరప్ప అవి అందుకుని, కళ్ళకద్దుకున్నాడు.

"మరిన్నీ, చదరంగం బుద్ధిబలానికి సంబంధించినదే అయినా, అందులో యుద్ధతంత్రం అంతా నిగూఢంగా వుంది. ఆ ఆటలో నిపుణులైనవారు సేనాధిపత్యాని కర్హులు. సేనాధిపతికి చంద్రహాసం ప్రధానవస్తువు కనకనూ, నల్లచెరువు దగ్గిర పందిని పొడిచినప్పుడు తమరు కనపరచిన ధైర్యసాహసాలూ, శూరత్వమూ తమ అర్హతను వెల్లడించాయి కనకనూ, తమరు యీ చంద్రహాసం కూడా వినియోగించండి"

శంకరప్ప అదికూడా అందుకుని కళ్ళకద్దుకున్నాడు.

తరవాత వొక్కక్షణం వూరుకుని "శంకరప్పగారూ!" అని సంబోధించాడు మహారాజు.

"చిత్తం మహాప్రభూ!"

"తమ కోరిక తీర్చలేకపోయాను"

"తమ రలా సెలవిప్పించవద్దు. నేను వడ్లగింజల. కోరిక వుప సంహరించుకున్నాను మహాప్రభూ. వృత్తిమాత్రమే—"

"అదెంత పెద్దదో యిదంత చిన్నది. రెండూ నాశక్తికి అతీతాలే. కాగా, నేను తమ కోరిక తీర్చలేకపోవడమే మిగిలింది. ఇక మధ్యమార్గం తొక్కక తప్పదు. మారాజ్యంలో "తుని" అని వొకగ్రామం వుండడమూ, ఇలాంటి వైషమ్యం యేర్పడ్డప్పుడు, మహామహులను కూడా వొడ్డెక్కించడానికి, దాన్ని పురస్కరించుకుని వొక ధర్మసూత్రం యేర్పడి వుండడమూ తమరు వినే వుంటారు. దాన్నిపట్టి, తమరు మొదట కోరిన వడ్లగింజలూ కాక, తరవాత కోరిన వృత్తీ కాక, నేను, తమకి సర్వలక్షణసంపన్నమైన వొక సర్వాగ్రహారం సమర్పించుకుంటున్నాను"

శంకరప్ప, మొదట నమ్రుడై అంజలిబంధంతో ఆమాట అందుకుని, తరవాత "ఏలినవారి నిర్ణయం, మహౌదార్యలక్ష్యంగానే కాక శాస్త్రసమ్మతంగా కూడా వుంది. ఏమంటే? క్షత్రియకుమారుడికి విశాలసామ్రాజ్యం యెలాంటిదో, బ్రాహ్మణకుమారుడికి సర్వాగ్రహారం అలాంటిది. కనక మహాప్రసాదం మహాప్రభూ!" అంటూ చాలా ఆనందించాడు.

దీనిమీద అప్పులనరసింహరాజేదో అందామని లేవబోతూ వుండగా, మహారాజు ఇంగితం కనిపెట్టి, షరాబు లేచి నుంచున్నాడు.

"ఏలినవారు, శంకరప్పగారికి అందోళికాది పరివారం యేర్పాటు చేయించారు. వారికోసం మన పట్నంలో వొక దివ్యభవనం కూడా నిర్దేశించి సర్వసిద్ధంగా వుంపించారు.

సభ పుత్సాహతరంగితం అయిపోయింది.

"మరిన్నీ, ఏలినవారికి, శంకరప్పగారి దర్శనం కావడానికి

హేతుభూతురాలు పెద్దమ్మగారు. కనక, ఆమెకి, నూటపదహారు రూపాయల బహుమానమూ, సాలీనా నాలుగుపుట్ల ధాన్యం బరాతమూ యేర్పాటయింది"

ఇది విని "ధన్యుణ్ణి, ధన్యుణ్ణి" అంటూ చేతులు యెగరవేసుకుంటూ వుచ్చైస్వరంతో పలికాడు శంకరప్ప.

"పెద్దమ్మగారి ద్వారా యేర్పడిన హేతువు కార్యరూపం తాల్చడానికి సాధనభూతులు కొంపెల్ల రామశాస్త్రిగారూ, చిలుకూరి వెంకప్ప యాజులుగారూనూ. కనక, వారి కిద్దరికీ చెరొక నూటపదహారు రూపాయలూ బహుమానించారు ఏలినవారు"

శాస్త్రీ యాజులూ లేచి, నమ్రులైనారు.

శంకరప్ప వారికేసి తిరిగి మోడ్పుకేలితో నమ్రుడైనాడు.

మహారాజు శంకరప్పకేసి చూశాడు.

వెంటనే శంకరప్ప "ఒక్క మనవి" అన్నాడు.

"సెలవిప్పించండి"

"ఈనా అభ్యుదయానికి శ్రీదాట్ల అప్పలనరసింహరాజు బహద్దరువారూ, శ్రీ భీమవరపుకోట నాన్నగారూ—"

మాట సగంలో అందుకుని, మహారాజు "మేమే వారూ, వారే మేమూనూ. ఇంతా వారి యేర్పాటే. తమ వుద్దేశం యింకా యేమిటీ?" అని అడిగాడు.

"అంతే అంతే, మరేమీ లేదు మహాప్రభూ! శంకరప్ప సర్వాంగీణంగా సత్కరించబడ్డాడు "జగత్ప్రభూ!" అని, శంకరప్ప, మాటిమాటికీ వారిని అంజలిబంధంతో నిర్దేశిస్తూ చంటిపిల్లాడి లాగ ఆనందపారవశ్యం అనుభవించి, ఒక్క గడియసేపు నిరర్గళవాగ్ధా

టితో తన ప్రస్తావచాతుర్యం కూడా చూపించి, అందర్నీ సంతోష విహ్వాలులను చేశాడు.

## 33

శంకరప్ప అలా వూగుతున్నాడు.

అంతే.

వెంటనే సమ్మోహనాస్త్రంయొక్క పుంఖధ్వని లాగ యిలా వుపాంగం వినవచ్చింది.

దాన్ని ఉజ్జీవింపచేస్తూ మద్దెలగాడు చాటువేశాడు.

అవధానంగానే తాళాలు గర్జించాయి.

కన్నుమూసి తెరిచేటప్పటికి, యెగిరివచ్చి, అలివేణి, "సా" అంటూ పతాకహస్తంతో నృత్యం ప్రారంభించింది. సభ్యులలో, అలివేణి నృత్యం అనేకమాట్లు చూసినవారే, వోహో అని ప్రశంసించి తృప్తి రెచ్చగొట్టనారు కొందరు.

"నాటికి వస్సె నేడు" అంటూ చారెడేసి కళ్ళు చేసుకున్నవారు కొందరు.

"ఇది మన కళ్ళబడుతుందా?" అని తపస్సు చేస్తున్నవారు కొందరు.

మొత్తానికి వారందరూ కళ్ళప్పగించి వూరుకున్నారు.

అంతటితో వూరుకోక "చెల్లాయి యివాళ వొళ్ళు మరిచిపోతుంది" అనుకున్నాడు శాస్త్రి.

"అగ్రహారీకులైన శంకరప్పగారి వైభవాలకు మొదలు" అనుకున్నాడు యాజులు.